ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక




"తారాచౌదరి"

7-4-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

హిందూస్థానీ ప్రచార స్నాతకోత్సవం



విద్యార్థులకు జకీర్ హుస్సేనుగారు పట్టభద్రపత్రాలను ఇస్తున్న దృశ్యం.



మద్రాసు దక్షిణభారత్ హిందీ ప్రచారసభలో 14 వ సాంవత్సరిక స్నాతకోత్సవం, డాక్టర్ జకీర్ హుస్సేన్‌గారి అధ్యక్షతను జరిగింది. డాక్టర్ హుస్సేన్, స్నాతకప్రదేశానికి వచ్చినప్పటిదృశ్యం.




స్నాతకపట్టాలను అందుకొని నిల్చిన విద్యార్థులు



ప్రధాని నెహ్రూ మార్చి 31 న ఢిల్లీలో సాయుధబలాల ప్రదర్శనను ప్రారంభోత్సవం జరిపారు: బల్దేవసింగ్ అమృతకౌర్ గారలుకూడ వీక్షిస్తున్నారు.



ప్రధాని నెహ్రూకు బ్రిగడీర్ వర్డింగ్టన్ (ఎలక్ట్రికల్ మెకానికల్ ఇంజనీరింగ్ డైరెక్టర్) ప్రదర్శనాభాగాన్ని చూపుతున్నారు



పండిట్ నెహ్రూ, శంకరరావ్ దేవ్, వినోబాభావేగార్లు నిర్మాణ కార్యక్రమ విషయమై సంప్రదించుకొంటున్న దృశ్యం.



గాంధి స్మారక దినం నాడు మార్చి 30 న రాజఘాట్ సభలో ఉపన్యసిస్తున్న వినోబా భావే; ప్రధాని నెహ్రూ తదితర ప్రముఖులు ఈ స్మారకసభకు హాజరైనార


ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0 విడిప్రతిక అణాలు 0-4-0	ప్రతి బుధవారమున ప్రకటింపబడును	సంపుటము 40 సంచిక 30


ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

Founder: K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర ఫాల్గున బహుళ త్రయోదశి బుధవారము



'దేశి వృత్తులు'



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ ఏప్రెల్ నెల 7-వ తేది బుధవారము

కమ్యూనిస్టుల అరెస్టులు

రాష్ట్రప్రభుత్వములన్నియు ఒక్కసారిగ కమ్యూనిస్టులను చుట్టపెట్టి అరెస్టుచేయుటచూడ కేంద్రప్రభుత్వ ఆదేశముమీద ఈ చర్య తీసికొనబడినదని ఊహించిన అసమంజసము కాదు. కాని కేంద్రప్రభుత్వము మాత్రము పూనిక వహించుటకు బహుశః అనేక కారణము లుండవచును. కాంగ్రెసు అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ గారు మాత్రము కమ్యూనిస్టుపార్టీని నిషేధించుటకు తగిన నిదర్శనము ప్రభుత్వముకున్నదని, రాష్ట్రప్రభుత్వములు చర్యతీసికొనుటకు స్వాతంత్ర్యమున్నదనిరి.

కమ్యూనిస్టుల అరెస్టులు కలకత్తాలోని కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సమ్మె విషయమున అధినివేశప్రధాని పండిత నెహ్రూ పార్లమెంటులో చేసిన ప్రకటన అనంతరమే ఆరంభమైనవి. కేవలము కలకత్తా సమ్మెకారణమున ఈ చర్యకు దిగిరనుటకు వీలులేదు. సమ్మె రాజకీయముగ ప్రభుత్వమునకు సవాలు అని పండిత నెహ్రూ వర్ణించెను. అట్లనుటకు కారణము, దేశములో దౌర్జన్యముతో కూడిన పెద్ద ఉద్యమ మంతర్భాగమై, ప్రస్తుతము ఉన్న ప్రజాప్రభుత్వమును దౌర్జన్యము ద్వారా కూలదోయు ప్రయత్నమనెను. అంతేకాక దీనికి "అంతర్జాతీయ వ్యవహారముతో నిర్దుష్టమైన సంబంధము కలిగినట్లున్నదని" కూడ నెహ్రూ చెప్పెను. దీనినిబట్టి అసలు సమస్య బోధపడగలదు. పౌర హక్కులకు భంగము కలుగనట్లుగ భారతప్రభుత్వము వ్యవహరించుచున్నదని కొందరు ప్రచారము చేయవచ్చును. కాని అంత చిన్నవిషయము కాక వాస్తవమునకు అంతకన్న పెద్ద విషయమే ఇందు ఇమిడియున్నది. స్వాతంత్ర్యము వచ్చిన ఎనిమిది నెలలైన తరువాత భారతప్రభుత్వము ఈచర్యకు దిగినదనిన విశేష కారణమున్నట్లు వ్యక్తమగుచున్నది.

నెహ్రూ ప్రభుత్వమును . బలపరచెదమని మొన్నటివరకు కమ్యూనిస్టు ప్రముఖులు పలుకుచూ వచ్చిరి. కాని తమ కలకత్తా సమావేశమందు ఇంతవరకు అవలంబించిన విధానము సరియయినది కాదని తీర్మానించి, నూతన పార్టీ కార్యకర్తలను ఎన్నుకొనిరి. దీనికి అంతర్జాతీయముగ రష్యా అవలంబించుచున్న విధానమే కారణము. యూరపునందు కమ్యూనిస్టుపక్షములు అవలంబించుచున్న విధానమునే భారతదేశమునందు కూడ కమ్యూనిస్టులు అవలంబించవలసి యున్నది. అందువల్లనే ఉన్న ప్రభుత్వమునకు "రాజకీయముగ కలకత్తా సమ్మె సవాలు అనియు" "అంతర్జాతీయ వ్యవహారములతో నిర్దుష్టమైన సంబంధము కలిగియున్నదనియూ" నెహ్రూ చెప్పుట తటస్థించెను. కమ్యూనిస్టులను అరెస్టుచేసి, పార్టీని మాత్రము నిషేధింపక పోవుటవల్లకూడ విషయము బోధపడగలదు.

పండిత నెహ్రూ చెప్పినట్లు దౌర్జన్య పద్ధతులద్వారా ప్రభుత్వము నెదిరించి అల్పసంఖ్యాకులు తమ ఉద్దేశమును అధిక సంఖ్యాకులపై రుద్దతలచిన ప్రభుత్వ మనునది నిలువదు. కాని నేడు కమ్యూనిస్టుపార్టీ అదే చేయుచున్నది. "ప్రజల"ను పేరుతో తమ పక్ష నియంతృత్వమును స్థాపింప పూనుకొన్నది. అంతేకాక అందుకు ఏపని చేయుటకైనను సిద్ధము." అసలు ప్రజలకు ప్రభుత్వము బాధ్యతవహించుట అనునదియే ఉండదు.

నేడు రాష్ట్రములందు, కేంద్రమునందున్నవి ప్రజాప్రభుత్వములు. ప్రజకు బాధ్యతవహించినవి. వాటిని కాదని మార్చుటకు ప్రజకు అధికారమున్నది. ఈ రెండవపద్ధతిని కాపాడుటకే ప్రభుత్వము, కాంగ్రెసు, ప్రయత్నించుచున్నవి. దానికి భంగము కలుగకుండుటకుగాను ప్రభుత్వము ఏ చర్య తీసికొనినను బలపరచవలసి యున్నది. నియంతృత్వమనునది ఏ వర్గముదైననూ నిరోధించవలెను. నేడు ప్రపంచము దాదాపు రెండుపక్షములుగ చీలినది. ఒకటి ప్రజాసత్తాక సాంఘికవాదము (Democratic Socialism) రెండవది కమ్యూనిస్టు నియంతృత్వము. (Totalitarian Communism) భారతదేశము తన సంస్కృతిని బట్టి మొదటిదానినే వరింపవలసి యున్నది. అదిగాక కమ్యూనిస్టులకు భారతదేశము తమ పార్టీ పథకములో ఒక భాగము అంతేగాని, స్వయంసత్వముగా, పరిపూర్ణ అస్తిత్వము గలదిగా వారికి గోచరించదు.

ఇండియా-పాకిస్థాన్‌ల ఆర్థిక ఒడంబడిక

దేశవిభజన సమయమందు ఇండియా, పాకిస్థాన్‌లుగా విడిపోవుచున్న రాష్ట్రముల మధ్య ఆర్థిక సంబంధములు అవిభక్తభారతదేశములో ఆయా రాష్ట్రముల మధ్యనుండిన సంబంధముల వలెనే 1948 సం॥ మార్చి 31 వరకు యథాతథముగా ఉండవలెననుచూ, ఒడంబడిక జరిగెను. ఈ ఒడంబడిక ముఖ్యముగా ఖజానా, చలామణి విషయములకు సంబంధించినది. మొన్నటి 31 వ తేదీతో ఆ ఒడంబడికగడువు దాటిపోయినది. కాని పాకిస్థాన్ తన చలామణీవిషయములను స్వయముగా, తన సంస్థలద్వారా, నిర్వహించుకొనుటకు జరుపుచున్న ఏర్పాట్లు ఇంకను పూర్తి కాలేదు. చలామణి, వినిమయనిబంధనలు, ప్రభుత్వఋణము మొదలగు ముఖ్యవిషయములపై యాజమాన్యము వహించి, సక్రమముగా నిర్వహించగల రిజర్వుబ్యాంకు ఇంకను స్థాపింపబడలేదు. పాకిస్థాన్ నాణెములు, పాకిస్థాన్ ముద్ర గల నోట్లు ఏప్రిల్ 1 వ తేదీనుండి చలామణిలోనికి వచ్చినవి. కాని ప్రత్యేకముగా పాకిస్థాన్ నోట్లను ముద్రించుటకు నమూనాలు, యంత్రములు ఇంకను తయారుకాలేదు. పాకిస్థాన్ విదేశ నాణెముల నిలువల లెక్కలు వేరుగా తయారుచేయబడుచున్నను అవి మన రిజర్వుబ్యాంకుపరముగానే జరుగుచున్నవి. కాబట్టి మార్చి 31 వ తేదీతో కాలదోషముపట్టు ఒడంబడికనుమరి కొంతకాలము వరకు సాగించుట పాకిస్థానుకు అవసరము. పాకిస్థానుకు ఇబ్బంది కలిగించకుండుటకు, పాకిస్థాన్‌తో సౌహార్దతతో వ్యవహరించుటకు భారతప్రభుత్వము ఎప్పుడూ సంసిద్ధమే.

ఈ ఒడంబడికకొరకు బొంబాయి, ఢిల్లీలలో జరిగిన సంప్రదింపులలో భారత, పాకిస్థాన్ ప్రభుత్వముల ప్రతినిధులేగాక రిజర్వుబ్యాంకు ప్రతినిధులు కూడ పాల్గొనిరి. జూన్ 30 వ తేదీవరకు పాకిస్థాన్ ఖజానా, చలామణి విషయములుకూడ మన రిజర్వుబ్యాంకు పరముగనే జరుగుటకు అన్ని పక్షములు అంగీకరించినవి. పాకిస్థాన్‌లో చలామణిలో నున్న భారతప్రభుత్వపు నోట్లు క్రమేణా చలామణిలోనుండి తొలగించి వాని స్థానే పాకిస్థాన్ నోట్లు చలామణిలో పెట్టి రిజర్వుబ్యాంకు ఆస్తులను పాకిస్థాన్‌లో చలామణినుండిన నోట్ల దామాషా ప్రకారము పాకిస్థానుకు పంచియిచ్చుట కూడా ఈ లోగా జరుగును. భారత ప్రభుత్వనోట్లు ఆదిలో ఆశించినట్లు పాకిస్థాన్‌లో సెప్టెంబరు 30 వ తేదీవరకు గాక, జూన్ 30 వ తేదీవరకే చలామణిలో నుండును. జూన్ 30 వ తేదీవరకు గల ఈ మూడు నెలలకాలములో పాకిస్థాన్ రిజర్వుబ్యాంకు ఏర్పడి, అన్ని వ్యవహారములు నిర్వహించుటకు తగు ఏర్పాట్లు జరుపుకొనును.

ఇటువంటి ఒడంబడికలను సక్రమముగ అమలు జరుపు ఆచారము పాకిస్థానుకు లేదని గుర్తించిన భారత ప్రభుత్వము ఈ ఒడంబడిక సమయమునైనను కొంత జాగ్రత్త వహించియుండవలసినది. కొద్ది రోజులక్రితమే, పాకిస్థాన్ ప్రభుత్వాధీనములో నున్న భారతప్రభుత్వ ఋణపత్రములు ఒక్కుమ్మడిగా అమ్మజూపబడుటచే భారతప్రభుత్వఋణపత్రముల విలువ నూరురూపాయల ఆరణాలనుండి తొంబదిఎనిమిదిరూపాయల ఆరణాలకు పడిపోయి, భారతప్రభుత్వ పరపతికి భంగము వాటిల్లినది. భారతప్రభుత్వము ప్రతివారము జారీచేయు ట్రెజరీ బిల్లులకు రెండువారముల క్రితం 98 లక్షల రూపాయలకు దరఖాస్తులు వచ్చి, గతవారము 22 లక్షల 25 వేల రూపాయలకు మాత్రమే దరఖాస్తులు వచ్చిన వన్నచో పాకిస్థాన్ చర్యవల్ల భారతప్రభుత్వపరపతి కెంత దెబ్బ తగిలినదో వూహించవచ్చును. అట్టి పరిస్థితులలో జూన్ 30 వ తేదీవరకు ఇండియాపాకిస్థాన్‌ల మధ్య ధనమే, ధనచిహ్నములగు పత్రములు నిర్నిబంధముగా రవాణా చేయబడవచ్చుననుట భారతవాణిజ్యవర్గములకు ఆందోళన కల్గించుచున్నది. నిజాం నవాబు పాకిస్థానుకు అప్పిచ్చిన 20 కోట్ల రూపాయల ఋణపత్రములు మార్చవలదని నిజాం కోరుట కొంతవరకు సంతృప్తికరమేమైనను, పాకిస్థాన్ ప్రభుత్వము వద్దను, ప్రజల వద్దను వున్న భారతప్రభుత్వ ఋణపత్రములు అమ్మజూపబడవని మన మనుకోలేము. కొన్ని నెలల క్రిత మొనర్చుకొనబడిన ఆర్థికఒడంబడికలో, అవిభక్త భారత ఋణమునకంతకు భారత ప్రభుత్వమే పూచీపడి పాకిస్థానుకు గొప్ప మేలు చేసినది. కాని పాకిస్థాన్ ప్రభుత్వము ఎప్పటికప్పుడు ఏదో ఒక ఇబ్బంది కలుగజేస్తూనే వున్నది. ఇప్పుడైనను పాకిస్థాన్ ప్రభుత్వము సక్రమముగా వ్యవహరించునట్లు భారత ప్రభుత్వము కట్టుదిట్టములు చేసియుండవలసినది.

నేటి ప్రపంచం :

జర్మనీరాజధాని బర్లిన్‌లో అగ్రరాజ్యాలరగడ

చూస్తూ వుండగానే జర్మనీనడిగడ్డమీదనే—నాని రాజధానిఅయిన బర్లిన్ నగరంలోనే—అగ్రరాజ్యాలమధ్య పెద్ద రగడ ప్రారంభమైంది మార్చి ఆఖరువారంలో జరిగిన అగ్రరాజ్య చతుష్టయపాలకవర్గ — సమావేశంనుంచి రష్యా నిధి ఎప్పుడైతే హఠాత్తుగా నిష్క్రమించి ప్రతిష్టంభనను తెచ్చిపెట్టాడో అప్పుడే బ్రిటన్ ఫ్రాన్సు, అమెరికాలకు రష్యాతో ఈ విధమైన ఘర్షణ తప్పదని తేలిపోయింది.

నాజీ, ఫాసిస్టు శత్రులను సంహరించి ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో విజయాన్ని సాధించడానికి అపూర్వసహకారంతో పనిచేసిన బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, రష్యాలు సుస్థిర ప్రపంచశాంతిసౌధనిర్మాణంలో ఎంతవరకు పరస్పర సహకారంతో పనిచేయగల వన్నది సర్వదా సందేహాస్పదంగానే వున్నప్పటికీ, అగ్రరాజ్య విభేదాలు ఇంత త్వరలోనే ఇంతటి విపరీత పరిణామాలకు దారితీస్తవనిగానీ, స్వీయ ఆధిపత్యగవి స్థరణకు ఇంత బాహాటమైన పోటాపోటీలు జరుగుతవనిగాని ఎవరూ ఊహించలేక పోయినారు.

ప్రపంచాన్ని ఈనాడు తిరిగి భయంకరమైన యుద్ధమేఘాలు ఆవరించినవంటే, అగ్రరాజ్యాలు పడుతున్న పోటాపోటీలే, వాటి విభిన్న ఆర్థిక, రాజకీయవిధానాలే ప్రబలకారణాలు. బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, రష్యాల రాజకీయ చదరంగం ఆటలో ఇప్పటివరకూ యూరప్ ఖండంలో తూర్పుపశ్చిమ దిశల వున్న చిన్నచిన్న రాజ్యాలే పావులుగా ఉపయోగపడుతూ వచ్చినవి; ఇప్పుడు ఈ ఆట జర్మనీ రాజధాని బర్లిన్ నగరానికి సైతం ప్రత్యక్షంగా వ్యాపించి క్లిష్టపరిణతికి వచ్చింది.

* * *

తూర్పు పశ్చిమ దిశలనుంచి ఉరుకులు పరుగులు పెడుతూ నాజీ జర్మనీని శరవేగంతో ఆక్రమించి యూరప్‌ఖండ యుద్ధాన్ని సమాప్తంచేసిన రష్యా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సుల మధ్య శాశ్వత సహకారం అసంభవమనీ, ఈ అగ్రరాజ్యాల సహకారానికి అవి ఆక్రమించిన జర్మనీయే తప్పక గీటురాయి అవుతుందనీ 1945 లోనే స్పష్టపడింది,

యూరప్ యుద్ధం సమాప్తమై నాజీ జర్మనీ పతనమైన తర్వాత 1945 లో ఒక నాజీ దౌర్జన్యవాది లడ్విగ్‌లాంగ్ అనే అతడు జెకోస్లావేకియాలో పట్టుబడ్డాడు.

కొంతమంది జెక్ పత్రికా విలేఖరులు కొన్ని ప్రశ్నలు వేయగా, లడ్విగ్‌లాంగ్ ఇలా అన్నాడట.

“హిట్లర్ తనకు సమర్థులైన అనుచరులను ఎన్నుకోలేక పోయినందునే పతనమైనాడు. పశ్చిమ జర్మనీని ఆక్రమించిన బ్రిటన్, ఫ్రాన్సు అమెరికన్ అధికారులు, తూర్పు జర్మనీని ఆక్రమించిన రష్యనులు జర్మన్ ప్రజలను ఆదరణ భావంతోనే చూస్తున్నారు. ఈ నాలుగురాజ్యాల అధికార్లూ మమ్మల్ని ఇంత ఆప్యాయంగా చూడడంలో ఆంతర్యం లేకపోలేదు. మాది సైనిక జాతి. మా ప్రజలందరూ యుద్ధశాస్త్రంలో ఆరితేరిన సైనికులు. భవిష్యత్తులో తూర్పు పశ్చిమ రాజ్యాల మధ్య యుద్ధం సంభవించి తీరుతుంది. అపుడు ఆ యుద్ధంలో మా ప్రజలను స్వార్థం



కోసం ఉపయోగించుకోవాలన్నదే ఈ అపూర్వ యతకు, ఆదరణకు అంతరార్థం. ఆ అంతిమ యుద్ధం సంభవించినప్పుడు జర్మనులు సహోత్సాహముతో పనిచేస్తారు.”

ఇతడు మూడు సంవత్సరాల క్రితం ఏదో సత్యం చెప్పాడో, ఈనాడు జర్మనీలో, అగ్రరాజ్యాల మధ్య సరిగా అదే సంభవిస్తున్నది.

* * *

జర్మనీభవిష్యత్తునుగురించి బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు దేశాల ప్రభుత్వాలు మూడూ లండన్ పారిస్ నగరాలలో సమావేశమై రహస్య సంప్రతింపులు జరిపినవనీ, ఆ సంప్రతింపుల వివరాలను తమకు చెప్పడానికి నిరాకరిస్తున్నవనీ వాదించి, తూర్పు జర్మనీ సోవియెట్ మిలిటరీ గవర్నర్ మార్షల్ సొకొలొవిస్కి అగ్రరాజ్య చతుష్టయ పాలకవర్గ సమావేశంనుంచి నిష్క్రమించాడు. పశ్చిమజర్మనీలోని ఆక్రమితభాగాలను ఏకపరిపాలనకిందికి తెచ్చి, ఆభాగానికి మాత్రం మార్షల్ పథకాను సారం బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులుఆర్థిక సహాయాన్ని అందజేయదలచిన మాట వాస్తవమే. అందులో రహస్యమేదీ లేదు. జర్మనీ విషయంలో బ్రిటన్, అమెరికా ఫ్రాన్సుల పథకవివరాలు తెలిసినప్పటికీ రష్యావారితో కలసి రావడంగాని, జర్మనీ ఏకీకరణకు సమ్మతించడంగాని అసంభవం. ఏదో విధంగా పశ్చిమరాజ్యాలతో విభేదాలను రెచ్చగొట్టి పెంచుకోవడమే, పనిగా పెట్టుకొన్న రష్యా, తమ ఆక్రమణకింద వున్న తూర్పు జర్మనీలోకి బ్రిటన్ అమెరికాలు విపరీతంగా జర్మన్‌గూఢచారులను పంపి తమ సమాచారాలన్నిటినీ రహస్యంగా సేకరిస్తున్నవనే ఆరోపణలు చేసి, బర్లిన్ నగరానికీ, పశ్చిమజర్మనీప్రాంతాలకూ మధ్య ప్రయాణీకుల, మిలిటరీరైళ్ళ రాకపోకలపైనా,వస్తువుల రవాణా పైనా మార్చి 31 అర్ధరాత్రినుంచీ తీవ్రనిర్బంధాలను ప్రయోగిస్తున్నట్లు ప్రకటించింది. బర్లిన్‌నుంచి పశ్చిమ జర్మనీకి వెళ్లే ప్రయాణీకులను, రైళ్లను సోదా చేస్తామనీ, ఇకమీద ప్రత్యేకఅనుమతిపత్రాలు వుంటేనేగాని సోవియెట్ ఆక్రమితజర్మన్‌భూభాగంగుండ ఎవరూ పశ్చిమజర్మనీకి వెళ్ళడానికిగాని, అక్కడినుంచి రావడానికిగాని వీల్లేదనీకూడా రష్యా నిర్ణయించి, తమ సంకల్పాన్ని మిగతా రాజ్యాల మిలిటరీ గవర్నర్లకు స్పష్టంగా తెలియజేసింది.

* * *

బర్లిన్ నగరాన్ని బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా, రష్యాలు నాల్గూ నాల్గు ముక్కలుచేసి సమిష్టిపాలన సాగిస్తున్నప్పటికీ, ఈ నగరంనుంచి బ్రిటన్ అమెరికా ఫ్రాన్సుప్రతినిధులు తమ ఆక్ర



మణకింద వున్న పశ్చిమజర్మనీకి వెళ్ళవలెనంటే, చుట్టూ వున్న సోవియెట్ ఆక్రమితభూభాగాన్ని దాటిపోవలసిందే. అందువల్ల సోవియెట్ ప్రభుత్వం ప్రయోగించిన నిషేధాజ్ఞ ఫలితంగా పశ్చిమజర్మనీకి బర్లిన్‌నకు పోయే రైళ్లరవాణా విషయంలోనూ, బర్లిన్‌లో తామాక్రమించిన భాగంలో వున్నవారికి సరఫరాలు అందజేయడంలో బ్రిటన్, అమెరికాలు అతి క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొనవలసి వచ్చింది. అనుమతిపత్రాలు లేవనే నెపంమీద కొన్ని బ్రిటిష్, అమెరికన్ మిలిటరీ, మామూలు ప్రయాణీకుల రైళ్లను రష్యనులు తమ సరిహద్దు దాటి రాకుండా అటకాయించడంకూడా సంభవించింది. సరిహద్దువరకూ వచ్చినరైళ్లు తిరిగిబర్లిన్‌కే వెళ్ళిపోవలసివచ్చింది కూడా. ఈవిధంగా పశ్చిమజర్మనీతో తమ రైళ్ళ రాకపోకలన్నీ స్తంభించిపోవడంతో బ్రిటన్, అమెరికాలు రైళ్ళరవాణా లన్నిటినీ కట్టిపెట్టి, సోవియట్ ఆక్రమిత భూభాగం మీదగానే విమానాల ద్వారా సరఫరాలను అందజేసుకోవలసిన అవసరం ఏర్పడింది. ఐతే ఆకాశమార్గానకూడా ఈ విమానరవాణాలు సక్రమంగా చేరడం దుస్సాధ్యంగా పరిణమించింది. విమాన రాకపోకలనుకూడా అటకాయించడానికే రష్యా సంసిద్ధపడివున్నట్లూ, ఈమధ్య బర్లిన్‌నుంచి పశ్చిమజర్మనీ వెళ్లుతున్న బ్రిటిష్ విమానాలను సైతం రష్యన్ యుద్ధవిమానాలు చాలాసార్లు వెంటబడి తరిమివేసినట్లు వార్తలు వస్తున్నవి.

వీటన్నిటినిబట్టి చూస్తే బర్లిన్‌లో అగ్రరాజ్యసంబంధాలు అతిక్లిష్టదశకు వచ్చినవనీ, తూర్పుపశ్చిమ జర్మనీలమధ్య, ముఖ్యంగా బర్లిన్ పశ్చిమ జర్మనీలమధ్య సంబంధాలు పూర్తిగా తెగతెంపు లైనవనీ స్పష్టపడుతున్నది.

* * *

ఇంతేగాక అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులు ఆక్రమించిన జర్మన్ భూభాగం సరిహద్దువ రష్యన్లు అపారంగా సైనికబలాలను సమాయత్తపరుచుకుంటున్నారనీ, ఎదుటిపక్షంవారుకూడా తమ సరిహద్దులలో టాంకులు మొదలైన ఆయుధశకటాలనుకేంద్రీకరించి సిద్ధపడుతున్నారనీ మరికొన్ని వార్తలు వస్తున్నవి. తామాక్రమించిన జర్మనీ భూభాగాలనుంచి విలువైన ఆస్తులన్నిటినీ ఎవరికివారు అపహరించి వేసినట్లు పరస్పర ఆరోపణలను రష్యా, అమెరికాలు చేసుకుంటున్నవి. అగ్రరాజ్య సమిష్టిపాలన విచ్ఛిన్నం కావడంతో జర్మనీ కూడా విచ్ఛిన్నమైపోయినట్లే భావించవలసి వుంటుంది.

రష్యా ప్రయోగించిన ఈ నిర్బంధాజ్ఞలు, చేస్తున్న యుద్ధఆర్భాటం అంతా బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు పరిపాలనా వర్గాలకు బర్లిన్‌లో స్థానం లేకుండా చేసి తరిమివేయడానికేననికూడా స్పష్టపడుతున్నది.


ఏది ఏమైనప్పటికీ, రష్యనులు ఎన్ని దిగ్బంధాజ్ఞలను ప్రయోగించినప్పటికీ తాము బర్లిన్ నుంచి కదలబోయేది లేదనీ, పరిస్థితి అంతగా మితిమీరితే ఏవిధంగానైనా దాన్ని ఎదుర్కోడానికి సర్వసంసిద్ధులమై వున్నామనీ అమెరికా విదేశమంత్రి జార్జి మార్షల్, మిలిటరీ గవర్నర్ లూసియస్ క్లే ప్రభృతులు ఖండితంగా ప్రకటిస్తున్నారు.

పశ్చిమ ప్రజాస్వామ్యరాజ్యాలకు, రష్యాకు బర్లిన్‌లో ప్రారంభమైన ఈ రగడ కేవలం రగడగానే సమసిపోతుందో, లేక పెద్దపెట్టున సంఘర్షణకే దారి తీస్తుందో చెప్పలేముగాని, ప్రస్తుత పరిస్థితి అతిప్రమాదభరితంగా వున్నమాట మాత్రం నిజం. అగ్రరాజ్యాలు జాగ్రతగా మెలకువతో సంచరించకపోతే ప్రపంచానికి మరొక మహోపద్రవం వాటిల్లి తీరుతుంది.

బర్లిన్‌లోవున్న అమెరికన్లకు ఆహారపదార్థాలను సప్లయిచేస్తున్న విమానాలపై రష్యనులు ఫిరంగికాల్పులు జరపడమే సంభవిస్తే నేటి ఈ క్లిష్టపరిస్థితి ఒక్కసారిగా భగ్గుమంటుంది. దీని ఫలితం విశ్వనాశనమే.

ఏది ఏమైనప్పటికీ బర్లిన్‌నగరంనుంచి బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులు వైదొలగడం అసంభవం; ఎందుచేతనంటే, ఆవిధంగా అవితప్పుకొంటే, వాటి ప్రతిష్ఠకే పెద్ద దెబ్బతగులుతుంది.

భారతప్రధాని నెహ్రూ మొన్న షికాగో రేడియో గోష్ఠిలో ఉద్బోధించినట్లు అగ్రరాజ్యాలు నైతికధర్మసూత్రాలను పాటించి తమ తీవ్రవిభేదాలను పరిష్కారం చేసుకొంటేనే ఏనాటికైనా లోకశాంతి, ఏకప్రపంచ ప్రభుత్వస్థాపనా సంభవం అవుతుంది. లేకపోతే, నేటి సంక్షుభిత ప్రపంచానికి సర్వనాశనమేగతి అవుతుంది. పృథివికి వినాశనం సమీపించినప్పుడు మహాత్ముల ధర్మప్రబోధలు ఎవరికీ తల కెక్కవంటారు. నేటి అగ్రరాజ్యాల ధోరణి ఉత్తరోత్తరా ఏ విషఫలితాలకు దారితీస్తుందో వేచివుంటేనేగాని తెలియదు.





[యూరప్ ఖండమంతటా ప్రసిద్ధ నవలా రచయితగా పేరుదెచ్చుకొన్న మొదటి రష్యన్ నవలా కారుడు టూర్జెన్యోవ్ ఇతని పూర్తిపేరు ఇవాన్ సెర్జెవిచ్ టూర్జెన్యోవ్. 1818 లో రష్యాలోని ఓరిల్ పట్టణంలో జన్మించాడు. మధ్యతరగతుల్లో పై తరగతికి చెందిన కుటుంబం. తండ్రి డబ్బుకోసం తనకన్నా పెద్దావిడను పెళ్ళాడాడు. ఆవిడ ఆకసిఅంతా పిల్లలమీదా నౌకర్లమీదా తీర్చుకొనేది. చిన్నప్పుడు ఇంటిదగ్గిరా, తర్వాత మాస్కో-పీటర్సుబర్గులోనూ, చివరికి బెర్లిన్ విశ్వవిద్యాలయంలోనూ, చదువుగడిపాడు. బెర్లిన్‌లో సాహిత్య లయంలో పెద్దలతో పరిచయంపెరిగింది. ఉద్యోగంమానేసి, సాహిత్యసేవకు దిగాడు. ముందు 1843 లో పద్యాలువ్రాశాడు. మెప్పుకూడా వచ్చింది. కానీ శాంతిచిక్కలేదు. కాదని నాటకాలువ్రాశాడు. చివరికి అవీ కాదని నవలాసాహిత్యానికి పూనుకొన్నాడు. 1847 లో స్పోర్ట్సమన్సుస్కెచస్ అని వ్రాశాడు. గొప్పగా పేరు వచ్చింది. ఆ భావచిత్రాల్లో, యజమానులకన్నా నౌకర్లు, పల్లీయులే, ఎక్కువ ఆకర్షణీయంగా కనపడ్డారు. 1852 లో గోగ్‌లీ (ప్రఖ్యాత రష్యకవి) మృతిపైవ్రాస్తూ అతణ్ణి పొగడినందుకు ప్రభుత్వం ఇతన్ని తన జమీ లోనే కట్టుబడిఉండేట్టు నిర్బంధించింది.

"ఫాదర్సఅండ్‌సన్సు" (తండ్రులు, కొడుకులూ) అనే ఈ నవల (1862) లో టూర్జెన్యోవ్ వ్రాశాడు. ఆనాటి సాంఘికసమస్యలను ఒక ప్రేమకలాపకథచుట్టూ అల్లాడు. దీనిపై పెద్దపెద్ద విమర్శలు పడ్డాయి. "బాజరోవ్"ను నిహిలిస్టు, (నేతివాదకుడు)గా ధృడసంకల్పాలున్న వ్యక్తిగా చిత్రించటంతో, ఆనాటి రాడికల్ పత్రికలకు ఈ నవల వెక్కిరింపుగా కనబడి, టూర్జానోవ్యవ్ బట్టారు. విమర్శకును భరించలేని సున్నితత్వంతో టూర్జెన్యోవ్, విదేశాలలో నివాసం మొదలుపెట్టాడు. కాని చివరకు 1880 లో స్వదేశంవచ్చినప్పుడు అతనికి అఖండస్వాగతం ఇచ్చారు. 1883 లో పారిస్ దగ్గిర బూగివల్ అనేచోట చనిపోయాడు.

ఫ్రెంచినవలా రచయిత ప్లాబేతో టూర్జెన్యోవ్‌కు చాలా పరిచయముండేది. మూపాసా ఈతన్ని గురువుగా సభాంవించేవాడు. పుష్కిన్ ప్రభావం ఇతనిపై చాలా పనిచేసింది. ప్రఖ్యాత వాస్తవిక రచయితగా తయారయ్యాడు.

అతను సృష్టించినవ్యక్తులచిత్రాలు, మానసికతత్వ విమర్శనాదికాలమీద కాకుండా, కవితా వాతా వరణంమీదే ఆధారపడి ఉద్భవించినట్లుంటాయి.

ఈ ప్రఖ్యాత నవలను, తెలుగుకథకులులో ప్రసిద్ధులయిన శ్రీ పాలగుమ్మి పద్మరాజుగారు, మూలానికి ఎక్కువ చెదురనీయకుండా, ఆ పేర్లతోటే, సాధ్యమైనంతవరకూ ఆ వాతావరణనుతెచ్చి, సులభశైలిలో రచించారు. ఇది సంతోషంతో పాఠకుల కందిస్తున్నాం—సంపాదకులు.]

"ఏం, పీటర్, ఇంకా ఎక్కడా ఆనడం లేదూ?"—ఈ ప్రశ్న 1859 సంవత్సరం మేనెల 20 వ తేదీని ఒక పెద్దమనిషి అడిగాడు. అతని వయస్సు నలభయికి కొంచెం పైబడింది. దళసరి చెక్కగుడ్డ లాగు తొడుక్కున్నాడు కోటు అంతా దుమ్ముతో నిండిపోయింది. స-పట్టణంలో బళ్ళఘాటీ అవరణలో ప్రయాణీకులకోసం కట్టిన విశ్రాంతిగృహంలోనించి ఇవతలమెట్లమీదికి నెత్తిమీద టోపీ లేకుండా అదుర్దాగా వస్తూ, తన సేవకుణ్ణి ఉద్దేశించి ఈ ప్రశ్న అడిగాడు. సేవకుడు బొద్దుగా ఉన్న యువకుడు. అతని కళ్ళు చిన్నవిగా, కాంతివిహీనంగా ఉన్నాయి.

సేవకుడు అన్నివిధాలుగానూ తెలుగుమీరిన కొత్తతరానికి చెందినవాడని అతని ఆకారమే చెప్తుతుంది. తెల్ల టిముత్యపుచిప్పవలయాలు చెవులకు పెట్టుకున్నాడు. జిగురుగల తలనూనె రాసుకుని సున్నగా తల దువ్వుకున్నాడు. అతని ప్రతికదలికలోనూ పట్నవాసపు నాగరకత మెదులుతూఉంది. అతడు యజమానిమీద దయదలిచినట్టుగా ముఖంపెట్టి రోడ్డువెంబడి చూశాడు.

"లేదయ్యా, చూపుమేరలో అనడంలేదు," అన్నాడు.

"లేదూ?" అని యజమాని మళ్లీ ప్రశ్నించాడు.

"లేదయ్యా" అని సేవకుడు మళ్లీ జవాబు చెప్పాడు.

యజమాని నిట్టూర్చి ఒక చిన్న బల్లమీద కూర్చున్నాడు. ఏదో ఆలోచిస్తున్నట్టు ఇటూ అటూ చూస్తూ, కాళ్లను బల్లకింద ముడుచుకున్నాడు. అతన్ని ఇప్పుడు పఠితకు పరిచయం చేస్తాను.

అతనిపేరు నికోలై పెట్రోవిచ్ కిర్సనావ్. ఈబళ్ళఘాటీకి పన్నెండుమైళ్ళ దూరంలో సుమారు ఐదువేల ఎకరాల పరిమితిగల జమీ ఉంది. తన ఆస్తిని రైతులకు పంచి ఇచ్చి, ఒక "వ్యవసాయిక కేంద్రాన్ని" ప్రారంభించాడు. "రెండువందల ప్రాణులతో ఉన్న చక్కనిఆస్తి" అది అతని పరిభాషలో. అతని తండ్రి 1812 సంవత్సరప్రాంతంలో సేనాధిపతిగా పనిచేశాడు. అతడు అట్టేచదువుకోని మోటుమనిషి, కాని చెడ్డవాడు కాడు, అసలైన రష్యన్. అతనిబ్రతుకంతా సైనికుడి దుస్తులలోనే గడిచిపోయింది. మొదట ఒక చిన్నపటాలానికి అధికారిగా ప్రవేశించాడు. తరువాత ఒక సేనాదళానికి అధిపతి అయినాడు. నాగరకతకు దూరంగా పల్లెప్రాంతాలలోనే నిత్యమూ నివసించేవాడు. ఉద్యోగరీత్యా ఏర్పడిన పలుకుబడివల్ల ఆ ప్రాంతాలలో ప్రముఖుడుగానే పరిగణించ బడుతుండేవాడు. నికోలై పెట్రోవిచ్ దక్షిణరష్యాలో జన్మించినాడు—అతని అన్న పావెల్‌లాగే. పావెల్‌ను గురించి ముందుముందు విపులంగా తెలుస్తుంది. పద్నాలుగు సంవత్సరాలు వచ్చేదాకా అతని చదువు ఇంటిదగ్గరే నడిచింది. అతని చుట్టూ చవుకరకపు బడిపంతుళ్లు, పై అధికారులకు వంగి వంగి దండాలు పెడుతూ, కులాసాగా స్వేచ్ఛగా తిరిగే సైనికోద్యోగులు, సైన్యానికి సంబంధించిన ఇతర పరంజాము అంతా ఉండేది. అతనితల్లి కొల్యాజిన్ కుటుంబానికి చెందినది. పెళ్లికానిక్రితం ఆమెపేరు అగాథీ. దళాధిపతిభార్య అయినతరవాత ఆమె అగాథోక్లియా కుజినీ ష్నా కిర్సనావ్ అయింది. ఉద్యోగంవల్లవచ్చే అధికారాన్ని పూర్తిగా చెలాయిస్తూ, బాధ్యతలను పంచుకుంటూ, ఆ గౌరవాన్ని సంపూర్ణంగా అనుభవించే తరహాకి చెందిన స్త్రీ ఆమె. ఆమె ఆడంబరమయిన టోపీలు పెట్టుకునేది. చిరచిరమనే పట్టు దుస్తులు ధరించేది. చర్చిలో నిలువదగ్గరకు అందరూ ఆమె వెనకాల వెళ్లేవారు. పెద్దగొంతుకతో ఎక్కువగా మాట్లాడుతుండేది. ఉదయాన్నే తన పిల్లలచేత తనచేతిని అతినాగరకంగా ముద్దుపెట్టించుకునేది. రాత్రి పడుకోబెట్టేముందు వాళ్లని ఆశీర్వదించేది. జీవితాన్ని ఎంతగా అనుభవించడానికి సావకాశం ఉందో అంతా అనుభవించినది. నికోలై పెట్రోవిచ్‌కి ఉండవలసిన ధైర్యసాహసాలు లేకపోయినా—అతన్ని అసలు పిరికివాడని కూడా అనవచ్చు—అతని అన్న పావెల్ తోపాటు సైన్యములో ప్రవేశ పెట్టడానికే ఉద్దేశించారు. కాని సైన్యంలో అతనికి ఉద్యోగం అయిందన్న వార్త తెలిసిన రోజునే అతని కాలికి దెబ్బ తగిలింది. రెండు నెలలు మంచ మెక్కాడు. ఆ దెబ్బఫలితంగా చిన్న కుంటు అతని నడకలో శాశ్వతంగా నిలిచిపోయింది. అతనివలన ప్రయోజనం లేదని అతనితండ్రి నిశ్చయించి, మామూలు ప్రభుత్వోద్యోగాల్లో చేరడానికి అనుమతించాడు. పద్దెనిమిదవ సంవత్సరం రావడంతోటే అతన్ని పీటర్సుబర్గు తీసుకుపోయి విశ్వవిద్యాలయంలో చేర్పాడు. ఆ రోజుల్లోనే అతని అన్నకు రక్షకసైన్యములో ఉన్నతోద్యోగం దొరికింది. ఒక వరసగదులు అద్దెకు తీసుకుని అన్నదమ్ములిద్దరూ పట్టణంలో నివసిస్తుండేవారు. వాళ్ళ తల్లిపైపు బంధువు ఒకడు ఇల్యా కొల్యాజిన్ అనే అతడు పీటర్సుబర్గులో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. అతను అప్పుడప్పుడు వచ్చి చూస్తుండేవాడు. తండ్రి తిరిగి తన సేనాదళం దగ్గరకు, తన భార్యదగ్గరకు వెళ్ళిపోయాడు. ఎప్పుడేనా అరుదుగా అతని దగ్గరనుంచి కొడుకులకు ఉత్తరాలు వస్తుండేవి. పెద్ద బూడి రంగు కాగితాలమీద పెద్ద అక్షరాలతో గొలుసుకట్టుగా వ్రాసి ఉండేవి. కాగితాల అడుగుని జాగ్రత్తగా చెక్కిన నగిషీ అంచులమధ్య "పీటర్ కిర్సనావ్ సైన్యాధిపతి" అని వ్రాసిఉండేది. 1835 లో నికోలై పెట్రోవిచ్ పట్టభద్రు డయాడు. ఆ సంవత్సరమే సైన్యాధిపతి కిర్సనావ్ ఉద్యోగంలోనించి విరమించుకోవలసివచ్చింది. ఇంకా కొంతకాలం గడపడానికి ప్రయత్నించాడుకాని ఆ ప్రయత్నాలు విఫలమయాయి. తనభార్యతో అతనుకూడా పీటర్సుబర్గు వచ్చి అక్కడే నివాసం ఏర్పరచుకొన్నాడు.

టావ్రిచెస్కీతోటలో ఒక ఇల్లు చేరబోతున్నాడు ఇంగ్లీషు క్లబ్బులో సభ్యుడుగా అప్పుడే ప్రవేశించాడు. ఇంతలోనే ఆకస్మికంగా వణుకు జబ్బు వచ్చి చచ్చిపోయాడు. తరవాత కొద్దిరోజులకే అగాథోక్లియా అతన్ని అనుసరించింది; రాజధానిలో జీవితం ఆమెకు నీరసంగా అనిపించింది. ఆమెకు సరిపడలేదు. సైన్యాన్ని విడిచి దూరంగా బ్రతకవలసిన బెంగ ఆమెను దిగదీసింది. ఇంతలో తల్లిదండ్రులు బ్రతికిఉండగానే, నికోలై పెట్రోవిచ్ తను ఉన్న ఇంటి యజమానికూతురిని ప్రేమించడం, ఆరవణంగా అతని తలిదండ్రులకు కావలసినంత ఆందోళన కలగడం జరిగింది. ఆ ఇంటియజమానిపేరు ప్రిపోలోవెన్స్కీ. ఒక సామాన్యోద్యోగి. కూతురు చక్కనిది. ఒక 'నవయువతి'. పత్రికలలో 'వైజ్ఞానికవిషయాలు' అనే శీర్షికక్రింద ఉండే గంభీరమయిన వ్యాసాలు చదువుతుండేది. తలిదండ్రులు పోయినతరవాత ఆరునెలల గడవు దాటగానే అతడు ఆమెను పెళ్లిచేసుకున్నాడు. అతని తండ్రి తన పలుకుబడిని ఉపయోగించి సంపాదించిన ఉద్యోగాన్ని విడిచిపెట్టి, తన మాషాతో అతిసుఖంగా ఇక్కడా అక్కడా కాలక్షేపం చేశాడు. లేస్నీ కేంద్రానికి సమీపంలో ఒక చక్కని పల్లెటూరిఇల్లు సంపాదించి కొంతకాలం అక్కడ ఉన్నాడు. తరవాత పట్నవాసానికి మారాడు. అక్కడ ఒక చక్కని చిన్న డాబాలో నివసించేవాడు. బాగా గాలివచ్చే ముందుగది, పరిశుభ్రమయిన మేడమెట్లవరస—డాబా చాలా బాగుండేది. చివరకు ఒక పల్లెటూరు చేరుకుని అక్కడ స్థిరపడ్డాడు. అక్కడకు చేరుకున్న కొద్దికాలానికే అతనికి పుత్రుడు కలిగాడు. పేరు ఆర్కాడే. ఆ దంపతులు సుఖంగా ప్రశాంతంగా కాలం గడుపుతుండేవారు. ఒకరినొకరు సాధారణంగా విడిచి ఉండలేదు. ఇద్దరూ కలిసి చదువుకునేవారు, కలిసి పియానోమీద గీతాలు పాడుకునేవారు. ఆమె పూలమొక్కలు పెంచుతుండేది, కోళ్లను, బాతులను చూస్తుండేది. అతడు అప్పుడప్పుడు వేటకు వెళుతుండేవాడు, సాధారణంగా జమీలో వ్యవహారాలు చూసుకుంటూ ఉండేవాడు. ఆ సుఖమైన ప్రశాంతమయిన వాతావరణంలోనే ఆర్కాడీ పెరిగాడు. పది సంవత్సరాలు సుఖంగా స్వప్నంలాగ గడిచిపోయాయి. 1847 లో కిర్సనావ్ భార్య చనిపోయింది. ఆ దెబ్బలో అతడు కుంగిపోయాడు. కొద్ది వారాలలోనే అతని తల నెరిసిపోయింది. ఆ దుఃఖాన్ని మరచిపోడానికి ఇతర దేశాలకు ప్రయాణమవుతున్నాడు...... ఇంతలోనే 1848 వచ్చింది. ఇష్టం లేకపోయినా తన పల్లెటూరికి తిరిగివచ్చాడు. ఏమీ పనిచెయ్యకుండా ఎన్నోనాళ్లు గడిపినతరువాత, తన ఆస్తిని సరిదిద్దుకొని బాగుచేసుకోవాలనే సంకల్పం కలిగింది. 1855 లో తనకొడుకుని స్వయంగా

(22 వ పేజీ చూడుడు)

బ్రాహ్మణశాఖలు

బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

2

అసలు విషయం విడిచి చాలాసేపయింది.

బ్రాహ్మణశాఖలలో మా ఆరామ ద్రావిడ శాఖ సంఖ్యలోనే కాదు, యితర సంపత్తిలో కూడా చాలా తగ్గివుంటుందని శాబ్దోలను వ్యాకరిస్తూ మతో దానిలోకి పోయింది. వ్యాసథోరణి. వెలనాటిశాఖ అన్ని విధాలా వుత్కృష్టం. వేగినాటిశాఖకూడా మా శాఖతో పాటే. ఆయీ శాఖలనుగూర్చి కొన్ని శ్లోకాలుకూడా శ్రుత మవుతూవుంటాయి.

"ఉభయం కరణకమ్మాయాః,
కోధయం దగ్ధరాష్ట్రిజాః"

దీనికి పూర్వార్థం జ్ఞప్తికి రాలేదు. దగ్ధరాష్ట్రిజాః అంటే వేగినాటిశాఖీయులు. వీరు ఒకరికి వుపకారం చేయలేరు సరికదా, తముకూ చేసుకోలే రని పై శ్లోకానికి తాత్పర్యం.

జగన్నాథ పండితరాయలు ఆయీ శాఖీయుడే. యిందు కన్నో ఆధారాలు వున్నాయి. సుమారు నాలుగేండ్లనాడు— "పండితరాయలు వేగినాటి" అని నేను యేదో వ్యాసంలో వ్రాస్తే యెవరో వొక వెల్నాటి శాఖీయుడు పేరు దాచి నన్ను దూషిస్తూ వొక పెద్ద వుత్తరం వ్రాసినాడు. అందులో అతడు వెలనాటి శాఖీయు డనిన్నీ, వెలనాటి వారియందు వుండే ద్వేషంచేత నీవు అన్యథాగా వ్రాశావనిన్నీ వ్రాసినాడు. ఆయనకు ఆవిధంగా యెవరు చెప్పి వున్నారో! కాని పండితరాయలు వేగినాటి శాఖీయుడే. కోనసీమలో బ్రాహ్మణాగ్రహారాలలో వేగినాటివారు విశేషించి వున్న ముంగండ అగ్రహారం ఆయన జన్మభూమి, యింటి పేరు 'ఉపద్రష్టవారు'. ప్రధానం. ఆయన్ని గురించి యిక్కడ వ్రాయవలసిందింతే. తర్వాత స్తాంటం నాము.

ఇతరశాఖలన్నిటికంటే వెలనాటిశాఖ విద్యా విషయంలోనే కాదు, సర్వవిధాలా అగ్రస్థానం అలంకరిస్తుంది. యీ వెలనాటి వారు చాలా అమాయకు లని కొన్ని యితిహాసా లున్నాయి గానియింతకంటే కూడా వేగినాటివారు అమాయకు లంటూ కొన్ని యితిహాసాలున్నాయి— వేగినాటి సన్న్యాసీ, వెల్నాటి సన్న్యాసీ, వుండేయిద్దఱున్నూ వొక బ్రాహ్మణాగ్రహారంలో వారనిన్నీ యిద్దఱిలోనూ వెల్నాటాయనకి భిక్షలుబాగా జరిగేవనిన్నీ వేగినాటాయనికి అంత బాగా జరిగేవి కావనిన్నీ, ఆస్థితిలో వేగినాటి వెల్నాటితో నీకు జరిగినట్లు నాకు భిక్షలు జరగవు యెందుచేత?—అని అగగాడనిన్నీ, దాని కాయన— నీవు ఆడవాళ్ళని స్తోత్రం చేయడం చేతగాదు. వాళ్ళ అనుగ్రహం వుంటేనేకాని భిక్షకు మగవాళ్ళ అభిమానం యెంత వున్నా లాభం లే దన్నాడనిన్నీ, దానిమీద వేగినాటి యేదో సమయం గాని సమయంలో వెళ్ళి స్తుతి చేసేటప్పటికి ఆమె చేత తిట్లు తినవలసి వచ్చిందనిన్నీ వొక యితిహాసం చెప్పుకుంటారు. దీనివల్ల వేగినాట్లు మఱీ అమాయకులని తేలుతుంది అన్ని శాఖలకూ యీలాటి యితిహాసా లేవో చెప్పుకోవడం వుంది వైదికశాఖలలో తెలగాణ్యులు చాలా నేర్పులని చెప్పుకుంటారు. వారినిగూర్చి యెవరో తదితరశాఖీయులు చెప్పిన 'మాయావాదీ మహాద్వేషీ......మద్గుణ స్తైలగాణ్యకః" అంటూ వొక శ్లోకం వుంది. అది పూర్తిగా జ్ఞాపకం లేదు, పలువురికి వొచ్చే వుంటుంది.

కాసలేయులనుగూర్చి "విశ్వాసే శ్వాశ్రు ఘసర్పాచ...కాసలేయం నవిశ్వసేత్" ఈ శ్లోకంకూడా పూర్తిగా జ్ఞాపకం లేదు. యీ విధంగా వొకరిమీద వొకరు చెప్పుకొన్న శ్లోకాలు చాలా మందికి వచ్చు.

దక్షిణాది ద్రావిళ్ళనుగూర్చి.

"అప్పాకట్టి రయంసాధుః
కుట్టిత్వా త్వణ్ణికుట్టివత్:
సర్వకుట్టావతివ్యాప్తి
స్తచ్ఛన్నత్వం విశేషణమ్"

అంటూ వొక శ్లోకం వుంది. కుట్టి అంటే అఱవభాషలో పిల్లవాడని అర్థం, యీపేరుతో వొక కవి మహా సుప్రసిద్ధుడు వున్నాడు. "ఖ్యాతః కుట్టికవిస్తుదర్థని గృహద్వారేషు నిద్రాయతే" (మహిష శతకం). యితడు బాల్యంలోనే మంచి కవిత్వం చెప్పడంవలన యీ పేరు బిరుదుగా వచ్చి వుంటుంది. శ్లోకంలో పాముపిల్లతో పోల్చడం వలన యీ శాఖీయులు చాలా కృత్రిములుగా అపకారులుగా వుంటారని యితరులు ఆక్షేపించినట్లు తోస్తుంది, వేంకటాధ్వరి— "శ్వోశభూపరిచయా త్వాఽథవాకల్పితా కపటశీలతా ధ్రువమే" అంటూ ప్రద్యుమ్నానందనాటకం (అని జ్ఞాపకం) లో మలయమారుతాన్ని ఉపాలంభిస్తూ దక్షిణదేశస్థులు కపటశీలం గలవారని ధ్వనింపజేశాడు "దక్షిణా గాథకాః పశలా ఇక్యర్థ" అని కాముడి బుదిగాక ఆఱవ మేకు అంటూ వొక యితిహాసం వుంది. దాన్ని గీరతచతుర్థ భాగం లో కాభిరామాయణంలో విస్తరించడంచేత స్పృశించి విడుస్తున్నాను. కావలసినవారు దానిలో చదువుకో గలరు. ఆయీ కథలన్నీ ద్రావిడులు యెక్కువ బుద్ధిమంతులనుకోవడానికికూడా సహాయపడతాయి. ఆ కావేరి నీటియందు బుద్ధిమత్తను గల్గించే గుణం వుందని వినికిడి. మేము (అనగా ఆరామ ద్రావిళ్ళన్న మాట) కూడా ఆయీ ద్రావిడశాఖకు చెందినవారమే కాని, ఆ ముచ్చట చాలా కాలంనాటిది. యిటీవల తెలుగు దేశంలో సెటులయిన తరువాత మా ఆచారాలు యావత్తూ మాఱిపోయాయి. పేరూరి ద్రావిళ్లు యింకా ముసలమ్మలు కుడిపైట వగయిరాలు మానలేదు గాని, తక్కినవి వారూ మానినట్లే. మావాళ్ళకంటే వారిలో యేకొంచెమో పూర్వసంప్రదాయం వుంటే వుందేమోకాని మా శాఖ పూర్తిగా ద్రావిడాచారం వదులుకుంది. వారు యింకా యే కొంచెమో నిషేధిస్తూవున్న మాతులకన్యా పరిణయం (మేనమామ కూతురిని పెండ్లాడడం) మాలో బాహాటంగా జరగడం ఆరంభమయి చాలా కాలమయింది. యితరశాఖీయులు మా శాఖనుగూర్చి :—

"ఆరామద్రావిడా స్సర్వే
యాచకాలీః పాచకా స్తథా..."

(ఉత్తరార్థం జ్ఞాపకం లేదు.) అంటూ వొక శ్లోకం చెప్పి ఆక్షేపిస్తే తిపర్తి నివాసులు వేదుల కంభుశాస్త్రులుగారు విని—"అః రామ! ద్రావిడా స్సర్వే" అని ఛేదించి ఆయీ శ్లోకార్థం ఆంధ్రాదిగా వున్న యావత్తు ద్రావిళ్లకీ, అనగా దక్షిణ హిందూస్థానస్థితమైన యావత్తు బ్రాహ్మణాళినికీ సమన్వయింప చేసినట్లు వినికిడి వొకరిని వొకరు యెత్తిపొడుచుకొనే ఆయీ శ్లోకాలవల్ల తేలే సారాంశం "బ్రాహ్మణానా మనేకత్వం, అనే అభియుక్తోక్తిని బలపఱచడంతప్ప యెందుకూ పనికి రాదని తేలుతుంది.

శుక్లయజుర్వేదులు ఆయీ పంచద్రావిళ్ళలోనివారే కాని యీ దేశంలో విస్తరించి వేరు మహారాష్ట్రులంతా శుక్లయజుర్వేదులే అని విన్నాను గోదావరి పుట్టినచోటు, నాసికాత్ర్యంబకంలో ఆఱువేలగడప శుక్లయజుర్వేదీయులు బ్రాహ్మణు లున్నారని పరమగురువుగారి వల్ల విన్నాను.

యాజ్ఞవల్క్యమహర్షి శుక్లయజుర్వేదియే. ఆయీ శాఖవారికి ప్రథమశాఖవారు అని నామాంతరం వుంది. తెనాలి రామలింగం ఆయీ శాఖవాడే. యీవిషయం, "అగ్రశాఖికాశాగేలమ వీవు" అనే పాండురంగమాహాత్మ్య పద్య పాదం తెల్పుతుంది. విశ్వబ్రాహ్మలు ఆయీ చరణానికి శాఖే అర్థమనిన్నీ, అగ్రశాఖ అంటే శాఖే అనిన్నీ, అతడు తమవాడే అనిన్నీ వ్రాసుకోవడమూ, చెప్పుకోవడమూ వుంది. వారికి అతనియందు వుండే అభిమానం సర్వథా అభినందనీయమే కాని. రామలింగం వట్టి బ్రాహ్మడే. కాని అన్యుడు విశ్వబ్రాహ్మడు) కాడు.

యీ యాజ్ఞవల్క్యబ్రాహ్మలలో (1) అనుమకొండలనీ (2) కాకుమానులనీ రెండు తెగలు వున్నారు. ఆయీ పేర్లువారువారు పూర్వం నివసించిన గ్రామాలనుబట్టి వచ్చినట్లు తోస్తుంది. యిందు మొదటివారు నియోగులు. రెండోవారు వైదికులు; కాని వీరికి అన్యోన్యమూ వివాహా లున్నాయి యిప్పుడిప్పుడు ఆర్వేలనియోగులకున్నూ, వైదికులకున్నూ వివాహాలు కలుస్తూన్నాయి గాని పూర్వం లేవు. యాజ్ఞవల్క్యులకు పూర్వం నుంచీ వున్నాయన్నమాట. ఆరాధ్యబ్రాహ్మణులతోమాత్రం అనాదిగా ఆర్వేలవారికి వివాహాలు వున్నట్టు గోచరిస్తుంది. కాని దాని క్కారణం ఆరాధ్యులు శైవులుగా మాఱక పూర్వం ఆఱువేలవారవడమే. శైవులకీ, నియోగులకీ ఆచారాలు చాలా భేదిస్తాయి. నిష్ఠాపరులైన శైవులు నియోగి కన్యకను పెండ్లాడడమంటూ వస్తే ఆమెకు లింగధారణం చేస్తేనేకాని ఆమె చేత నీళ్ళుకూడ శివపూజకు అంగీకరించరు. నియోగులు జాతాశౌచాదులన్నిటిలోనూ స్మార్తులతోపాటువారే లింగధారిశైవులో, కేవలం సన్న్యసించిన వారివలె వర్తిస్తారు. యేదో లోకంతో పాటుగా జాతాశౌచాదులు నటిస్తారు గాని, వారికి వాట్లతో లేశమూ అవసరంలేదు. "జందెము త్రెంచు. అన్నాడు రాయలు." కనుక ఆయీ జాతాశౌచాదిపరిత్యాగం వీరశైవుల (జంగాల)కే కాని మాకు కాదని ఆరాధ్యశైవులనడమయితే వుందిగాని, దానికి శాస్త్రాధారం కనపడదు. వారికి దహనం లేకపోవడం చేత సన్యాసులతోపాటు అంత్యకర్మకూడా లేనట్లే ఆయీ కారణాలవలన వారితో సంబంధబాంధవ్యాలకు నియోగులూ తటపటాయిస్తారు. ఆయీ తటపటాయింపులు అనకట్టుకు పూర్వం మాటలు. యీ ఆచారాలు చాలా వఱకు మార్పు చేయడానికి. కీ. శే. శివపురపు వీరభద్ర సోమయాజిగారు, యెంతో ప్రయత్నించారు. కాని అది తుదనెగ్గినట్లు లేదు. ఆమార్పువల్ల ఆరాధ్యశైవులు లింగధారణం తప్ప, తక్కిన సర్వమూ స్మార్తాచారంగా పరిణమించ వలసి వచ్చింది. ఆయనవాదం బొత్తిగా ఆరాధ్యులకు యెక్కకపోవడాని క్కారణం, దైవాత్తూ ఆయనకు వచ్చిన ఆకత్తులు కూడాను. ఆయీ ఆపత్తులు రావడాని క్కారణం అనాదిగా వున్న శైవుల సదాచారాలకు భిన్నంగా వర్తించడమేకాక, అలా ప్రచారం చేయడంకూడా అని శైవవృద్ధులు భావించడంలో నవీనమేమీ లేదు.


చతురులు కొందఱు కొందఱి బలవంతంవల్ల జందాలువేసుకొని యే విపత్తో దైవికంగా తటస్థిస్తే అది దీనివల్లనే అని భావించి తీసివేసిన వాళ్ళను నేనుకొందఱి నెఱుగుదును.

సరే. లింగధారిబ్రాహ్మణులూ నియోగులూ, ఆంధ్రబ్రాహ్మణశాఖవారే అని ఫలితార్థం. అనాదిగానే బ్రాహ్మణులలో షట్సహస్రశాఖవొకటి వున్నట్టు కొన్ని ఆధారాలు కనపడతాయి. కొందఱు యీ శాఖ శైవులూ వైష్ణవులూ కేలాగో ఆలాగే వైదికశాఖలోన్నుంచే క్రియాప్రయుక్తంగా బయలుదేఱిందని గోపప్రధానికి సంబంధించిన గాథ చెపుతారు ఆ యీగోప్రపధానిగాథ కేవలం తోసిరా జనడానికి. వీలయింది కాదనే నేనను కుంటాను అనాదిగా వుందన్నా సరే కొన్నాళ్ల నాడు కల్పితమయిందన్నా సరే, వచ్చే విప్రతిపత్తి లేశమూ లేదు నియోగులు ద్రావిడపంచకంలో అంతర్భూతులే యజనయాజనాదిషట్కర్మనిరతులే కాని, లౌకికవ్యాపారంలో ప్రవేశించి మంత్రిత్వాది పెద్ద పదవులు నిర్వహించిడానికి యజనాదికానికి తేజ సిమిరయోరిక సామానాధికరణ్యం కుదరకపోవడంచేత కర్మత్వానికి దూరం కావడమే కాక తుదకు బ్రాహ్మణపదమం దున్న గౌరవాన్ని అగౌరవంగా భావించడందాకా వచ్చి, బ్రాహ్మలు వేఱూ కరణాలు వేఱూ అనేస్థితికి రావడం చూచి కీ॥ శే॥లు శ్రీ నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షితులుగారు బాల్యాగారభ్య వేదవేదాంగా లభ్యసించి తమవారికి తత్త్వాన్ని బోధచేయడానికి పడ్డ పరిశ్రమ వివరించవలసివస్తే గ్రంథం చాలా పెరుగుతుంది ఆ రోజులలో ఆ దీక్షితులుగారు యీనాడు గాంధీమహాత్ముడు పడ్డంత శ్రమా, యెవరివల్లనైతేయేమి, పడ్డానడంలో అత్యుక్తివుండదు. ప్రతిపక్షులుగా వుండే వైదికులు సరేసరి ఆత్మీయులు కూడా దీక్షితులుగారికి యెదురు తిరిగి చాలా బాధించినట్లే వినికిడి. ఆ మహనీయుణ్ణి చంపడానిక్కూడా ప్రతిపక్షులు ప్రయత్నించినట్లే వినడం. నేను చదవలేదు గాని "విశ్వపత్యసురవిజయం" అనే వాదగ్రంథంలో ఆ యీ విషయా లుంటాయని తోస్తుంది. పై గ్రంథం దీక్షితులుగారికీ, విశ్వపతి శాస్త్రులుగారికీ జరిగిన వాదోపవాదాలకు సంబంధించి వుంటుందని దాని పేరే చెపుతూ వుంది.

వీరిద్దఱూ సతీర్థులని వినికిడి. అంతేకాదు, కొంచెం గురువుకూడాను సుప్రసిద్ధవిద్వాంసులైన మతుకుమిల్లి వారు దీక్షితులుగారికి యెదురు తిరిగారు. కారణం, దీక్షితులుగారు నిలువుబొట్టు సుతరామూ అంగీకరించరు. మతుకుమిల్లివారికి కొన్నితరాలనుంచి అనాదిగా నిలువు బొట్టే. దానికి అంగీకరిస్తే దీక్షితులుగారికి వైష్ణవదాస్యం దుర్వారం. ఆయీ దాస్యంగాని, స్మార్తదాస్యంగాని, శైవ (ఆరాధ్య) దాస్యంగాని దీక్షితులుగారు సుతరామూ వొప్పరు.

"అన్యోన్యం గురవో విప్రాః" కనక మీ రెంతో మేమంత. మాకు మీరు నమస్కరిస్తే మీకు మేం నమస్కరిస్తాం. బస్; అంతే-యిది దీక్షితులుగారి వాదం ఆయీ వాదం న్యాయం యుక్తియుక్తం. యీ వాదాన్ని శాస్త్రజ్ఞులయిన విజ్ఞులు ఆక్షేపించరు, మూర్ఖులూ, బడిద్దాయీలూ ఆక్షేపించడం లెక్కలోది కాదు అయితే మాత్రం చిరకాలాన్నుంచి వైదికులు పూజ్యులనీ, మనం పూజకులమనీ, వైదికులు ప్రతిగ్రహీతలనీ మనం దాతలమనీ యీలాంటి భావనకు అలవాటు పడినవారికి దీక్షితులవారి పంథా యెంత ధర్మ్యమైనదైనా సామాన్యగృహస్థులకు నచ్చలేదు. కాని విజ్ఞులకైతే నచ్చింది. కాని యీబొట్టు బొట్టులాగే వుంచుకుంటామన్నారు మతుకుమిల్లి వారు లోకవ యిన వారు. దానికి దీక్షితులుగారు_ససేమిరా, వల్లగాదన్నారుసరే ఏవో వాదోపవాదాలు జరగాయి.

18 వ పేజీ చూడుడు



భారత వాణిజ్యమండలుల సమావేశంలో మార్చి 28వ తేదీన సమస్త ఆర్థికశక్తి సంపదనూ దేశాభ్యున్నతికై సక్రమంగా వినియోగించాలని ప్రబోధిస్తున్న మన ప్రధాని నెహ్రూ.

భారత నౌకా, వైమానికదళములు

అభివృద్ధి ఆవశ్యకత

భారత అధినివేశ గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్‌బాటన్ ఈమధ్య భారతనావికులతో మాట్లాడుతూ భారత వైమానిక, నౌకాదళములను అభివృద్ధిచేయవలసిన ఆవశ్యకతను గురించి ప్రస్తావించెను. యుద్ధకాలములో భారత సైన్యము సంఖ్య...భూ, నౌకా, విమాన దళములన్నియు కలిసి—25 లక్షలవరకు పెరిగెను. కాని అందులో నౌకాదళము సంఖ్య ఒకటిన్నర లక్షలు మాత్రమే. విమానదళము సంఖ్య ఇంతకన్నను తక్కువ. ఆధునిక కాలములో భూతలదళముల ప్రాధాన్యము చాల తక్కువ. ఈనాడు ఏదేశపు రక్షణదళముల బలిష్ఠతయైనను యున్నూ వుండునట. మన నౌకాదళమునకు ఒక క్రూయిజరు ఈమధ్యనే కొన్నారు. అది ఇంకను అందలేదు. విమానవాహక నౌకలు లేకపోవుట వలన మన విమానదళముల ఉపయోగము, సమర్థత కూడ కొంతవరకు తగ్గిపోవును. అట్టి నౌక మన నౌకాదళమునకు ఇప్పటిలో లభించు అవకాశము లేదు. ప్రపంచరాజకీయవేత్తలు భయపడుచున్నట్లు, ఒక వేళ మరొక యుద్ధమే సంభవించిన, మన సుదీర్ఘ సముద్రతీరము ఎంత అరక్షితముగా వుండిపోగలదో వూహించిన భయము వేయును. కొత్తగా నౌకాదళములో జేర్చుకుని వారికి శిక్షణ నిచ్చుచున్నారు. నావికులకు అన్ని రంగములలోను శిక్షణ నిచ్చువారి సంఖ్యయే 33 వేలున్నది. మనదేశములో నావికుల సంఖ్య మొత్తము ఒకటిన్నరలక్షలు. ఇట్లే వైమానికుల సంఖ్యకూడ మన దేశములో చాల తక్కువయున్నది ఈ రెండు దళములలోను యువకులను జేర్చుకుని, వారికి శిక్షణ నిచ్చుట అత్యవసరమని భారత ప్రభుత్వము గుర్తించినది. కాని శిక్షణశాలలను, వాటి సామగ్రిని కూడా ఇప్పుడే అమర్చుకొనవలసివచ్చుటచేత పని చాల మందముగా జరుగుచున్నది. భూ, నౌకా, విమాన

ఆదేశపు నౌకా, విమానదళములసంఖ్య, ఆ దళములకుగల ఆయుధసామగ్రిపైన ఆధారపడి యుండును. అందును, సుదీర్ఘమగు సముద్రతీరముగల భారతదేశమువంటి దేశమునకు నౌకాదళము మిక్కిలి అవసరము. ఇంతవరకు మన నౌకాదళము ఏమాత్రము అభివృద్ధి జెందియుండకుండుటకు కారణములు వివరించి చెప్పనక్కర లేదు. ఈనాడు భారతదేశము స్వతంత్రమైనను ఒక్కమారుగా నౌకాదళముగాని, విమానదళముగాని మనము కోరుకొనునంతగా అభివృద్ధిజెందగలవని ఆశించకూడదు. నౌకాదళము అభివృద్ధి జెందుటకు క్రొత్తక్రొత్త రకముల నౌకలు ఎక్కువగా నిర్మింపబడవలెను. ఇందుకు అవసరమగు నిపుణులుగాని, నిర్మాణశాలలుగాని మన దేశములో లేవు. ఆధునిక నౌకల నిర్మాణమున భారతదేశ మిప్పుడే కృతకృత్యమైనది. మన దేశమున గల ఏకైక నౌకానిర్మాణశాలలో ప్రయాణీకులను, సరకులను రవాణా చేయగల నౌకలు మాత్రమే నిర్మింపబడగలును. దేశరక్షణకు అవసరమైన యుద్ధనౌకలు, విమానవాహకనౌకలు, క్రూయిజర్లు, డెస్ట్రాయర్లు, సబ్-మెరైన్లు తయారుచేయుటకు కావలసిన పరికరములు మన దేశములో లేవు. ఇట్టి పరికరములను సమకూర్చుకుని వానితో ఒక ప్రత్యేక నౌకానిర్మాణశాలను స్థాపించవలెను. ధనము ఖర్చు సంగతటుంచి, ఈ పరికరములు సంపాదించుటకు, నౌకానిర్మాణశాలను ఏర్పరచి, నౌకలను నిర్మించుటకు చాల ఎక్కువకాలము పట్టును. అంతవరకు ముఖ్యమైన ఈ రక్షణ నౌకలకొరకు మనము విదేశీయులపైననే ఆధారపడి యుండవలెను. మన నౌకాదళములో విమానవాహక నౌకగాని, క్రూయిజరుగాని ఒక్కటికూడ లేదు. మనకువున్న డెస్ట్రాయర్లు, సబ్‌మెరైన్ల సంఖ్య కూడ చాల తక్కువ. బ్రిటిషునౌకాదళములో, యుద్ధములో నాశనమైపోయినవి పోగా, 1948వ సం. అంతమునకు 4 యుద్ధనౌకలు, 8 విమానవాహకనౌకలు, 17 క్రూయిజర్లు, 84 సబ్-మెరైన్లు, 52 డెస్ట్రా

మన విమానదళముకూడ బాల్యావస్థలోనే వున్నది. ఇతర దేశములనుండి భాగములను తెప్పించి, వానిని కూర్చి విమానములను తయారు చేయుటయేగాని, తానై విమానములోని భాగములన్నింటిని తయారుచేయగల శక్తిగల విమాన నిర్మాణ కేంద్రము మన దేశములో లేదు. మనకు వున్న యుద్ధ విమానముల సంఖ్య కూడ బహుస్వల్పమే.

విమాన, నౌకా దళములకు విమానములు, నౌకలు ఎట్లో, వాటిని నడుపగల సైనికులుండుట కూడ అట్లే అవసరము. బ్రిటన్‌లో యుద్ధకాలములో దాదాపు 7 లక్షలమంది నావికులుండెడివారు. వీరిలో చాలమంది ఇప్పుడు సైన్యమునుండి పంపించివేయబడినను అవసరమైనప్పుడు ఒక్కమారుగా వారందరూ ఉపయోగపడెదరు. వీరు చాలక, యుద్ధానంతరము 1,25,000 మందిని

దళములలో అధికారులుగా పనిచేయగలవారికి శిక్షణ యిచ్చుటకు పూనావద్ద నున్న ఖడక్వాస్లలో ఒక సైనికశిక్షణశాల స్థాపించుటకు భారతప్రభుత్వము నిర్ణయించినది. ఈ శిక్షణశాలనిర్మాణము పూర్తియగువరకు డేహారాడూన్‌లోనే భూతలదళముల అధికారులతోపాటు, విమాన, నౌకాదళముల అధికారులకు కూడ సైనికశిక్షణ యిచ్చెదరు.

భారతసైన్యాభివృద్ధియేగాక, సైన్యములో అన్ని ప్రాంతముల ప్రజలుకూడ తమజనాభా నిష్పత్తినిబట్టి పాల్గొనుట వాంఛనీయము. వైమానికదళములో బెంగాలీల సంఖ్య చాల ఎక్కువ. కలకత్తాలో బెంగాల్ ఫ్లయింగ్ క్లబ్ ఒకటి ఏర్పడి, విమానచోదనమును నేర్చుకొనుటకు యువకులను ప్రోత్సహించుటయే ఇందుకు కారణము. ఇట్లే నౌకాదళములోకూడ బొంబాయి, బెంగాల్ వాస్తవ్యుల సంఖ్య హెచ్చు. మొత్తముమీద, సైన్యమంతటిలోను, ముఖ్యముగా, నౌకా, విమానదళములందు ఆంధ్రులసంఖ్య అతి తక్కువే. సైన్యములో జేరుటయన్న బ్రిటిష్‌వారికి సహాయముచేయుటయే నను భావమే ఇందుకు కారణము. ఇక ముందైనను ఆంధ్రయువకులు విరివిగా సైన్యములో జేరి తమకు లభించవలసిన అధికారపదవులను స్వీకరించుటకు అర్హత సంపాదించుకొనుట అవసరము. సైన్యముపట్ల ఇప్పుడు విముఖతవహించి, సైన్యములో ఉచ్చపదవులలో ఆంధ్రుడొక్కడూ లేడని చివరకు ఆందోళన జరుపుట అవివేకమే కాగలదు.

పశ్చిమబెంగాల్‌లో కమ్యూనిస్టుపార్టీ నిషేధం

పశ్చిమబెంగాల్‌లో కమ్యూనిస్టుపార్టీ నిషేధము, తొందరపడి జరిపిన చర్య కాదని తరువాత జరుగుచున్న సంఘటనలు రుజువు

భారత రాజకీయాలు

చేస్తున్నవి. త్వరలోనే అన్ని రాష్ట్రములలోను కమ్యూనిస్టుపార్టీ నిషేధింపబడినను మనము ఆశ్చర్యము జెందనక్కరలేదు. ఇతర రాష్ట్రములలో పార్టీ నిషేధింపబడకపోయినను పార్టీ నాయకులందరిపైనను అరెస్టు వారెంట్లు జారీ చేయబడియున్నవి. వీరిలో కొందరు అరెస్టు కాకుండ పరారియైయున్నారు.

భారతదేశమంతట, ముఖ్యముగ పశ్చిమ బెంగాల్‌లో తమ ప్రాబల్యమును విస్తరింపజేసికొనుటకు కమ్యూనిస్టులు అవలంబిస్తున్న విధానము దేశమునకు అనభ్యుదయకరముగా నున్నది ప్రజాస్వామ్య దేశములో ఏ రాజకీయ పక్షమైనను తన ప్రాబల్యమును విస్తరించుకొనుటకు రాజకీయముగా సక్రమమైన మార్గముల ద్వారా ప్రయత్నించుచుండుట సహజమే. తమ పక్షము అధికారమునకు వచ్చినచో అనుసరించు విధానమును గూర్చి, ఇప్పుడు అధికారములో నున్న పక్షము చేస్తున్న తప్పులను గూర్చియు ప్రచారముచేసి, ప్రజలలో తమ పలుకుబడిని విస్తరింప జేసుకొనుటకు రాజకీయ పక్షములు ఎల్లప్పుడు ప్రయత్నించుచునే యుండును. కాని దౌర్జన్యవిధానము ద్వారా తన పలుకుబడిని వృద్ధిపరచుకొనుటకు, ప్రభుత్వమును వశపరచుకొనుటకు ప్రయత్నించుట ప్రజాస్వామ్య లక్షణములు కావు. మనము స్వాతంత్ర్యము పొంది ఎన్నాళ్లో కాలేదు. స్వాతంత్ర్యము లభించగనే జరిగిన దుస్సంఘటనల ఫలితములనుండి ప్రభుత్వము, దేశము ఇంకను తేరుకొనలేదు. మన దేశమిప్పుడు ఆర్థిక, రాజకీయ విపత్తు నెదుర్కొనుచున్నది. ఇట్టితరి ప్రభుత్వయంత్రమును స్తబ్ధత నొందించుటకు, పారిశ్రామిక, వ్యావసాయిక ఉత్పత్తికి ఆటంకము కల్గించుటకు కమ్యూనిస్టులు పూనుకుంటున్నది, ఆయా ఉద్యోగుల, కార్మికుల అభ్యున్నతి కొరకుగాక ఈ ప్రభుత్వమును భగ్నమొనరించి, తమ పరిపాలనను భారతదేశముపై



డా॥ సుబ్బరాయన్



బి. సి. రాయ్



పి. సి. జోషి

రద్దుచేయుటకొరకే నని గ్రహించవలెను. స్వాతంత్ర్యము లభించినప్పటినుండి వీరి చర్యలపట్ల ప్రజలలో కొంత విముఖత ఏర్పడినది. తగ్గిపోతున్న తమ పలుకుబడిని నిలబెట్టుకొనుటకు కమ్యూనిస్టులు పారిశ్రామిక సమ్మెలు, రైతుహాలీ కలహాములు మొదలగు అనర్థదాయకర చర్యలను పురికొల్పుచున్నారు. కాని కలకత్తాలో వీరు ప్రారంభించిన సమ్మె పూర్తిగా విఫలమైపోయినది. తరువాత వీరి యాజమాన్యమున కలకత్తాలో జరిగిన అఖిలఆసియా యువజనమహాసభ, భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభ కూడ ఏమంత జయప్రదముగా జరుగలేదు అందువలన దేశమంతట మరొకమారు విధ్వంసకచర్యలు పురికొల్పుటకు, తమ పక్షమున కొక ప్రత్యేకసైన్యమును స్థాపించవలెనని వీరు ప్రయత్నించుచున్నారు. మత సంస్థలు, ప్రత్యేకపక్షములకు సైన్యములు వుండరాదని భారతప్రభుత్వము ఎన్నాళ్లనుండియో తెలియజేయుచునే యున్నది. అట్టి పరిస్థితులలో కమ్యూనిస్టుపార్టీని నిషేధించుటకన్న గత్యంతర మేదియు లేదు.

కమ్యూనిస్టుపార్టీని నిషేధించుటకు తగినంత సాక్ష్యము అన్నిరాష్ట్రప్రభుత్వములవద్దను పేరుకొనివున్నది. కాంగ్రెస్ కార్యవర్గము, ఎ. ఐ. సి. సి. కూడ కమ్యూనిస్టుల వైఖరిని గూర్చి త్వరలోనే చర్చింపనున్నవి. కమ్యూనిస్టుపార్టీ భవిష్యత్తు త్వరలోనే నిర్ణయము కాగలదు.

అరెస్టువారంట్లు జారీచేయబడిన కమ్యూనిస్టు నాయకులలో చాలమంది పరారియైవున్నారు. పార్టీ మాజీ కార్యదర్శి పి. సి. జోషి, నూతనకార్యదర్శి రణదివే మొదలగు ప్రముఖుల జాడ తెలియుటలేదు. వీరందరు ప్రచ్ఛన్నముగానుండి, విధ్వంసక చర్యలకు పూనుకొను అవకాశము లేకపోలేదు. ఇట్టి చర్యలవలన నష్టపడునది దేశము, ప్రజలేగాని మరెవ్వరుకాదు. కాబట్టి ప్రచ్ఛన్నముగ నున్న వారిని పట్టుకొనుటకు ప్రభుత్వమునకు తోడ్పడి,



బొంబై ఆజాద్ మైదానంలో ఆసియా యువజన ప్రదర్శన సందర్భాన ఐక్యరాజ్య దినోత్సవం జరిపినప్పుడు ఉపన్యసిస్తున్న రాష్ట్రపతి రాజన్‌బాబు. ఢిల్లీలో ఐక్యరాజ్య సమితి ప్రతినిధి మెరియన్ డిక్సన్ కన్య ఐక్యరాజ్యపతాకాన్ని ఎగురవేసింది.

కార్యదర్శి తన పదవికి రాజీనామానిచ్చి, సమ్మె చేయవలదని ఉద్ఘాటించినాడు. మొత్తం 70 మందివరకు నిరాహారదీక్షవహించి వున్నారు; 117 నుకు ఇంతవరకు అరెస్టు చేయబడి, జామీను పైవిడుదలచేయబడిరి. మొదటిరోజున కార్యాలయములముందు తీవ్రముగ పికెటింగ్ జరిగినది. కాని రెండవరోజున పికెటింగ్ చాలతక్కువై, ఆఫీసుకు వెళ్ళదలచినవారికి ఏమాత్రము ఆటంకము లేకుండ వెళ్ళుటకు అవకాశము లభించినది.

ప్రభుత్వ సిబ్బంది జీతములను గురించి విచారించి, ఆలోచించి, క్రొత్త ప్రమాణములను సూచించుటకు భారత ప్రభుత్వ మెన్నాళ్ళక్రిందనో ఒక సంఘమును నియమించినది; జరుగవలసిన సంస్కరణలను సూచించుచూ ఆ సంఘము తన నివేదికను సమర్పించినది; ఆ సూచనలు న్యాయయుక్తముగా నున్నవని అన్ని వర్గములవారు శ్లాఘించిరి; వానిని అమలు జరుపుటకు భారతప్రభుత్వ మంగీకరించినది. కొంత

యుద్ధకాలములో, సైన్యములో 25 లక్షల మంది సైనికులు చేర్చుకొనబడిరి. వారిని గురించిన వ్యవహారములు చూచుటకు అనేకులు ఉద్యోగులుకూడ అప్పుడు నియమింపబడిరి. అట్లే యుద్ధకాలములో కంట్రోలు, రేషనింగ్ మొదలగు అత్యవసర చర్యలను అమలుజరుపుటకు పెద్దసిబ్బంది నియమింపబడెను. యుద్ధానంతరము సైనికులు ఇండ్లకు పంపివేయబడిన తర్వాత, వారికొరకు నియమింపబడిన ఉద్యోగుల

కమ్యూనిస్టు పక్షంపై ఆంక్ష

దేశశ్రద్ధను, ప్రయోజనములను రక్షించుటకు అందరును కృషి చేయవలెను.

కలకత్తాలో

కేంద్రప్రభుత్వోద్యోగుల సమ్మె

కలకత్తాలోని కేంద్ర ప్రభుత్వోద్యోగులు ఏప్రిల్ రెండవ తేదీనుండి సమ్మె చేయుచున్నారు. ఇతర సమ్మెలవలెగాక ఆఫీసులకు వెళ్లి పనిచేయకుండుటద్వారాను, నిరాహారదీక్షవహించుటద్వారాను ఈ సమ్మెను జరుపవలెనని కలకత్తా కేంద్రప్రభుత్వోద్యోగుల సంఘము నిర్ణయించినది. అందువలన ఈ సమ్మె ఏమాత్రము జయప్రదముగా జరిగినను చాల ప్రమాదకరముగా పరిణమించియుండుననుటలో సందేహము లేదు. అదృష్టవశాత్తు, సమ్మె ఏమాత్రము జయప్రదముగా జరుగుటలేదు. నాలుగైదు కార్యాలయములు తప్ప తక్కినవన్నియు మామూలుగానే పనిచేయుచున్నవి. ఉద్యోగుల సంఘ

కార్యాలయాల సోదాలు, నాయకుల అరెస్టులు

ఈ సమ్మె ఒకటి రెండు రోజులలోనే ముగిసిపోగలదు.

ఈ సమ్మెను ప్రారంభించుటకు ఉద్యోగుల సంఘము చూపుచున్న కారణములు రెండు. ఒకటి, జీతము పెంచవలెనని; రెండు, తాత్కాలికముగా నియమించబడిన ఉద్యోగులను తొలగించకూడదని. విశాలదృక్పథముతో ఆలోచించినచో ఈ రెండు కారణములుకూడ సబబైనవి కావని వారికే బోధపడియుండెడిది. కేంద్ర

వరకు అమలుజరుపుటకూడ జరిగినది. కేంద్రప్రభుత్వోద్యోగుల జీతములతో పోల్చిచూసిన రాష్ట్రప్రభుత్వోద్యోగుల జీతములు చాల తక్కువ అని చెప్పవలెను. జిల్లాబోర్డులు, మొదలగు ఇతర స్థానికసంస్థల ఉద్యోగుల జీతములు అంతకన్న మరీ తక్కువ. అట్టి పరిస్థితులలో అందరికన్న అధికసౌకర్యము లనుభవిస్తున్నవారు ఇంకను ఎక్కువ సౌకర్యములు కావలెనని కోరుట ఏమి సమంజసము?

అవుసరము తీరిపోయినది కదా అట్టివారికి జీతమిచ్చుచు, ప్రభుత్వమెంతకాలము భరించగలదు? సైన్యమునుండి తమ్ము తొలగించినందుకు సైనికు లెవ్వరు సమ్మె చేయలేదే! సైన్యమునుండి వచ్చివేసిన తర్వాత, ఇతరఉద్యోగములు వెదుకుకొనుటకు సైనికుల కెట్లో, ఈ ఉద్యోగులకు అట్లే సహాయపడెదమన్ని ప్రభుత్వము వాగ్దాన మిచ్చి యున్నదికదా? రేషనింగ్, కంట్రోల్ తొలగించిన తర్వాత ఆ సిబ్బందినంతను ప్రభుత్వము ఎట్లు భరింపగల్గును? ఇట్లున్న, ఆ ఉద్యోగులందరు ఒక్కమారు ఇతర జీవనోపాధి నెక్కడ సంపాదించుకొనగలరని రని మనము ప్రశ్నింపవచ్చును. ఈ ఉద్యోగులను క్రమేణా తగ్గింతుననీ, తొలగించినవారికి ఇతరత్రా ఉద్యోగము లభించునట్లు చేయగల్గినంత సహాయము చేసెదనని ప్రభుత్వము తెల్పియున్నదికదా? ఈపరిస్థితులలో తాత్కాలికోద్యోగుల నెవ్వరిని తగ్గించకూడదని పట్టుబట్టుట కేవల మవివేకమే యగును.

ఇట్టి బేసబబుకారణములవలన ప్రభుత్వోద్యోగులవంటి విజ్ఞానవంతులు సమ్మెకు పూనుట తగని పని. అతిబాల్యావస్థలోనే, అనేక బాలారిష్టముల నెదుర్కొనవలసి వచ్చిన మనప్రభుత్వమునకు మరొక ఆటంకము కల్పింపజూచుట అసమంజసము. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూగారు చెప్పినట్లు "ఈనాడు ప్రభుత్వయంత్రమునుగాని, వస్తూత్పత్తిశక్తినిగాని భగ్నమొనరప్రయత్నించుట అత్యంతబాధ్యతా రహితము, దేశవిద్రోహకరము నగు చర్యమాత్రమే కాగలదు

ఉద్యోగులకు వారిపరిస్థితులపట్ల అసంతృప్తివలనగాక, ఇతర రాజకీయ ప్రోద్బలము వల్లనే ఈ సమ్మె ప్రారంభమైనట్లు అనుమానించుటకు అవకాశము లేకపోలేదు. తమపక్షమునకు పలుకుబడి ఎంత తక్కువగా నున్నదో గమనించి, ఇకముందైనను వారు అత్యధికసంఖ్యాకులపై, అత్యల్పసంఖ్యాకులగు తమ నిర్ణయములను రుద్దుటకు ప్రయత్నింపకుండుట మంచిది.



సర్ కట్టమంచి రామలింగారెడ్డి కళాశాలాభవనానికి గౌ॥ శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు శంకుస్థాపన చేసిన దృశ్యం.

కంటికి జోడులేకుండా దృష్టిని సంపాదించేదేలాగు?

శ్రీ మక్తైవి శ్రీ రంగాచార్యులు

అవయవము లన్నింటిలో కన్ను చాల ప్రధానమైనది. చూపు లేనిదే ప్రపంచము లేదు. వైద్యులు, ప్రముఖశాస్త్రవేత్తలు కండ్లనుగూర్చి పరిశోధించలేదు. కండ్లకు జబ్బు అనగానే సాధారణంగా లెన్సు అంటారు వైద్యులు.

బాపూజీకి అభిమానమైన ప్రకృతి వైద్యంవల్ల సాధారణంగా వచ్చే 'లాంగ్ సైటు' 'షార్టు సైటు' జబ్బులను లెన్సుతో నిమిత్తంలేకుండా చక్కటి దృష్టిని మనం పొందుటకు అవకాశాలున్నాయి. 50 సం॥రాల పూర్వం నేడు మనకు కనబడుతూన్నంతమంది జోడు వాడేవారుగారు. ఒకడు కంటికి జోడు నుపయోగిస్తే సహచరుడు కూడ ఉపయోగించాల్సిందే. ఇది ఒక అంటు వ్యాధి యైపోయింది. మనం ఆహారవిహారాదులవల్లనే జాడ్యాలను తెచ్చుకొంటున్నాము. ప్రకృతిబద్ధమైన నియమాలను మనం మీరితే అప్పుడే వ్యాధి మనదరికి చేరుతుంది. కంటినిగూర్చిగూడ అట్లే యోచించుకోవాలి. కృత్రిమ చికిత్సల చేయరాదు. విరేచనబద్ధమున్న రోగికి ఎనిమా చేస్తూంటే రోజూ విరేచన మవుతుంది. ఏ రోజున చేసుకోడో, ఆ రోజున కాదు. ఆప్రేగులకు అంతకుపూర్వం వున్న బలం కూడ పోతుంది. చీకటిలో బ్యాటరీలైటువల్ల బాట కనబడినా లైటు తీసివేస్తే అంతకు పూర్వము కొద్దిగా చూడగలిగే శక్తిపోయి మరల లైటు కావాలనే కోరుతాడు. అట్లే యీ కృత్రిమ విధానంవల్ల మనలో శక్తి పోయి బలహీనులమైన ఆయుర్దాయము కూడా తగ్గిపోయి సగం కాలమే జీవిస్తున్నాము. తాత్కాలికంగా లెన్సులవల్ల చూడగలుగుతూఉన్నా స్వతస్సిద్ధమైన కంటికి ఉన్నతశక్తిని క్షీణింపజేసి దాన్ని చాల బలహీనపరుస్తున్నాము.

దృష్టికి సంబంధించినంతవరకు లాంగ్ సైటు, షార్టుసైటు అనియు, కంటికి అంతకు సంబంధించినవి కాటరాక్టు, గ్లూకోమా, ఐరిటిస్ అనునవి ముఖ్యమైన వ్యాధులయి యున్నవి. ఈషార్టుసైటు అనేది విద్యార్థులలో ఎక్కువమందికి చూస్తూయున్నాము. లాంగ్ సైటు పెద్దవారిలో చూస్తూయున్నాము. అయిరిస్ వెనుకవైపు, అనగా కంటిలోపల రంగుప్రదేశమునకు వెనుకవైపు ఒక లెన్సు ఉంటుంది. ఈ లెన్సు వెనుకవుండే రెటీనా అనుదానిమీద లెన్సువల్ల మన భావాలు ప్రతిఫలింపచేయబడి, తలలోని ఆప్టిక్ నర్వు అనే చోటికి తీసికొని పోబడతాయి. అప్పుడు మనం చూడగలుగుచున్నాము. అయితే యీ ప్రతిబింబాలు ఏలా చూపును కల్పింపజేస్తాయి అనే ప్రశ్నకు యింతవరకును వైజ్ఞానికులు సమాధానం చెప్పలేకుండా వున్నారు. కాటరాక్టు ఉంటే కంటిలోని లెన్సు పనిచేయలేక వెలుతురు లోపలికి చేర్చలేనిదై వుంటుంది. ఈ లెన్సు శస్త్రచికిత్సవల్ల సొంతముగా గాని, ఎక్కువభాగముగాని తీసివేసి కండ్లకు జోడు యిచ్చి దృష్టి బాగుపడిందంటారు అల్లోపతి వైద్యులు. ఈ జబ్బు ఆరంభము అయిందనగానే చూచి బాగా ముదిరేవరకు మందు ఏమీ లేదంటారు. ఈలోపల కన్ను కనబడక అవసపడవలసిందే. ముదిరిన తరువాత శస్త్రచికిత్స. డైబిటీసు, బ్రైట్సురోగములవల్ల సాధారణంగా కాటరాక్టు వస్తుందని ప్రముఖవైద్యులు అభిప్రాయ మిస్తూకూడా ఆ రోగనివారణలకు ఎందుకు పూనుకోరా అని ప్రకృతివైద్యులకు ఆశ్చర్యము కలిగిస్తుంది. ప్రకృతివైద్యుల మగు మేము చెప్పేది ఏమనగా, కంటికి ఎక్కువ శ్రమవల్లనున్నూ, లోగడ పాశ్చాత్యవిష వైద్యములవల్ల పూర్వజబ్బులు అంతర్గతమై వున్నందువల్లనున్నూ ఈ కాటరాక్టు కల్పిందంటాము. ప్రకృతివైద్యంవల్లకూడా బాగా ముదిరితే దీనికేమీ చికిత్స లేదు. ముదరక పూర్వమే ప్రకృతివైద్యము పొందుతూ ఆహార నియమము పాటిస్తూ దిగువ తెల్పిన చికిత్స చేస్తే తప్పక నివారణ మగును. పంచదార, కాఫీ, టీలు తప్పక విసర్జించవలెను. గ్లూకోమా అను జబ్బులో ఎక్కువ ద్రవంవల్ల గట్టిపడి అందువల్ల రాత్రిపూట దూరపు వస్తువులచుట్టూ గుండ్రని రంగులు కనబడతాయి. ఇక Conjunctivitis అను వ్యాధిలో చీము, వాపు నీళ్ళు కన్నువెంబడి ప్రవిస్తాయి. ఎక్కువ శ్రమే దీనికి కారణము. కంటిజబ్బులు ముఖ్యమైనవి తెల్పితిని. ఇక దృష్టినిగూర్చి లాంగ్ సైటు, షార్టు సైటు నివారణకు మార్గాలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా షార్టుసైటు వున్నవాళ్ళమీద పులువురిమీద యీ చికిత్సలు వుపయోగించి చూచాను.



మద్రాసులో బ్రిటిష్ డిప్యూటీ హైకమీషనర్ సి. వి. గాల్సు, అతని సతీమణి.

కంటికి దృష్టి తగ్గుటకు ముఖ్యకారణము ఎక్కువ శ్రమ గల్గించటమే. శ్రమ అంటే ఏమిటి? తదేకదృష్టితోగాని, నిబ్బరమైన దృష్టితోగాని చూచిన కంటికి శ్రమ గల్గును. మన దృష్టిని కేంద్రీకరించినప్పుడు మన మనస్సుకు కూడ పని కల్పించినవారమగుదుము. మనస్సుకు శ్రమ గల్గి ఆలోచనాభాగం తగ్గి దృష్టిలోపం కలుగుతుంది. అందువల్ల తలనొప్పి, కంటినొప్పులనగూడా మనం తెలుసుకోగలుగుతాము ఒక్కొక్కప్పుడు. మనస్సుకు విశ్రాంతి కలుగజేయాలి. మనస్సు నిర్మలంగా వుంచుకోవాలి. ప్రతిఅభ్యాసకుడు ముందుగా మనస్సులో ఆలోచనలు లేకుండా చేసుకోవాలి. ఆ పిమ్మట ప్రతి యింట్లోను దృష్టిని పరిశీలించే అట్ట పెట్టుకోవాలి. బాగా వెల్తురు, గాలి, వచ్చే ప్రదేశంలో గోడకు అట్ట తగిలించాలి. ప్రతివారు ప్రతిరోజు యీ అట్టమీద అక్షరాలను ఒక కన్ను మూసుకొని రెండవ కన్నుతోనూ, రెండవ కన్ను మూసి మొదటి కన్నుతోనూ చదవాలి. ప్రతి అక్షరము మీద ఎంతదూరంలో కనబడాలో అంకె వేసి వుంటుంది. పెద్దఅక్షరముమీద 30 వుంటే 30 అడుగులదూరంలో చదవగలిగి వుండాలన్న మాట. ఆ ప్రకారంగా సరిగ్గా చదవగలిగితే దృష్టిదోషము లేదు. 10 అడుగులదూరంలో పెట్టి రెండుకండ్లతో ఒకటి అయిన పిమ్మట రెండో దాంతో చదివి పరీక్షించుకొనుము. దృష్టిలో దోషంవుంటే రోజూ దిగువ చికిత్సలు చేయాలి. ప్రథమంలో సూర్యచికిత్స చేయవలెను. తల, పొట్టమీద గుడ్డ కప్పుమనుము. సూర్యరశ్మిలో కండ్లకు 10 నిముషాలకు మించకుండా మూసుకుని కూర్చొనుము. తలను, కండ్లను ఒకవైపునుంచి రెండోవైపుకు త్రిప్పుము. కంటిమీదగుడ్డ ఏమీ వుండగూడదు. కండ్లను నొక్కి మూయగూడదు. క్రమేణా 30 నిముషములవరకు చేయవచ్చును. వేడి భరించలేననుకున్నా, కష్టముగానున్నా చేయుట ఆపివేయాలి. దీనినే సూర్యచికిత్స అంటారు. ఆ పిమ్మట పామింగ్ (Palming) అనే చికిత్స చేయాలి. అనగా కండ్లు తెంచుట, మూయుట తరచుగా చేయాలి. నెమ్మదిగా చేయాలి. కండ్లు మూసుకున్న పిమ్మట కాంతి కనబడుతుంది. అదికూడా కనబడకుండా చేతులతో మూసుకోవాలి. కండ్లు నొక్కగూడదు. మూసుకున్న పిమ్మట మనకు సంతోషకరమైన వస్తువులు తలచుకోవాలి. ఆ వస్తువులనగూర్చి దీర్ఘంగా ఆలోచించ గూడదు. పిల్లలు ఆటవస్తువులను, తల్లులు పిల్లలను, కళాపరిశోధకులు బొమ్మలను, డాక్టర్లు మందులను యీ ప్రకారంగా వారివారి జీవితంలోని వృత్తులనబట్టి మనస్సుకు కష్టం లేకుండా తేలికగా ఏవి తలచుకోగలుగుతారో ఆవస్తువులనే తలచుకోవాలి. ఈ వస్తువులను కదలిచేటవంగా వుండేటట్లుగా ఆలోచించుకోవాలి. ఈ పామింగ్ పడుకునిగాని కూర్చొనిగాని చేయవచ్చును. నిలబడి చేయరాదు. ఈ ప్రకారంగా, 5 నిముషాలకు తక్కువలేకుండా ఆలోచించాలి. ఈ పామింగ్‌వల్ల మనస్సుకు విశ్రాంతి కలుగజేయబడుతుంది. ఈ చికిత్సలో కండ్లు అలసట చెందేయెడల అక్షరాలు చదివే టెస్టుకార్డు (Test Card) ను 6 అడుగుల దూరంలో చూపుడువేలు ముందువైపు కనబడునట్లుగా ఒక కంటివైపు పట్టుకొనవలెను. ఆకంటిని ఆ అక్షరాలుచదవకుండా అటు, ఇటు త్రిప్పుము. ఆ వేలు తల తిరుగువైపు గాకుండా రెండోవైపు తిరుగునట్లుగా మనకు గోచరిస్తుంది. వఱ్ఱికళ్లు మూసుకుని ఆవేలు తల తిరిగినవైపే తిరిగిందని భావించవలెను. అభ్యాసమువల్ల క్రమేణా కన్ను తిరిగినవైపే వేలు తిరుగుతూన్నట్లు మనం చూచేటప్పుడుకూడా చూడగలుగుతాము. వాటివైపు తీక్ష్ణంగా చూడగూడదు. కొద్దిసేపు యీ విధంగా చేసి పామింగ్ అయిదు నిముషములు పూర్తిచేయుము. ఈచికిత్సపిమ్మట అట్టనుచూచి 10 అడుగుల దూరములో చదువవలెను. కండ్లకు మబ్బుగా, చీకటిగా వుంటే చదువుట మానవలెను. చదువునప్పుడు తల, కండ్లనురెండు ఒక ప్రక్కనుంచి రెండోవైపుకు నడుపవలెను. స్పష్టంగా వున్న పెద్ద అక్షరాలనే ముందుగా చదువవలెను. రోజూ సూర్యచికిత్స, పామింగ్, టెస్టుకార్డుతో చదువుట యివి తప్పక చేయవలెను. టెస్టుకార్డును ఒక కన్ను మూసి రెండో కన్నుతో, ఆరెండవకన్ను మూసి మొదటికన్నుతో యీ ప్రకారం రెండుకండ్లతో చదువవలెను. పైకి చూడదలంచిన తలవంచి చూడరాదు. ఏ వైపు చూడవలసినా ఆవైపు తలను త్రిప్పికండ్లను ఆవైపుకు త్రిప్పాలి. ఉపన్యాసాలు వినేటప్పుడు ఒకేకంటితో చూడగూడదు. రాత్రిళ్లు వ్రాతపని కూడదు. చికిత్సాకాలంలో సినిమాలు చూడరాదు. ఎందువల్లననగా వెలుతురులోనుండి ఒకేసారి చీకటిలోకి వెళ్లినందువల్ల కంటికి శ్రమ హెచ్చు కలుగును. చదువునప్పుడు యింట్లో వెలుతురు పుస్తకముమీద పడేటట్లుగా పుస్తకము పెట్టి చదవాలి. పుస్తకము పైనుంచి క్రిందవరకు సమానదూరంలో వుండునట్లు పెట్టుకోవాలి. చికిత్సాకాలంలో ఎన్నడూ జోడు వాడగూడదు. టెస్టుకార్డువల్ల మన దృష్టి అభివృద్ధి అయినట్లుగా తెలుసుకొనేవరకు చేయాలి. కష్టము లేకుండా తేలికగా అక్షరాలన్నీ చదివే వరకుచేయాలి యీ చికిత్స.

డాక్టరు బేట్సు, బెంజమన్ అను పాశ్చాత్య ప్రకృతివైద్యులు యీవిధానాలన్నీ పరిశీలించారు. బెంజమన్ కాటరాక్టుకూడ యీ విధానంవల్ల మాన్పగలిగా నన్నాడు. మనదేశంలో గుజ్జరాత్... ఢిల్లీలోని డాక్టరు అగర్‌వాల్ యివన్నీ పరిశోధనలు సల్పి కృతకృత్యు డయ్యాడు.

కథానిక:

గృహలక్ష్మి

శ్రీ కందుకూరి లింగరాజు

అవ్వాళ ఇంటికి వస్తూ దారిలో సింహకోట్లో ఏవో ఏవో కొన్నాడు. స్క్వేర్ దగ్గరనే పువ్వులమ్మే సాయిబు, 'బాబుగారు చవక, మల్లె చెండు అణా' అని చేతిలో పెట్టేడు. అవి మోసుకు వస్తుంటే రాజాకి క్రొత్తగా తట్టింది. ఇదివరకు రోజుల్లో తనకి సంసారము లేనే లేదు. ఇల్లాంటిది పట్టుకు వెళ్ళాలన్న ప్రసక్తే రాలేదు. నవ్వుకూడా తెప్పించింది ఆవూహ.

ఇప్పటికో, పెళ్ళయి రెండునెలలు దాటింది. సుందరి కాపురానికి వచ్చేసింది. అంతవరకూ, సుందరి ఇప్పుడు ఆక్రమించుకున్న స్థానం, భావనతో, స్వప్న జగత్తులో సృష్టించి, విచిత్రమైన సన్నివేశాల్లో ఊహించేడు.

ఊహించడంకూడా ఆరోజున ఆయన ఎవరో అన్నమాటలే సంసారాన్ని అనేక రకాల సీసాలలో పోసి సంయుక్తత కల్పించకలసివచ్చింది. మొదట్లో ఎంతోమంది చెప్పేరు. 'పెళ్లి చేసుకున్నాం కాని...ఏదో ఉన్నాం...' అన్న ముక్కలే చాలాకాలం వరకు వివాహం అన్న ముక్క రానివ్వకుండానే గడిపేడు. కాలం జరుగుతుంటే ఆతనికే ఆశ్చర్యం వేసింది. అందరూ అల్లా అంటూనే సంసారంలోకిపడతారెందుకూ అని ఊహించడం వచ్చింది.

ఈ ఊహించడంలో అంత భయపడే మిత్తి కాదనే తట్టింది. పైగా విచిత్ర పరిస్థితులలో, తన జిల్లాలో నాల్గో తారీఖున మంగళసూత్రము కట్టి, అగ్నిసాక్షిగా పెళ్లాడేడు. అంతా క్రొత్తగాకన్పించింది. రోజురోజుకు తనవూహాలు వెళ్ళని స్థితుల్ని ఎత్తి చూపించింది. ఈ పరిశోధనకూడా విచిత్రఅనుభవం చూపిస్తోంది.

దారిలో ఈ వూహాలు ఎందుకో ఆక్రమించేయి. సరిగ్గా అవ్వాళ మొదటి ఆటకి సినిమాకి తయారుగా వుండమనే చెప్పేడు. ఆకుపచ్చ రంగు గళ్ళచీర, అరుద్రపురుగు రంగు జాకెట్టు కట్టుకోమని చెప్పేడు. ఆవిడ అడగడం. ఈతను చెప్పటంకూడా విచిత్రంగానే వుంది అంతవరకూ తను వూహించి, కథలుగా వ్రాసి ప్రజల్లో పడేసిన సారస్వతం అంతా, మిథ్యా సారస్వతం, సహజఅనుభవంలేనిది అన్నట్టే తట్టింది. మరి సంసారం ఇల్లా వుంటే అందరూ ఎందుకల్లా గాభరా పడతారో తెలియకుండా వుంటోంది.

పెళ్ళిలో కాబోలు మిత్రుల్లో ఒకళ్ళు సందేశం పంపేరు. 'రచయితి జీవితంలో వివాహం ఓమార్పుతెస్తుంది. అది వారి రచనల్లో నూత్నత్వం ప్రతిఫలించితే, ఆ గౌరవము శ్రీమతికి చెందుతుంది' అన్న వాక్యాలు జ్ఞాపకం వచ్చేయి. ఇంతవరకూ అల్లాంటి నూత్నత్వం రావడాన్కి సన్నివేశాలు అమరుకోలేదు. తనకి కోరికా రాకల్గలేదు. నిజమా? అబద్ధమా? అన్నదే ఉండిపోయింది.

మలుపు తిరుగుతుంటే కుటుంబరావుగారు కన్పించి నవ్వేడు. రాజాకి సిగ్గువేసింది. 'క్రొత్తసంసారం' అన్నట్టే ఆయనచూపు ధ్వనించింది. 'మరి తప్పేమి కాదండీ' అంటూనే కుశల ప్రశ్నల్లోకి దిగేడు. వస్తూవస్తూనే మంత్రిగార్ని చూడాలని ఆయన చీలి వెళ్లిపోయేడు. 'అప్పుడే ఇద్దరుబిడ్డలతండ్రి, నాకు ఉండకపోతే, ఆయనకి వుంటుందేమిటి?' అన్ను అనునయంతో. అడుగులు త్వరగా వేసేడు.

వీధి తిరిగితే తన ఇల్లు కన్పిస్తుంది. ఎదురుగా వున్న మేడలో అమ్మాయిలూ కన్పిస్తారు. అమ్మాయిల్ని చూచినపుడల్లా ఏమిటోలా అతనికివుండేది. రోజూ వాళ్లూ పలకరిద్దామనుకునేవారు. ఈతనూ అనుకునేవాడు. నాల్గు నెలలు గడచిపోయాయి. ఇంతకీ పలకరించడం మాత్రం జరగనే లేదు.

వీధిగుమ్మంలో సుందరి నుంచుని నవ్వుతుంది తన్ని చూడగానే; అందులో చేతులో వున్న సరంజామాని చూస్తే సిగ్గుపడుతుంది అనుకున్నాడు. సుందరి, సిగ్గుపడితేను, నవ్వితేను, తను ఏభావంతో వుండాలో తెలియక తికమక పడ్డాడు.

మెట్లు ఎక్కేడు. సుందరి గుమ్మంలో కన్పించకపోవడంతో కొంచెం నిరుత్సాహంగానే కాళ్ళు పడ్డాయి. లోపలికి వచ్చి వరండాలో చెప్పులు చప్పుడు చేస్తూనే విడిచేడు. అంతవరకూ అయినా సుందరి రానే రాలేదు.

ఎంచేత కన్పించలేదా? అన్న ఊహకి సమాధానం రావటం లేదు. బహుశః ప్రక్కింటి మేష్టారు పెళ్ళాంతో మాట్లాడుతోంది కాబోలు అనుకున్నాడు. గడియారం చూచేడు. ఆరు ఘంటలూ అవుతోంది. ఇంకెప్పుడు బయల్దేరి ఆ అర్ధమైలు ఉన్న మినర్వాకి వెళతాను అనుకున్నాడు తను నిరుగ్గా చెప్పనే చెప్పేడాయె తయారుగా వుండమని. ఎంచేత జాగారం చేస్తోందా? అన్న ప్రశ్న తెలియని పుస్తకం క్రిందనే వుండిపోయింది.

వంటింట్లో పని తెమల్లేదేమో! అంతా క్రొత్త పాపం అనుకుని, అక్కడికి వెళ్ళేడు. అంతా సర్దినట్టే వుంది. వంటపొయ్యిమీద మూత పెట్టిన వంటకాలు కన్పించనే లేదు. అసలు ప్రొద్దుట పొయ్యి సర్దినట్టయినా లక్షణాలు చెప్పలేదు. మనస్సు చివుక్కుమంది. ఆశ్చర్యం కల్గ చేస్తోంది.

సుందరి ఏమైనట్టూ? ఏం చేసినట్టూ? ఎక్కడికి వెళ్ళింది? తను నాకరిలోంచి త్వరగా ఎల్లానూ తెమిలి రాలేనని, సినీమాకి వెళ్ళడం పడదుకదా అని, తన భావనల్లో తాను ఉండిపోయిందా?

చేతిలో పొట్లాన్ని, అచేతనంగానే బల్లమీద పెట్టేడు అవి క్రొత్త అధ్యాయాల్లో దూతిక లేమో అనుకున్నాడు. వీటని ఎంత సంతోషంతో ఇద్దామనుకున్నాడో అంత నిరాశా కల్గింది.

చొక్కా విప్పి కుర్చీకి తగిలించేడు. స్టాండునున్న తువ్వాలు తీసుకుని భుజంమీద వైచుకుని కూర్చుందామనుకుంటుంటేనే, పడకదిలోంచి సుందరి వచ్చింది. ఇంట్లోనే వుందన్న మాట! కోపం వచ్చింది. తను సినీమాల్లో చూచినట్టుగా కోపంవస్తే ఏ గగ్గుర్యాలగో పద్యం చదవాలేమో అన్నది కూడా తెలియదు. కాని అది లోపల్లోపలే మ్రింగుకున్నాడు.

సుందరి!!

ఈ, ఇంత అశుభ్రతావతారంతో కళ్ళెదుట పడుతుందని అనుకోలేదు. చింపిరి జుట్టు, పొగకంపు చీర, పమిట చెంగు మసి—ఎంత అసహ్యంగా వుండాలో అంతగానూ ఉంది. ఇంతవరకూ ఎప్పుడూ సుందరిని అల్లా చూడలేదు.

గడిచిన రోజుల్లోని అనుభవం 'ఈరోజు ఇల్లా ఎందుకు వుందా?' అన్న ప్రశ్నని రేకెత్తించి. కళ్లంతా సూదులు పెట్టి పొడిచినట్టే చేస్తోంది. ప్రొద్దుటనుండి తన చర్యలన్నీ సింహావలోకనము చేసుకున్నాడు. ఒక్క అంశంలో అయినా సుందరిని హేళన చేసిగాని, అపహాస్యం చేసినది దొరకనే లేదు. మరి? "ఒంట్లో బావుండలేదా?" సంశయంతోనే అన్నాడు.

"కనపట్టం లేదూ......" ఈ అకాలవర్షానికి రాజా బెదిరిపోయేడు. ఆ ప్రొద్దుట మాటల్లోనే వాళ్లింటికి వెళతానంటే వెళ్లమన్నాడు కూడాను. మరి? ఇంకే ప్రశ్న వెయ్యాల్లో కూడా తెలియటంలేదు.

'సినీమాకి వెళ్లాలనుకున్నాంగా" ఆగే అన్నాడు. ఆవిడ సమాధానం ఇవ్వకుండానే కుర్చీలో కూర్చుంది. బల్లమీద పువ్వులు వాడినట్టుగా మొఖం వేళ్ళాడేశాయి. ఏవిధంగా అనునయంచేసుకోవాలో సుందరి అవతారం నిర్ణయం అవకతికమక పడ్డాడు.

సుందరి చూచింది. మల్లె పువ్వులు పిలుస్తున్నట్లే ఆవిడికి తట్టింది. అసలు మల్లె పూలు అంటే తనకి మరంత ఇష్టం అనే రోజూ విడవకుండా తెస్తున్నారు? ఇప్పుడు ఈ స్థితిలో, ఈ దువ్వని కబరీ భారమును, అవన్నీ నుంచుని, ఎంత అన్యాయంగా మా జీవనాన్ని వ్యర్థపరచి, వ్యర్థశిలకు తీసుకు వెళుతున్నావు అన్నట్టే కన్పడ్డాయి. లోపల్లోపల రవులుకునే అగ్ని ఓసారే తిరగపడింది. "ఆ పొట్టిగా, కదుముట్టంగా, గుండ్రటి మొఖం, తేనెరంగుకళ్ళు, మధ్యపాపిడి.... ఉన్న లక్ష్మికి మల్లెలంటే, ఈ పొట్లాల చిరుతిండ్లు అంటే..." ఊహల్ని పోనిచ్చింది. దాంతో ఈర్ష్య రగులుకుంది. కోపం వచ్చింది. ఆ అలవాటులో నాకు కూడా...అనుకుంది" ఆ వూపులోనే "ఆ లక్ష్మితో వెళ్ళక పోయినారా!"

అంత త్వరలోనే, ఆ ముక్కలు రావడం రాజాకి ఉబ్బెత్తుగా మొఖం మీదకు గాలి వూదినట్టే అయ్యింది. అవగాహన ఒక్కసారే అల్లల్లా ఒచ్చే జోకొట్టేయి. నవ్వు...పొట్టపగిలేంతగా.. ఒచ్చింది. ఇదా ఈ భగవద్గీతకు వాఖ్య! అనుకున్నాడు.

'మీ స్నేహితురాలు, ప్రియురాలు, కథల్లో నాయకి...' ఈర్ష్య పడగలు విప్పినట్టుగానే అంది.

లోపలే నవ్వును ఆపుకున్నాడు. "సుందరీ! పట్టుకువెళదామనుకున్నాను కాని...ఆవిడ వూళ్ళో లేదు...అయినా ఆవిడ ప్రతి క్షణం లోనూ నాలోనే వుంది. అసలు ఆవిడ లేకపోతే, నేను కథలే వ్రాయలేకపోయేవాడిని. కలంలో జీవమే వచ్చి వుండేది కాదు. అల్లాంటి..."

సుందరి తెల్లబోయింది. తన భర్త ఆవిధంగా ఇంకో స్త్రీనిగురించి, మాట్లాడుతాడని అనుకోలేదు. పైగా ఆవిడని పూజించి, ఆరాధించేట్టుగా వర్ణించడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లే అవుతోంది.

"అల్లాంటి అమరమూర్తి, ప్రియురాలు, ప్రేయసి, హృదయేశ్వరి....ఇంకా...." కోపములో మాటలు తడబడ్డాయి సుందరికి.

ప్రణయమూర్తి, సౌందర్యరాశి...సుందరీ, ఆవిడని నువ్వు చూడలేదు కాని, ఆ కళ్ళల్లోకి చూస్తేనే చాలు-దేవత అంటావు. ఆ అందం, ఆ హొయలు, ఆ విశాలహృదయం..."

"ఓ మా గొప్ప విశాలహృదయం...సంసారాల్ని చెడగొట్టడానికా..."

"ఎవరిది చెడగొట్టింది?"

"ఎవరిదా? కన్పట్టం లేదూ? అంతగా ఆరాధించి, ప్రేమించేటట్లయితే పెళ్ళిచేసుకోకపోయినారా?...నన్ను...ఇల్లా వురి తగిలించి...ఏడ్పించడం ఎందుకూ?"

"నేనా? నిన్నా..."

"కాదా? సంసారానికి వచ్చినప్పటి నుండి చూస్తూనే వున్నా. మీకథలన్నీ ఆవిడను గురించేగా: ఆవిడ మిమ్మల్ని వెన్నెల్లో ఎల్లా ముద్దెట్టుకుందో? ఆవిడ ఎల్లా మీతో గడిపిందో ...ఆవిడ అందం, హొయలు, చందం, రీవి, డాబు, దర్పం—అన్నీ ఆవిడని గురించేగా..."

"అనుభవం వ్రాస్తే తప్పా?"

"ఆవిడతో అంత అనుభవం ఒచ్చినప్పుడు నేనెందుకూ?...నన్నెందుకు పెళ్లి చేసుకున్నారు...ఇల్లాంటి గుణంకల వారని తెలుస్తే..."

"విడాకు లిచ్చేదానివా? కాంపతీసి ప్రభుత్వం ఇంకా బిల్లుగా చెయ్యలేదు కాని, చేస్తిరా, నువ్వే ప్రారంభోత్సవం చేసేదానివిలా ఉన్నావే!"

"లక్ష్మిలాంటి మహామారులు, సంసారాల్ని తినేసే మిత్రులు వుంటే..." తడబడింది. కోపంతో శరీరం ఎరుపెక్కింది. రాజాని దొరికితే తినేద్దామన్నంత ఆవేశం కల్గుతోంది. పైగా అంతప్రశాంతంగా, డాబీగా, జవాబు చెప్పడం సుందర్ని వెర్రెత్తిస్తోంది.

"పొరపడ్డావు సుందరీ! అల్లాంటి దేవతలు ఇంకా ఈ లోకంలో ఉండబట్టే మంచి కథలు, కావ్యాలూ వ్రాసేరు. ఆవిడా...ఆ పొట్టిగా, కదుముట్టంగా, గుండ్రటి మొఖం, తేనెరంగు..."

సగంలోనే ఆ భావనలోని ఉద్వేగాన్ని, విసురుగా అందుకుంటూనే "కళ్ళు, మధ్యపాపిడి ఎర్రగా—చదవండి...నన్ను ఇల్లా పీల్చుకొని, దాన్ని ప్రేమిస్తూ, ఆరాధిస్తూ, ప్రతిక్షణం పూజిస్తూ...నాతో కాపురం ఎందుకూ...... దాన్నే తెచ్చుకుని..." రుద్ధం ఐపోయింది కంఠం.

"సుందరీ!...ప్రతీ క్షణంలోనూ ఎదురుగా, నన్ను వెంట వదలకుండానే ఉంది. ఓక్షణంలో నన్ను నవ్విస్తుంది. నామీద కోపగిస్తుంది. నా కోసం సౌందర్యార్చన చేస్తుంది. నా కిష్టం అని ఏవో చేసి పెడుతుంది....ఇల్లాంటి లక్ష్మి ని... సుందరీ! అనవసరంగా, అన్యాయంగా క్రూరంగా తిట్టి, దుమ్మెత్తి పోస్తున్నావ్.... అదిగో; ఎదురుగా నా లక్ష్మి ఎంతగా కుమిలి పోయి,దుఃఖిస్తోందో చూట్టంలేదూ? నాకుమాత్రం ఎంత బాధ కల్గ చేస్తున్నావో గ్రహించటం లేదా? ఆ ఎర్రటి మొఖం—కన్నీళ్ళతో ఎరుపెక్కి కబరీభారం చెదిరి, కుదుస్తుంటే, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎక్కువై మరుక్షణం ఎల్లా అలసిపోయిందో సుందరీ!..."

రాజా అంతజాలిగా ఎప్పుడూ [illegible] డని అనుకోలేదు. ఆవిడకే క్రొత్తగావుంది. కళ్ళకి ఎదురుగానుంచున్నట్టే...ఆ ముక్క విచిత్ర భావాన్ని రేకెత్తించేయి. అలమారకు ఉన్న అద్దంలో, ఈ అవతారంను ప్రతిబింబిస్తో[illegible] ఓసారి ఆ మసగకన్నుల్లోనే చూచింది.

'కన్నీళ్లతో ఎరుపెక్కి......కబరీ భా[illegible] చెదిరి...' స్పందనం హెచ్చయి, ఆతృత [illegible] తోంది.

"సుందరీ! అదిగో! నువ్వు చూట్టం [illegible] నీకు కన్పడటం లేదూ? ఎల్లా లక్ష్మి... లక్ష్మి...కుములుతోందో? బాధపడి [illegible] స్తోందో...ఆ దువ్వని తల, ఆ పొగకంపు చీర పమిటచెంగు మసి..."

సుందరికి ఆశ్చర్యం ఉరుకు లరికింది. [illegible] వేస్తోంది. ప్రతిబింబం మళ్ళీ అంటో[illegible] ముక్కల్నే...అన్నీ...తన...తన పోలికే...

తనా? ఈ ప్రశ్న ఎవర్ని వేసుకుని సమాధానం వస్తుందని ఎదురుచూస్తుంది? నమ్మరాని అనుమానం తకుతోంది? లక్ష్మి అనే ఆవిడని గురించి తాను విన్నదాయె. చూచిందికూడాను.

"ఇంకా చూడలేకపోతున్నావ్!"

ఆయన కళ్ల వైపు చూచింది. గో[illegible] తను కట్టినపటం అద్దంలో, తన నీడ పడుతోంది. దానిపైపే ఆయన కేంద్రత కూడా [illegible] ఏమిటో ఇదంతా విచిత్రంగానే వుండి పోతోంది.

"నా ప్రియురాలు, నా హృదయే[illegible] నా లక్ష్మి..." ఆ ఉద్రిక్తస్వత్వాలు [illegible] చేసి అల్లాడుతున్నై. ధైర్యం వెనక [illegible] దోబూచులాడి నిలదొక్కుకుంది.

"ఎక్కడండీ?"

"నా ఎదురుగానే..." ఓసారి కలయ చూచింది...

"కన్పడలేదూ...నా ఎదురుగా...[illegible] కూర్చుంది...నా గృహలక్ష్మి!"

సుందరి తెల్లబోయింది. గృ[illegible] నోట్లోనే కుక్కుకు పోయేయి మాటలు. "అవును సుందరీ! నా గృహలక్ష్మి! ఆవిడ[illegible] మిథ్యలో ఊహించి ప్రేమతో [illegible] ఈనాడు జీవం పొంది రూపెత్తిని [illegible] లక్ష్మికి అమరత్వం పొయ్యాలని [illegible] స్తున్నా...చిలిపిగా చూచేడు.

సుందరి "నాకా!" తెమలిలేని [illegible] ప్రపంచపు వాసనలు ఉక్కిరిబిరుస్తున్నాయి.


"అవును రాణీ! నువ్వే నాకు లక్ష్మి[illegible] ఇంతవరకు గృహంఅనేది నాకు లేదు. ఈనాడు వచ్చి నువ్వు గృహలక్ష్మివే అయ్యేవు. ఆ రోజుల్లో ఈ ఉంటుందన్న దాన్ని ఊహించి ఆరాధించిన ప్రియురాలే లక్ష్మి..."

"నిజంగా...మీరు ఎంత లోతు గుంటవారండి!" దగ్గరగా వస్తూనే అంది.

రాజా రేగిన తలపోసుల్ని దువ్వుతూ చెవులో "లక్ష్మి...సుందరి అయ్యింది" అన్నాడు. కులుకుతూనే నవోఢఅయ్యి బుగ్గకి నిమిరింది.

ఆతనూ నవ్వేడు.

ఆమె నవ్వింది.



పాఠశాల భవనము (ఒకవైపునుండి) ముందు కనబడుతున్న టెన్నిస్ కోర్టులో ఆట జరుగుచున్నది.

బ్రిటన్‌లో కొత్తరకం పాఠశాలలు

డార్సెటిషైర్‌లోని బ్రియన్‌స్టన్ పాఠశాల

పీటర్ లార్కోంబ్

పందొమ్మిదవ శతాబ్దకాలంనుండి అనుసరింపబడుచున్న పూర్వకాలపు విద్యావిధానానికి స్వస్తి చెప్పి, నూతన అభ్యుదయకర విధానాలద్వారా చిన్నపిల్లలకు విద్య గరపుటకు బ్రిటన్‌లో గత 80 సంవత్సరములనుండి ప్రయత్నములు, పరిశోధనలు ఎక్కువగా జరుగుచున్నవి. మొదట్లో కొంతకాలమువరకు, అనేక మార్న విధానములను విరివిగా ప్రయత్నించి, ఆ యనుభవముల నన్నింటిని క్రోడీకరించి, ఇప్పటి కొక క్రొత్తవిధానపు పాఠశాలను తయారుచేయ గల్గినారు. ఈ క్రొత్తవిధానపు పాఠశాలకు బ్రియాన్‌స్టన్, అచ్చిట్ హోం, ప్రెన్‌షాం హైట్స్ పాఠశాలలు చక్కని ఉదాహరణలు.

బ్రియాన్‌స్టన్ పాఠశాల 1928వ సం.లో స్థాపించబడి అప్పటి నుండి, పాఠశాలపాలకవర్గమువారు ఆశించిన విధముగా దినదినాభివృద్ధి జెందుచున్నది. ఈ పాఠశాల పాలకవర్గమునకు షాఫ్ట్స్‌బరీ ప్రభువు అధ్యక్షుడు. పూర్వకాలంనుంచి అనుసరింపబడుచున్న విద్యావిధానాలలో కొన్ని సంస్తవనీయ అంశాలు వున్నవను విషయం బ్రియాన్‌స్టన్ పాఠశాల పాలక వర్గము ఆమోదించినది; కాని క్రొత్తరకపు విద్యావిధానములలో కూడా కొంత మంచి లేకపోలేదని వారు గ్రహించినారు. అందువలన క్రొత్త పాత విధానములలోని మంచిని సమన్వయపరచి, ఒక విశిష్టవిధానమున తమ పాఠశాలను నడుపవలెనని వారు మొదటినుండి యోచించుచూ, ఆప్రకారమే తమ పాఠశాలను నడిపిరి. ఈ విధానముయొక్క సమంజసత, సమర్థత గత 20 సంవత్సరములలో ఈ పాఠశాల సాధించిన విజయము, గడించిన పలుకుబడి వల్ల రుజువగుచున్నది. ఈ పాఠశాల 23రు విద్యార్థులతోను, 7గురు ఉపాధ్యాయులతోను ప్రారంభమై, 1947 వ సం. లో 320 మంది విద్యార్థులతోను, 28 ఉపాధ్యాయులతోను నడచుచున్నది.



పాఠశాలవిద్యార్థులు క్రికెట్ ఆడుచున్న దృశ్యం.

విద్యార్థుల వ్యక్తిత్వము

విద్యార్థుల వ్యక్తిత్వమును గుర్తించి, ఆదరించుటయే బ్రియాన్‌స్టన్ పాఠశాల ప్రత్యేకత. పాఠశాల తరగతులలో విద్యాబోధ అధికశ్రద్ధతో జరుపబడుటయేగాక, ప్రతి విద్యార్థియు తన విశిష్టతను, తన సరదాను, తన అభిరుచిని వృద్ధిపరచుకొనుచు, అభివృద్ధిజెందుటకు వీలగునట్లుగా విద్యావిధానము, బోధనాక్రమము, పాఠశాల జీవితము ఏర్పాటుచేయబడినవి. ఈ విధముగా, పాఠశాల బయటనే విద్యార్థి అభివృద్ధిపరచుకొనవలసిన అతని సరదాలు పాఠశాలలోనే, అతని పాఠములలో నొకభాగముగానే భావించి, అభివృద్ధిపరచుకొనుటకు తగు ప్రోత్సాహమివ్వబడుచున్నది.

విద్యార్థివ్యక్తిత్వఅభివృద్ధికి బ్రియాన్‌స్టన్‌లో యివ్వబడుచున్న ఈ ప్రోత్సాహము వలన అతడు సంఘజీవితము మరచిపోవుటగాని, స్వార్థపరుడైపోవుటగాని తటసించగు సరికదా, ఒక వ్యక్తి తనతోటివారితో కలసివుంటే తప్ప అతని వ్యక్తిత్వమునకు తగిన వికాసము, ఆదరణ లభింపదనియు, అతడు, అతనితోటివారు మానవ సమాజములో ఒకభాగము మాత్రమే ననియు, సమాజజీవితమే ముఖ్యమనియు విద్యార్థులకు అనుక్షణము బోధింపబడి, వారా సత్యమును గ్రహించునట్లు చేయబడుచున్నదికూడాను.



మాస్టరు బోధిస్తున్న పాఠంవింటున్న విద్యార్థులు.


బ్రియాన్‌స్టన్ పాఠశాల, బ్రిటన్‌లో సుందరమైన భాగమగు డోర్‌సెట్ జిల్లాలో, బ్లాండ్‌ఫర్డ్ పట్టణానికి రెండుమైళ్ళ దూరంలోను, సముద్రతీరానికి దక్షిణంగా కొద్దిదూరంలోనే వున్నది. పాఠశాల సముద్రమట్టానికి 280 అడుగుల ఎత్తున, అనేకరకముల చెట్లతో నిండియున్న చిన్నకొండపై, 400 ఎకరాల ఆవరణలో వున్నది. ఈ ఆవరణలో అనేకరకాల వృక్షాలున్నా, కొంత ప్రాంతం చక్కటి పూపొదలు, పచ్చని గడ్డి ఒకదాని ప్రక్కన ఒకటి వుండి మనోజ్ఞంగా వుంటుంది. దీనిప్రక్కనే స్టౌర్ నదిపాయి ప్రవహిస్తూ, ఈ ప్రాంత రామణీయకతకు పరిపూర్ణత్వం లభింపజేస్తున్నది.

పాఠశాల ప్రధానభవనము ఇదివరకు వైకౌంట్ పోర్ట్‌మన్ నివసిస్తుండే గృహము. దీనిని నార్మన్ షా పానువేసి నిర్మించాడు. ఈ భవనం ఎర్ర ఇటుకతో నిర్మించి, ముందు ప్రక్కన చలువరాళ్ళు మనోజ్ఞముగా అమర్చినారు. భవన

అంతర్భాగముకూడా చాల భారీగానే ప్లాను వేశారు; ఒక్క వరండాయే 300 అడుగుల పొడుగున్నది. సర్ ఎడ్విన్ లూటిన్స్ ప్లాను చేసిన భోజనశాల ఒకటి 1930 వ సం. లో కట్టబడినది; దానికి తగిన వంటగది, పరికరములు కూడా అమర్చబడినవి. ఈ భవనము ప్రక్కన ప్రత్యేకగృహములలో, 80 మంచములు గల వైద్యశాల ఒకటి, పెద్ద కసరత్తు శాల ఒకటి వున్నవి. ఈ కసరత్తుశాలనే నాటకశాలగా కూడా అవుసరమైనప్పుడు ఉపయోగింతురు.

విద్యార్థులతో కలసి మెలసి...

ఈ పాఠశాలను ఒక్కసారైనను దర్శించిన వారు, పాఠశాలలో, తరగతులు జరుగుచున్నప్పుడు లేనప్పుడూ కూడా, విద్యార్థులు, ఉపాధ్యాయులూ కలసిమెలసి మైత్రితో మెలగటమును తప్పక శ్లాఘించి తీరెదరు. ఒక ఉపాధ్యాయుడు పాఠశాల దుకాణం వద్దగాని, వరండాలో గాని విద్యార్థులను కలుసుకున్నప్పుడు, మామూలుగా ఇతర ప్రదేశములలో మనము చూసే ఆ వైముఖ్యత, భిన్నత్వభావములు మనకు ఇక్కడ కనిపించనే కనిపించవు.




పాఠశాల ఆవరణలోనున్న దుకాణము. ఈ దుకాణంలో గుడ్డలు, ఆటవస్తువులు మొదలైన సామానులన్నీ దొరకును.

విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక సమానస్థాయిలో కలుసుకుని, తమ సమస్యలను, విషయములను ఉపాధ్యాయుడు విద్యార్థివలెగాక, తండ్రి కొడుకుల వలె చర్చించుకొని నిర్ణయాలు చేస్తారు. బ్రియాన్‌స్టన్ పాఠశాలలో దెబ్బల శిక్ష అనేది లేనే లేకపోవటమే దీనికి కొంతవరకు కారణమై యుండవచ్చును. బెత్తంతోగాని, చేతితోగాని కొడతారను భయం లేక పోవటం వలననే విద్యార్థులు ఈ ఉపాధ్యాయులతో అంత కలుపుగోలుతనం గాను, సరదాగాను మెలగగలుగుతున్నారు.

బోధనా విధానము

బ్రియాన్‌స్టన్ పాఠశాలలో బోధనాక్రమమంతయు, విద్యార్థి చొరవ చేసుకుని తనకు తానై నేర్చుకొనునట్లు, తన పఠన విషయములను తానే ఏర్పాటుచేసికొనగలునట్లు ప్రోత్సాహమిచ్చుటకు తగినట్లుగా ఏర్పరుపబడినది. పాఠశాలలో విద్యార్థి ఒక్కొక్క పై తరగతిలోనికి వెళ్లిన కొలది, బోధనా విధానములో క్రమక్రమముగా 'డేయాన్' విధానము వృద్ధియగుచుండును. విద్యార్థి తన కర్తవ్యమును నెరవేర్చుటకు (విద్య సక్రమముగా నభ్యసించుటకు) ఇతరులపై గాక, తనపైననే ఆధారపడియుండునట్లు చేయుటయే ఈవిధానము యొక్క ముఖ్యోద్దేశ్యము.

ఈ విధానము ప్రకారముగా ప్రతివారము అతని పాఠములు గాక మరికొన్ని ఇతర పుస్తకములను చదువవలసిన బాధ్యతకూడ అతనికి వప్పజెప్పి, తద్వారా విద్యార్థి తన కర్తవ్యము నెరవేర్చగలందులకు అవసరమగు శిక్షణ నిచ్చెదరు. ప్రతివిద్యార్థి ఒక్కొక్కవారము నకు ఒక్కొక్క విషయముపై ప్రత్యేకకృషి చేయవలెనని నిర్ణయము చేసి, అందుకు ఏయే పుస్తకములు చదువవలెనో, ఏ ఉపాధ్యాయుని ఆదేశము ప్రకారము చదువవలెనో తెలియజేసెదరు. చిన్నపిల్లలు ఈ విధముగా కొద్ది కాలముమాత్రమే గడిపెదరు కాని, వారు పెద్దవారైనకొలదీ ఈ విధముగా ప్రత్యేకముగా కృషిచేయవలసిన విషయములు, వాటికి ప్రత్యేకింపబడిన కాలము ఎక్కువగుచుండును.



విద్యార్థులచే తయారుచేయబడుచున్న బొమ్మలు.


అతడు నిర్వహించవలసిన ప్రత్యేకకృషిని గురించి విద్యార్థికి 'ఆజ్ఞ' యిచ్చునప్పుడే అతడేమి చేయవలసినదీ, ఏవిధముగా చేయవలసినదీ, ఏ ఏ పుస్తకములు చదువవలసినదీ వివరముగా తెలియజేయబడును. కాబట్టి ఒక్కొక విషయమునకు ఎంతకాలము వినియోగించవలసినదీ విద్యార్థికి ముందుగానే తెలియును కాబట్టి, తన కాలమును ఏవిధముగా ఉపయోగించవలెనో ముందుగానే నిర్ణయించుకొని, ఆ ప్రకారము నడచుటకు అతనికి అవకాశముండును. ఇందువలన విద్యార్థులు దూరదృష్టితో ఆలోచించుటకు, పెద్దపెద్ద పుస్తకములలోనుండి తమకు కావలసిన విషయములను నేర్పుగా సేకరించుటకు, తమకు కావలసిన వివరములు ఇతరత్రా సేకరించుటకు అలవాటుపడెదరు. పాఠశాలలో ఈ విధముగా శిక్షితులైన బాలురు తరువాత, తమ జీవితములో ప్రవేశించినప్పుడు, తమ విజ్ఞానమును, కాలమును తమ విధినిర్వహణకు తగినట్లుగా ఉపయోగించుకొనగలెదరు.

ఆటలు, చేతిపనులు

చేతిపనులు నేర్చుకొనుటలో ఉత్సాహమున్నవారికి అందుకు కావలసినంత అవకాశమేర్పరుపబడినది. నమూనాలు గీయుట, శిలావిగ్రహములు, రాతిచెక్కడములు, కుండలు, చెక్కపై నగిషీ, వివిధలోహముల ఉపయోగములు మొదలైన చేతిపనులు బ్రియాన్‌స్టన్‌లో నేర్పబడును. కుండలను కాల్చుటకు ఈ పాఠశాలలోనే ఒక 'ఆమ' కూడా వున్నది.

బ్రిటన్‌లోని ఇతర పాఠశాల లన్నిటిలో వలెనే బ్రియాన్‌స్టన్‌లో కూడ ఆటలకు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చెదరు. పడవ నడుపు పోటీలలో ఈ పాఠశాలదే ప్రథమ బహుమానము. ఈ పాఠశాల ఆవరణలోనే నది ప్రవహిస్తూండటంవలన ఇచ్చటి విద్యార్థులకు ఆ క్రీడ బాగా నేర్చుకొనుటకు అవకాశం వున్నది. వేసవిలో ఈ పాఠశాల జట్టు హెన్లీ-ఆన్-థేమ్స్‌వద్ద జరుగు పడవల పోటీపందెములలో

(21 వ పేజీ చూడుడు)



స్టౌర్ నది మైలున్నర పొడుగున ఈ పాఠశాలగుండా ప్రవహించుచున్నది. ఇక్కడనే విద్యార్థులు పడవ నడుపుట, ఈత, నేర్చుకుందురు.

బాలానందం

దానిమ్మగింజలు

నెథేనియల్ హాథార్న్

ఆ అందాల చిన్నారి పేరు మందార. వాళ్లమ్మ వనకాంత. వనకాంత పొలంపోతూ సాగరకన్యలతో ఆడుకుంటూ ఉండమని మందారతో చెప్పిపోయింది. దూరాన ఉన్న అడవి మాత్రం వెళ్లవద్దంది. మందార సరే అంది.

సాగరకన్యలు ముత్యాలు తెచ్చిచ్చారు. కెరటాలమీద ఊదుకుంటూ, ఇసకమీద నుంచున్న మందారమీద చల్లచల్లగా నీళ్లు చల్లారు. మందార నవ్వింది. ఆ ముసిముసి నవ్వును చూసి సాగరకన్యలు మందారతో అన్నారు; "మేం తెచ్చిన ముత్యాలకన్నా నీ నవ్వులే అందంగా ఉన్నాయి!" మందారతో సాగరకన్యలు ఎంతో సరదాగా ఆడుకుంటున్నారు.

మందారకి పువ్వులంటే చాలా ఇష్టం. సాగరకన్యలకి పూలదండ బహుమానంగా ఇద్దామనుకుంది మందార. సాగరకన్యలు మందారని "ఎక్కడికీ వెళ్లొద్దు; మాతో ఆడుతూ ఉంటే చాలు" అన్నారు. కాని మందార "నాలుగు పూలు కోసి ఇక్కడున్నట్టుగా వచ్చేస్తా"నని వెళ్లిపోయింది.

చెట్లని చుట్టుకున్న తీగె మీద సన్నజాజులు నవ్వుతున్నాయి. డొంకమీద అల్లుకున్న మాలతిపూలు తమ సువాసనలతో పిలుస్తున్నాయి. రకరకాల పూల తీగెలు ఒకటి తరువాత ఒకటి ఎంతో బాగున్నాయి.

మందార మెల్లిగా ముందుకు నడిచింది. ఎంత వెనక్కి పోదామనుకున్నా సంతృప్తి కలుగలేదు. అలా ఎంతదూరం పోయిందో!

అదుగో ఆ డొంక మీద అవేం పూలు! ఎంత పెద్దవో? వాటికి వంద రేకలయినా ఉంటాయి. ఒక్కొక్క రేక ఒక్కొక్క రంగు. ఎంత బాగుంది వాసన! ఈ పువ్వు చూసిందంటే అమ్మ నాకు వంద ముద్దులు పెడుతుంది.

మందార ఒక్క పరుగు తీసింది డొంక దగ్గరికి. మెల్లిగా ఒక పువ్వు కోసింది. సిళ్ళకుండంత ఉంది పువ్వు.

ఆ పువ్వు కోయగానే ఆ డొంకలో ఒక రంధ్రం కనిపించింది. అది మెల్లిగా పెద్దదయింది. భూమిలో సొరంగం మాదిరిగా యేర్పడింది. అందులోనుంచి రొద వినిపించింది. రొద హోరుగా మారింది. క్షణంలో మెరిసిపోతున్న రథం వచ్చింది. దానిని నాలుగు నల్లని గుఱ్ఱాలు లాగుతున్నాయి. ఆ రథంలో ఒక మహారాజు ఉన్నాడు. అతని పేరు దక్షిణనాథుడు. తటాలున మందారని తన రథం మీదికి యెక్కించుకుని కొరడా ఛెళ్లుమనిపించాడు. గుఱ్ఱాలు మహావేగంతో పరుగెడుతున్నాయి.

మందారకి ఆశ్చర్యం వేసింది. మందారకి భయమూ వేసింది. మందార కెవ్వున కేకపెట్టింది.

రథం మెరుపులా పోతోంది. క్షణంలో వనకాంత పక్కనించి పోయింది. మందార యొక్క కేక వనకాంతకి వినిపించింది. మందార తన తల్లిని చూచింది. కాని, ఇంతలోనే రథం ఆమడ దూరం వెళ్లిపోయింది.

కొంత దూరం పోయేసరికి సూర్యుడు కనబడడం మానేశాడు. అంతా చీకటిగా ఉంది. దక్షిణనాథుడి కిరీటంలోని మణులవల్ల చుట్టూ అంతా కాంతి ప్రసరిస్తోంది. కాని అది సూర్యుడి కాంతి కాదు. అది చంద్రుడి కాంతి కాదు. ఆ కాంతి చీకటిలాగా ఆవరించి భయపెడుతోంది.

దక్షిణనాథుడామెను తన లోకానికి తీసుకుపోతున్నాడు. అది భూలోకం కాదు. అక్కడికి యెండా వెన్నెలా చొరలేవు. దక్షిణనాథుడికి సూర్యకాంతి అన్నా, చంద్రకాంతి అన్నా కోపం. అతడు నల్లగా ఉంటాడు. అతడి లోకంగూడా నల్లగా ఉంటుంది. అక్కడి వస్తువులన్నీ మెరుస్తూ ఉంటాయి. కాని వాటిని చూస్తే భయం కలుగుతుంది.

రథం తిన్నగా ఒక పెద్ద కోట గుమ్మం దగ్గర నిలిచింది. అక్కడ ఒక పెద్ద కుక్క ఉంది. ఆ కుక్కకి మూడు తలలున్నాయి. ఆ కుక్క యెవరినైనా సరే తినివేస్తుంది.

"మందార, నా మీద దయ చూపించు. నువ్వు నన్ను పెళ్ళిచేసుకో. ఈ లోకాన్నంతా నేనే పాలిస్తూ ఉంటాను. ఈ లోకంలో ఉన్న అద్భుతాలన్నీ నీ యిష్టమొచ్చినట్లు ఉపయోగించుకుందువు గాని, ఆనందంగా మనం కాలంగడుపుకుందాం."

"రాజా, నువ్వు చాలా పొరపాటు చేశావు. మా అమ్మదగ్గరనుంచీ నన్ను దొంగిలించి బలవంతాన పట్టుకొచ్చావు. నిన్ను నేను పెళ్ళిచేసికోవడం ఎలా సాధ్యమవుతుంది?"

"అలా అనకు. నిన్ను కష్టపెట్టాలని లేదు నాకు. నీ కన్ని సౌకర్యాలూ చేకూరుస్తాను."

"నీవు మంచివాడివైతే, ఇంత భయంకరమైన కుక్కని ఇక్కడ ఎందుకు కాపలా పెట్టావు?"

"ఈ కుక్క నా ఆజ్ఞలేనిదే యెవరైనా బయటికి వెళ్ళినా, లోనికి ప్రవేశించినా చంపేస్తుంది. లేకపోతే చంపదు."

"నీవు మంచివాడివైతే, మళ్ళీ నన్ను మా అమ్మదగ్గిర దిగబెట్టు."

"నిన్ను నమ్మను. నీవు భూమిమీదికి వెడితే మళ్ళీ నాదగ్గరికి రావు."

దక్షిణనాథుడందరినీ పిలిచి పెద్ద విందు యేర్పాటుచేశాడు. లోకంలో ఎప్పుడూ యెవరూ కనీ వినీ యెరగని మధురపదార్థాలన్నీ చేయించాడు మందారకోసం. మంచి తేనెపానకం, చెరుకురసం, ఇంకా యెన్నో మందారకోసం మహాపాత్రలతో సిద్ధంచేశాడు. నిజానికిదంతా దక్షిణనాథుడు పన్నిన వల. అక్కడికొచ్చినవారెవరైనాసరే ఆ పదార్థాలలో కొంచెం రుచిచూస్తే, మళ్ళీ వెనక్కి వెళ్లలేరు.

కాని మందార నాలుక తడపలేదు. ఒక్క పదార్థాన్ని గూడా చేతితోనైనా ముట్టలేదు.

ఇలా ఆరు నెలలు గడిచాయి. దక్షిణనాథుడు మందారని బ్రతిమాలుతున్నాడు. అనేక రకాలుగా మభ్యపెడుతున్నాడు. కాని మందార పట్టు వదలలేదు. తన తల్లి వండినది తప్ప తిననంది. తన తల్లి తోటలోని పండును తప్ప ముట్టనంది.

దక్షిణనాథుడొక ఉపాయము ఆలోచించాడు.

* * *

ఈలోగా మందార తల్లి, వనకాంత ఏమైందో చూద్దాం.

వనకాంత పొలంనుంచి ఇంటికి వచ్చింది. మందార రాలేదు. ఇంకా సాగరకన్యలతో ఆడుతూనే ఉందేమోనని సముద్ర పొడ్డుకి పోయింది.

సాగరకన్యలు కెరటపు కొనమీద నుంచుని, తమ నేస్తం మందార వస్తోందేమోనని పారజూస్తున్నారు. ఎక్కడా కనపడటంలేదు. ఇంతలో వనకాంత వచ్చింది.

"ఏమత్తా కొంటెపిల్లలూ, మందార యేది? వేళాకోళానికి సముద్రమడుగున దాచేశారా?" అని అడిగింది.

సాగరకన్యలు తెల్లమొహం వేశారు. "అబ్బే లేదమ్మా, చాలాసేపైంది. పూలుకోసి తెచ్చి దండల్లుతానన్నదమ్మా; ఎందుకో ఇంకా రాలేదు" అన్నారు దిగులుపడుతూను.

వనకాంత వెతకడానికి బయలుదేరింది. ఎంత తిరిగినా ఏమీ అంతు దొరకలేదు. కనపడ్డవాళ్ళనల్లా అడిగింది. యెవరూ చెప్పలేక పోయారు. మందార కేక పెట్టడం జ్ఞాపకానికొచ్చింది. ఆ రథంమీద మందార యెందుకుంటుందా అనుకుంది అప్పుడు. ఇప్పుడు నిశ్చయంచేసుకుంది—మందారని యెవరో యెత్తుకుపోయారని.

తిన్నగా ఇంటికి పోయింది. ఇల్లు బావురుమంటూ దిగాలుగా కనిపించింది. తనదగ్గర మాయనాగులున్నారు. వాళ్లు యెక్కడికైనా చిటికెలో తీసుకుపోగలరు. ఎవరినైనా ఓడించగలరు. తనదగ్గర మాయరెక్కలున్నాయి. అవి కట్టుకుంటే ఏలోకానికైనా పోవచ్చు. కాని వాటిని ఉపయోగించలేదు. నాగుల్ని పిలవలేదు.

ఒక కాగడా వెలిగించుకుంది. అది యెప్పటికీ ఆరిపోదు. పగలూ రాత్రీ కూడా అలాగే వెలుగుతూ ఉంటుంది. అది పుచ్చుకుంది. ప్రతి మూలా వెతుకుతూ నడక సాగించింది. కాగడా వెలుగుతూనే ఉంది. తిండి లేదు. నిద్ర లేదు. అస్తమానం అలాగే వెతుకుతోంది—

పోగా పోగా ఆ దుబ్బు కనపడింది. ఆ పువ్వును చూచింది. "ఇదే నా మందారని మోసగించి ఉంటుంది" అనుకుంది. అయితే మందార ఎక్కడ కనుపిస్తుంది? అలాగే నడుస్తూ నడుస్తూ ఒక గుహదగ్గరికి చేరింది. ఆ గుహలో ఒక ముసలమ్మ ఉంది. ఆ ముసలమ్మ యెప్పుడూ విచారంగా ఉంటుంది. సంతోషంగా ఉన్నవాళ్లని చూస్తే ఆ ముసలమ్మకి గిట్టదు.

"ఏం, ముసలమ్మా, నా పిల్లని చూశావా?" అని అడిగింది ముసలమ్మని వనకాంత.

"నీ పిల్లా? ఔను. ఎవరో ఏడుదు కేకపెట్టడం విన్నాను. ఆ అమ్మాయి చాలా అందకత్తెకదూ. కాని ఆశ వదులుకో. ఆ పిల్ల కనబడడం అసంభవం. నువ్వుకూడా అంత విచారంగా ఉన్నావు కనక నాతోపాటు ఇక్కడే ఉండిపో" అంది ముసలమ్మ.

"కూతురు పోవడం అంటే ఎంత దుఃఖం కలుగుతుందో నీ కేం తెలుసు? నాకు సహాయం చెయ్యలేవా ముసలమ్మా?" అంది వనకాంత దీనంగా.

"నేనేం చెప్పగలను! నువ్వే ఆలోచించుకో. నాకు తోడుగా ఉంటావేమో అనుకొన్నాను" అంది.

వనకాంతకొకటి జ్ఞాపకం వచ్చింది. అక్కడెక్కడో గొల్ల గోపయ్య ఉన్నాడు. అతనికి తెలియనిది ఉండదు. అతని దగ్గరికి బయలుదేరింది.

గొల్లగోపయ్య పిల్లంగోడు ఊదుతూ కవిత్వం పాడుతున్నాడు. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాడు గోపయ్య.

"గోపయ్యా, నా కూతురు మందారని యెవరో యెత్తుకుపోయారు. దయచేసి ఎక్కడుందో చెప్పవూ?" అని అడిగింది వనకాంత.

గోపయ్య నవ్వుతూ "నీ కూతురు సుఖంగా ఉంది, భయపడకు" అన్నాడు.

"ఓదార్పు మాటలు చెప్పకు గోపయ్యా. నా కూతురు యెట్లా సౌఖ్యంగా ఉంటుంది? నేను లేనిదే క్షణం నిలవగలదా?" అని వాపోయింది వనకాంత.

"దక్షిణనాథుడు నీ కూతుర్ని తీసుకెళ్ళాడు. ఆమెకు సకలైశ్వర్యాలూ ఉన్నాయి. నీకు దిగు లెందుకు?" అన్నాడు.

"ఆమెకెన్ని ఐశ్వర్యా లున్నా నిద్రాహారా లుండవు. నన్ను నా మందారదగ్గరికి తీసుకెళ్లు గోపయ్యా!" అని బతిమాలింది వనకాంత.

"అబ్బే, దక్షిణనాథుడికి నామీద కోపం. నే నక్కడికి వెడితే ఆ కుక్క నన్ను తినేస్తుంది...కొంచెంసేపు ఆగుతావా? నీ కూతురు కథని ఆశు కవిత్వంగా పాడతాను" అన్నాడు గోపయ్య.

"సరేలే నేను వెళ్లిపోతున్నాను. ఇదుగో ఇదేనా శాపం. ఈ భూమి మీద మళ్లీ నా కూతురుకన పడిందాక వానచినుకు పడదు. మొక్క మొలవదు!" అని కాగడా తీసుకొని వెళ్ళిపోయింది.

ఓ రాజుగారి ఊరు చేరింది. ఆ రాజుగారి పిల్లాడు పళ్లపోటుతో బాధపడుతున్నాడు. రాణీ వనకాంతని పిలిచి తనబిడ్డని బ్రతికించమంది. వనకాంత సరేనంది. బిడ్డని పూర్తిగా తన స్వాధీనం చేసుకుంది. కొన్నాళ్లయేసరికి, అనాకారిగా ఉన్న బాలుడు దబ్బపండులా ఆరోగ్యవంతు డయ్యాడు. "పిల్లవాడిని యెట్లా పోషించావమ్మ!" అని ఆశ్చర్య పోయారు అందరూ. రాణీ ఈ కిటుకు చెప్పవలసిందని కోరింది వనకాంతని. "నేను బిడ్డతల్లిని గనక బిడ్డ నెట్లా పోషించాలో నాకు తెలుసు" అని ఊరుకుంది వనకాంత. ఒక రోజున రాణి తలుపుచాటున నుండి, బిడ్డని వనకాంత యేం చేస్తోం దో అని చూస్తోంది. బిడ్డకి చక్కగా స్నానం చేయించి, ఒళ్లు తుడిచి, సాంబ్రాణి వల్లిన చింతనిప్పులమీద బిడ్డని పడుకో పెట్టింది. రాణి కంగారుపడి, తలుపు తీసుకుని వచ్చి బిడ్డని తీసేసి గొల్లున ఏడ్చ పెట్టింది. బిడ్డ ఏడవటం మొదలు పెట్టాడు. వనకాంత కోపంగా చూచి అంది: "నీ బిడ్డకి చేతులారా చావు తెచ్చి పెట్టావు. అతడిని చావులేని వాడిని చేద్దా మనుకున్నాను. ఇతడికి జబ్బులు రావుగాని, నీవు చేసిన తప్పవల్ల ఈ బిడ్డ అందరిలాగే ముసలివాడై చివరికి చనిపోతాడు" అని మళ్ళీ తన బిడ్డని వెతుక్కుంటూ కాగడా తీసుకొని బయలుదేరింది.

వెళ్లగావెళ్లగా, ఒక గుట్టమీద గరుత్మంతుడు నుంచుని ఉన్నాడు. వనకాంత అతనిదగ్గరకి వెళ్లింది. "గరుత్మంతుడా, నాకూతురుని దక్షిణనాథు డెత్తుకుపోయాడు, నా మందారని నా దగ్గరకి తీసుకురావూ?" అంది.

ఒకసారి గరుత్మంతుడు రెక్కలు విదిలించుకున్నాడు. చిటికెలో దక్షిణనాథుడిలోకానికి చేరాడు. గుమ్మం దగ్గర కుక్క ఉంది. కుక్కకు అందకుండా యెగిరి లోపలికి పోయాడు.

మందారకోసం భూలోకంనుంచి తల్లి తీసుకురమ్మని ఒక దూతని పంపాడు. అప్పుడే దూత తిరిగి వచ్చాడు. భూలోకంలో వాన లేదు. చెట్లెండిపోయాయి. పళ్లేవీ లేవు. ఎండిపోయిన ఒక దానిమ్మకాయ దొరికిం దంతే. అది తీసుకుని వచ్చాడు దూత.

ఆ దానిమ్మకాయ మందార కిచ్చారు. మందారకి ఆకలేసిపోతోంది. ఆగలేక పోతోంది. దానిమ్మగింజలు ఎండిపోయాయి; రసం లేదు. క్షణ మాగితే ఉన్నదికూడా యెండిపోతుంది. చటుక్కున కాసిని గింజలు నోట్లో వేసుకుంది.

అప్పుడే గరుత్మంతుడూ, దక్షిణనాథుడూ ప్రవేశించారు.

"ఇంతేనా మందారా? నామీద దయలేదా? నీసంతోషంకోసం నేనెంతో ప్రయత్నిస్తున్నాను. నీ వుంటే ఈ చీకటిలోకంలో నాకు కాస్త శాంతిగా ఉంటుంది. ఎంత బ్రతిమాలుకున్నా నీవు కరగటం లేదు"

"రాజా, నన్ను నా తల్లిదగ్గరికి పంపితే, నేనే నీదయకు కృతజ్ఞురాలినై, మళ్లీ నీదగ్గరికి వచ్చేదాన్నేమో. నన్ను ఖైదీగా ఉంచితే నే నేం చేయగలను?" అంది మందార.

"ఔను. పొరపాటే చేశాను. నిన్ను తీసుకు రావటంమూలాన భూలోకానికంతటికీ కీడు కలిగిందట. వాన చుక్క లేదట. మొక్క మొలవటం లేదట. నిన్ను తీసుకురమ్మని ఈ గరుత్మంతుణ్ణి పంపింది మీ అమ్మ. మీ యింటికి వెళ్లు. దయ ఉంటే రా" అన్నాడు దక్షిణనాథుడు. మందార దానిమ్మగింజలు నోట బెట్టిందని యెరగడు దక్షిణనాథుడు.

తల్లి వనకాంత ఇల్లు చేరింది. ఇల్లు పాతబడిపోయింది. గుమ్మం మెట్లమీద కూచుంది. ఇంతలో కాగడా ఆరిపోయింది. మెల్లిగా గడ్డి మొలవడం ఆరంభించింది. వనకాంత కంగారుపడింది. కొద్దిరోజుల్లోనే ముసలిదానిలా బలహీన మైపోయింది. తన కూతురు కనపడకుండానే కాగడా ఆరిపోవడం వల్ల కూతురు రాదేమోనని భయపడింది.

ఇంతలో గరుత్మంతుడూ, మందారా చక్కా వచ్చారు. మందార తల్లిఒళ్లోకి పరిగెత్తింది. వనకాంత కన్నీటితో మందారతల తడిపింది. ఆనందం పట్టలేక యిద్దరికీ నోట మాట రాలేదు. కన్నీళ్లుమాత్రం జలజలా రాలాయి. కన్నీళ్లన్నీ ముత్యాలుగా మారాయి.

"మందారా, నామందారా, అసలు జరిగిందేమిటమ్మా?" అంది వనకాంత.

"చెప్తున్నా వినవమ్మా. నేను ఆరు నెలలుమాత్రమే నీదగ్గర ఉండగలను. తరవాత మళ్లీ దక్షిణనాథుడిదగ్గరికి వెళ్లిపోవాలి" అంది మందార.

"అదేమమ్మా? ఆ చీకటిలోకంలో ఉండలేవు, తల్లీ!"


"కాదమ్మా, అత డిచ్చిన దానిమ్మ గింజలు ఆరింటిని మింగానమ్మా. అందుచేత ఆరు నెలలు అతనిదగ్గిర ఉండకతప్పదు. మిగతా ఆరునెలలు నీదగ్గర ఉంటాను"

"అయ్యో! బిడ్డా, నీకు సుఖం లేదమ్మా"

"కాదమ్మా. దక్షిణనాథు డెప్పుడూ విచారంగానే ఉంటాడు. అతడిని

(అనువాదం)

సూరంపూడి భాస్కరరావు,



ఆస్ట్రేలియాలోని పెర్తులోగల అబర్దీన్ ఆంగస్ పశు (వృద్ధి) సంఘంవారు జరిపిన వార్షిక పశుప్రదర్శనాలు. 99,400 రూపాయలకు అమ్ముడుపోయిన వృషభం

పిల్లల నవల:



పరిచయం

అయిందా మరి! కథ కంచికీ, మనం యింటికీ వచ్చేశాం. ఈ కథ విన్నవారికీ, కన్నవారికి చదివినవారికి వ్రాసిన వారికి పుణ్యం, పురుషార్థం, ఆయురారోగ్యైశ్వర్యాలు, కోరిన వరాలు ఇవన్నీ లభిస్తాయని మాత్రం నేను చెప్పలేను. ఏ పురాణంలోనూ చెప్పలేదు కూడాను.

ఈ కథ వ్రాసిన ఆసామీని గురించి రెండు ముక్కలు చెబుతాను.

ఈ కథ వ్రాసిన పెద్దమనిషి 'కొల్లోడీ' అనే ఇటాలియన్ రచయిత. ముందు సరదాకిఒక చిన్న కథ వ్రాసి. పినాకయ్యని వర్ణించి తమాషాగా—ఆ సంతోషపెట్టడంలోనే నా సంతోషమూ కూడా ఉందమ్మా" అంది మందార. కథ పత్రికకి పంపించాడు. ఆ కథ చదివిన పిల్లలూ, పెద్దలూ ఎంతో బాగుందని మెచ్చుకొని ఎన్నో ఉత్తరాలు పత్రికఅధికారికి పంపారట. తిరిగి పత్రిక అధికారి మనకథకు ఇన్ని యింకా వ్రాయ మన్నాడట. మనవాడు వ్రాశాడు. అతడు కథ వ్రాస్తూ ఉండటం. వారం వారం పత్రిక ప్రకటించడం-పిల్లలూ పెద్దలూ చదివి ఆనందించడం యిలా జరిగింది. తరవాత పుస్తకం రూపంగాకూడ యిది వెలువడింది. దరిమిలాను మొత్తం అరవై భాషల్లోకి తర్జుమా అయింది యీ కథ. బెంగాలీలోనూ, గుజరాతీలోనూ, హిందీలోనూ తర్జుమా అయింది. జపాను, చైనా, గుటమేలా భాషల్లోకూడ అనువాదాలు రావడం విశేషం. ఈ కథలోని పట్టు కనిపెట్టి కార్టూన్ చిత్రాలు తీసే వాల్టుడిస్నీ దానిని వెండితెరమీదికి ఎక్కించాడు. ఇంతకథ కళ్ళకుకట్టినట్లు చూపాడు. దానితో మరీ ప్రచారం కలిగింది.

ఈ 'పినాకియో' అనే పినాకరావు ఇపుడు తెలుగుపిల్లలకీ, పెద్దలకీ బాగా పరిచయం అయ్యా డనుకుంటాను. పిల్లలు తెలుసుకోవలసిన మంచిచెడ్డలు, ఒక అల్లరిపిల్లవాడి అనుభవాల రూపంగా, చమత్కారంతో సున్నితంగా హాస్యరసంతో మేళవించి చెప్పడం యీ కథలో విశేషం. ఇది సాధ్యమైనంత వరకు అనువాదంలో పొల్లు పోకుండా తేగల్గితే నాపని నెరవేరినట్టే. అది యెంతవరకు నచ్చిందో చదివిన మీరంతా చెప్పాలి.

వీలైతే పుస్తకరూపంలో 'పినాకరావును' పరిచయం చేద్దా మని సంకల్పం. ఆ సంకల్పానికి అంతా తోడ్పాటు ఉంటుందనే ధైర్యం ఉందనుకోండి. ఇప్పటికి......

మరి సెలవు

సత్యనారాయణ శ్రీవాత్సవ.

గాజు పరిశ్రమ 4:

గాజు కర్మాగారాలు

శ్రీ వి. కృష్ణమూర్తి

గాజును కరిగించడానికి ముడిపదార్థాలను- నిర్ధారింపబడిన నిష్పత్తులలో బాగా కలపాలి. కొద్ది కొద్దిగా తయారయ్యే కర్మాగారాలలో ఈ సమగ్రీకరణం చేతి పారలతోనూ, సెలగపారలతోనూ జరుగుతూ ఉంటుంది. పెద్దపెద్ద కర్మాగారాలైతే దీనికి వేరే వేరే యంత్రాలుంటాయి. ముడిసరుకులన్నీ సమానంగా చిన్న ముక్కలుగా పొడిచేసే యంత్రాలు, తూకం ప్రకారం నిర్ధారించబడ్డ నిష్పత్తిలో బాగా కలిపే యంత్రాలు ఉన్నాయి. ముడిదినుసుల సేకరణ, శుభ్రపఱచుట గురించి ముందుముందు చూస్తాం.

ఈ ముడిదినుసులను కరగడానికి పూర్వకాలంనుంచీ అనుశ్రుతంగా వచ్చుచున్న విధానం యేమిటంటే, ఈ ముడిదినుసులన్నిటినీ సుచ్చేత్తి ఒక కుండలో పోసి కుండను ఒక బట్టీలో(Furnace) పెట్టితే కొంత-వ్యవధిలో కొన్నిగంటలనుంచి. కొన్నిరోజుల్లో ఆకుండలో కరిగినగాజు ఉంటుంది. నేటి గాజు కర్మాగారాలలో ఎనిమిది కుండలు ఉండే బట్టీలు సామాన్యంగా చూస్తూ వుంటాయి. కొన్ని పన్నెండుకుండలను బెట్టే బట్టీలు గూడా వుంటాయి. గాజు కరగడానికి కుండలను వాడటమేగాక, కొన్నికర్మాగారాలలో ఇంకోవిధం ఆచారంగా వుంది. పెద్దతొట్టిలో ముడిపదార్థాలను వేస్తారు. ఆ ముడిపదార్థాల పైభాగంలో మంటలు ప్రసరిస్తే ఆ వేడికి కరిగిన గాజు తయారౌతుంది. వీటిని అగ్నిష్టకుండాలు అంటారు.

గాజుకుండలు యీ రోజుల్లో అన్నిదేశాలలోనూ సామాన్యంగా షుమారుగా ఒకే ప్రమాణానికి తయారుచేస్తూ వుంటారు. మామూలు గాజుకుండలలో ఒకసారికి ఎలమిదివందల పౌనులు,ఇరవై మణుగుల గాజును తయారుచేయడానికి సరిపోయే పరిమాణం వుంటుంది. అంతకు పెద్దది వాడరు. ఎక్కువగిరాకీలేని గాజు అయితే చిన్నకుండలను వాడుతారు. సాధారణంగా అయిదు, పది టన్నులగాజు ఒకేరకం అయిన గాజు-ఒక్కసారిగా కరిగేటప్పుడు అగ్నిష్ట కుండములలో కరుగుతారు.

అగ్నిష్టకుండములుగాని శిలాంగారవాయువు (Coal - gas) గాని వాడుకలో లేని రోజుల్లో బొగ్గును-రాతిసిబొగ్గును వాడి కుండలలో గాజును కరిగించేవారు.

ఈ కుండలను సాధారణంగా ఏ కర్మాగారాలలోనైనా అనుభవజ్ఞుడైన కుమ్మరిని నియోగించి చేయించుకొందురు. మనదేశంలోనైనా యీమధ్య ఎవరికి కావలసిన గాజుకుండలు వారి కర్మాగారాలలోనే తయారుచేసుకుంటున్నారు. మనకు సామాన్యముగా గృహావసరములకు చేయు కుండలకై కుమ్మరి చాల శ్రమపడి మంచి మట్టిని ఏరుచున్నాడు.మట్టిలో ఎంత జిగురు వుండవలెనో, ఎంత సచ్ఛిద్రత (Porosity) యుండవలెనో అనుభవముమీద మృణ్మయకారకులే నిర్ణయింతురు. శాస్త్రజ్ఞులు చేసిన కృషివలన ప్రయాసయేగాని యిదమిత్థమని తేల్చగలిగినంత నిదర్శనములు దొరుకుటలేదు.

గాజుకుండలను చేయు మట్టిని ఎన్నిన తర్వాత దానిని పక్వమగునట్లు చేయుటకు ఆరునెలలు పట్టును. ఆ మట్టిని మూరెడెత్తున విశాలముగా పఱచి ఎండ కెండనియ్యవలెను. అది కొద్దిరోజుల్లో బాగా ఎండి, పగిలి, బీటలువారును. అప్పుడు మళ్ళీ దానిమీద నీరు చల్లుదురు. మట్టిలో కావలసినంత జిగురు లేనిచో యీ నీళ్ళలో కొద్దిగా సోడా—వెయ్యింట మూడు నాల్గుపాళ్లు కలిపి చల్లుదురు. కొందరు. సోడియం సిలికేట్‌ను గూడా అంతమాత్రం కలిపి చల్లుదురు. ఈవిధంగా నీరు పీల్చుకోటం, ఎండి ఆ నీరంతా ఆవిరికి వదిలివెయ్యడం ఎనిమిదిసార్లకు తక్కువ కాకుండా పదిపదిహేనుసార్లవరకు చేస్తారు. ఇలా చేస్తే మట్టి పక్వమవుతుంది. మధ్యమధ్య యీ మట్టిని తొక్కుతూవుంటారు కాళ్ళతో అదీగాక, పారలతోటీ, సెలగపారలతోటీ తిరగదోస్తూ వుంటారు. కొన్నిచోట్ల గొడ్లచేత తొక్కిస్తూ వుంటారు. పూర్తిగా పరిపక్వమైందో లేదో చూడడానికి అనుభవజ్ఞులు బూట్సులూ, చెప్పులూ లేకుండా ఉత్తకాళ్లతో తొక్కి చూస్తారు. వాళ్ళ కాళ్ళకు తెలుస్తుంది. ఇంకోవిధంగా కొందరు మట్టి పక్వాన్ని పరీక్షిస్తారు. ఒక సెలగపాఱతో తడిమట్టిని ఎత్తి విసురుగా ఒక పలకమీద లాగి కొత్తే ఆ మట్టికి ఏ ఆకారం వస్తుందో చూస్తారు. పూర్తిగా గుండ్రనిగా వుంటే సమానమైన పరిపక్వత వచ్చిందన్నమాట. కోడిగుడ్డు ఆకారంగాని, వృత్తాయతముగాని, త్రిపాభిచక్రముగాని,మరియే యితర వికార ఆకారముగాని అయితే వాడడానికి తగినంత పక్వం పొందలేదన్నమాట.

మామూలుగా కుమ్మరి చేసిన కుండలను చాలామంది నీళ్ళు పోసుకోనేందుకో, ఊరగాయలకో వాడుతారు. వాటిలో వంట చేసుకునే వారు, కుండ అడుగువైపున ఎర్రమన్ను పులిమి పొయ్యిమీద పెట్టుతారు. కుమ్మరి కాల్చిన కొలిమిలో సుమారు మూడువందల డిగ్రీల ఉష్ణం వుంటుంది. కాని గాజుకుండలకు ఇంకా తీవ్రపరీక్ష ఉంటుంది. ఆ కుండలో పల తొమ్మిదివందలడిగ్రీలనుంచి పదిహేడుపద్దెనిమిది, వందల డిగ్రీలవరకు ఉష్ణం వుంటుంది. అంటే కుండబైట పరిసరాలలో అంతకన్న నూటయాభై, రెండువందల డిగ్రీలవరకూ ఎక్కువ ఉష్ణత వుంటుంది. ఇంత వేడికి తాళే శక్తి ఆ గాజుకుండలకు వుండాలి. ఇందుకొరకే చాలా ఉత్తమమైన మట్టినే వాడాలి. ఒకసారి కాల్చిన గాజుకుండలపొడిని మట్టితో ముందు కలిపితే ఈ శక్తి వృద్ధిపొందుతుంది అంటారు.


సాధారణంగా చేయబడే కుండఆకారం క్రింద బొమ్మలో చూడవచ్చును.

గాజుకుండ బొమ్మ

ఈ గాజుకుండ ఒక గాదెలాగో, ఒక గడ్డిమేటులాగుగాని వుంటుంది. దాని అడుగుభాగం గుండ్రంగా వుంటుంది. ఎత్తు స్తంభాకారంగా వున్నభాగం వ్యాసం ఎంత వుందో అంత వుంటుంది. ఆ పైడిప్ప భుజంపైన అర్ధగోళాకారంగా వుంటుంది. ఆపైన ముడిదినుసులను వేసేటందుకు ఒక "నోరు" వుంటుంది. సాధారణంగా వ్యాసం ఆరడుగులున్నూ భుజంవరకూ ఆరడుగులున్నూ, ఆపైన మూడడుగుల అర్ధగోళం వుంటుంది. ఈ కుండ అడుగుభాగం ఆరంగుళాల మందం వుంటుంది. పక్కలనూ, పైననూ ఐదంగుళాల మందం వుంటుంది. కుండవ్యాసం తగ్గిస్తే తక్కిన కొలతలుగూడా అదే నిష్పత్తిలో తగ్గిస్తారు. కుండ తయారైనతర్వాత నాలుగు రోజులపాటు ఒక బట్టీ వుంచుతారు. ఆ బట్టీలో సాధారణంగా యీ కుండ వాడకంలో వుండవలసినంత ఉష్ణత వుంటుంది. ఎంత ఎక్కువ వేడికి కారిస్తే అంత మంచిది. అల్లా శ్రద్ధగా చేసిన గాజుకుండలు 90-100 రోజులు వాడవచ్చును.

గాజు కర్మాగారాలలో కుండలలో కరిగించడమూ, తొట్లలో కరిగించడమూ అన్నవిషయం చాలా ముఖ్యమైనది. రకరకాల గాజు చేసేవారు కుండలలో చేస్తూ వుంటారు. ఎక్కువ మొత్తంగా ఒకేసారి కరిగించడంగాని విరామం లేకుండా రాత్రిళ్ళు కరిగిస్తూ పగలు వాడుతూ మళ్ళీ-ఇట్లాగే ఒకచెంప కరిగిస్తూవుంటే ఒక చెంప దానిని వాడుతూవుండే సంస్థలలోనూ, తొట్లలో కరుగుతూ వుంటారు. తొట్లలో కరిగించేటప్పుడు అసామాన్యమైన శ్రద్ధ తీసుకోకపోతే గాజుయొక్క పారిశుభ్రతకు హాని యివ్వడం కష్టం. కుండలలోపల అనుకున్నంత వేడి కల్గించడానికి కుండలబైట వుండాల్సినంత ఉష్ణత తొట్టికి వుండనక్కరలేదు. ఎందుకంటే- కరుగుతూ వున్న గాజు సామానులు మంటలతో స్పర్శత వుంటుంది గనుక. తొట్లలో తయారైన గాజును సాధారణంగా అక్కడే వాడుతూ వుంటారు. కుండలను ట్రాలీలలో ఎక్కించి కొంతదూరం తీసుకు పోతూ వుంటారు.

మన దేశంలో సామాన్యంగా కర్మాగారాలలో వాడుకలో నున్న అగ్నిష్టను జపానీస్ ఫర్నేస్ అంటారు. ఇందులో జపాను వారిపేరు రావడానికి తగినన్ని కారణాలు లేవు.



ఒలింపిక్ పోటీలలో పాల్గొనే వారికై రిచ్మండ్ పార్కులో నిర్మించిన వసతి గృహములు 1,700 మందికి నివాసయోగ్యంగా ఉన్నవి.

ఇందులో ఎనిమిదికుండలను పెట్టే వీలు వుంది. అన్నిటికీ మధ్యనున్న గుండంక్రింద రాతిసిబొగ్గు ఉంటుంది. మంటలు పైకి వస్తాయి. ఈ కుండలు పెట్టే అగ్నిష్టల్లో ముందుభాగంలో వున్న ఇటికలను పడగొట్టి కుండనుపెట్టి మళ్ళీ తొందరగా కట్టివేస్తారు. అట్లాగే కుండలను తీసేసేటప్పుడు మళ్ళీ ముందుభాగం పడగొట్టి కుండను తీయాలి. ఈ పని అంతా మంటలు భగభగ మండుతూ పదిహేనువందల డిగ్రీల ఉష్ణతలో చేయాలి. తలుపులుపెట్టితే వేడి పోతుందని పెట్టరు. మంటలు ఇరవైఅడుగుల పొడుగుకు తక్కువ వుండవు. చిమ్నీ సరిగా పనిచేస్తూ మంచిరకం రాతిసిబొగ్గు వాడితే ఇంకా పొడుగాటి నాలుకలు చాచుతూ పరుగెడుతాయి మంటలు.

బొగ్గు వాడకంకన్న శిలాంగారవాయువు (coal-gas) వాడడం చాలా పొదుపుగా వుంటుంది. శిలాంగారవాయువును అగ్నిష్టలోనికి పంపేముందు వేయిడిగ్రీల వుష్ణందాకా వెచ్చజేసి పంపితే రెండువేలడిగ్రీలలో మంటలు పుట్టుతాయి. అంటే పదిహేడు పద్దెనిమిది వందల డిగ్రీల వుష్ణత అగ్నిష్టి అంతా వుంటుంది.


ఇంత వేడిగల వాయువులు వాటి శక్తి నిచ్చి చిమ్నీకి వెళ్ళుతున్నప్పుడు చాలా ఉష్ణశక్తిని యింకా కలిగి వుంటాయి. కాని గాజు కరగడానికి ఈ వేడి చాలదు. యీ వేడిని ఉపయోగించి అగ్నిష్టలోనికి వెళ్లు శిలాంగార వాయువును గాలిని వెచ్చజేయవచ్చును. రిక్యుపరేటివ్ ఫర్నేసులలో వాడే ఇటుకల లోపల దారులుంటాయి. ఒకవరస నిలువు దారులూ, ఒక వరుస అడ్డుదారులు. అగ్నిష్ట కట్టేటప్పుడు ప్రక్కన రిక్యుపరేటివ్ టవర్సు స్తంభాలు కట్టుతారు. అడ్డుదారుల్లోంచి గాలి ఒక వరుస, శిలాంగార వాయువు ఒక వరుస వస్తూంటే, నిలువు దారుల్లోంచి వేడి ఇంకా వున్న అగ్నిష్టవాయువులు నడుస్తూవుంటాయి. చిమ్నీ పీల్చువలన తొందర తొందరగా ఇవన్నీ వాటంతట అవే పరుగెడుతాయి. సన్నని - సుమారు అరంగుళం మందం ఇటిక మాత్రమే అడ్డు కాబట్టి ఆ వేడి అంతా నూతన వాయువులకు లభిస్తుంది. ఇందుకు వాడబడే యిటుకలు చాలా జాగ్రతగా తయారుచేయబడి యుండాలి. లేకపోతే నూతన వాయువులునూ, అగ్నిష్టవాయువులూ కలుస్తూ వుంటే చాలా ప్రమాదం జరుగుతుంది. అనుకున్నంత వేడి అగ్నిష్టలో పుట్టదు.

రీజెనరేటివ్ ఫర్నేస్ ఇంకో రకం. నాలుగు టవర్లు కడతారు. రెండు టవర్లలోంచి నూతన వాయువులు లోపలికిపోతే, తక్కిన రెంటిలోంచి అగ్నిష్టవాయువులు తిరిగి వచ్చేస్తూ వుంటాయి. ఒక అరగంట అయినాక ఒక వాల్వు-మీట తలుపు-తిప్పితే మొదటి రెండు టవర్లలోంచి అగ్నిష్టవాయువులు దిగుతూవుంటే తక్కిన రెండింటిలోంచి నూతన వాయువులు ఎక్కుతూ వుంటాయి. ఈ టవర్లు పేర్చి కట్టబడినవి. ఇటుకముక్కలు పెంకుముక్కలూ వుంటాయి. ఇవి అగ్నిష్టవాయువుల వేడి తాము తీసుకుని నూతనవాయువులకు తమే యిస్తాయి. ఇట్లాగే మళ్లీ మార్చినప్పుడు మొదటి రెండు టవర్లూ వేడిని తీసుకుని వుంటాయి కాబట్టి ఆ వేడిని తిరిగి నూతనవాయువులకు యిస్తూవుంటాయి. ఇందులో అగ్నిష్టలో మంటలు కొంతసేపు కుడినుంచి ఎడమకూ, కొంతసేపు ఎడమనుంచి కుడికీ తిరుగుతూ వుంటాయి. అందులో ప్రతిచోట వేడి మారుతూ వుంటుంది. మీట తలుపు దగ్గర ఒకరు ఎప్పుడూ వుండాలి. రిక్యుపరేటివ్ ఫర్నేస్‌లో ఇటుకల ఖర్చుచాలా ఎక్కువ. తొందర తొందరగా ఎక్కువ వ్యవధానం లేకుండా వీటిని మారుస్తూ వుండాలి. మనదేశంలో రీజెనరేటివ్ ఫర్నేసులే ఎక్కువ.

చల్లారినగాజును వెచ్చజెయ్యాలంటే మళ్ళీ కుండల్లో పెట్టి అగ్నిష్టల్లో పెట్టరు. దానికై చిన్నచిన్న బట్టీలు వుంటాయి. వాటిని గ్లోరీ హోల్సు అంటారు. ఇవ్వేకాకుండా ఎనీలింగ్ అగ్నిష్టలు వుంటాయి అనుకున్న విధంగా కాకుండా అతిత్వరితంగా గాజును చల్లారిస్తే వచ్చే మార్పులను ఇదివరకే చూశాము. అట్లా కాకుండా వుండాలంటే ఎనీలింగ్ అగ్నిష్టలో ఆ గాజును వుంచి ఎనీలింగ్ ఉష్ణతవరకూ వుంచి,సుమారు ఆరునూర్ల డిగ్రీలవరకూ వుంచి తీస్తే సర్దుకుంటాయి.

గాజుకర్మాగారాలలో యీ అగ్నిష్టలు, కాచపూరకుని సామానలు, గాజుకుమ్మరి ఆశ్రమాలు, కొలుములు, రంగురంగుల గాజుల తయారీకై రసాయనసామగ్రి, శిలాంగార వాయు నిర్మాణగృహము, ఒక పెద్ద రసాయన లేబొరేటరీ, గాజుసామానును పరీక్షచేసే లేబొరేటరీ, ఒక కార్ఖానా అన్నీ వుంటాయి. ఇవిగాక తయారైన సామగ్రిని పెట్టెల్లో కెక్కించి దేశాంతరాలకు పంపించే కార్ఖానా వుంటుంది.

లేఖలు



భోనసుకూపన్లు ఎందుకు?

స్వామీ,

రాష్ట్రప్రభుత్వమువారు రైతులు అమ్మే ధాన్యమునకు ధర పెంచి, పెరుగుదల సొమ్ముతో వ్యవసాయాభివృద్ధి చేయాలనే తలంపుతో పెంచినధర రు 2 లలో ఒక రూపాయికి కూపన్లు యిచ్చి వాటితో వ్యవసాయ డిపార్టుమెంటు డిపోలలో ఎరువులు, విత్తనాలుకు నగదు అక్కరలేకుండా కొనుక్కొనే ఏర్పాటు చేసినారు. బాగానే వుంది. అసలు యీ కూపన్లు భూమిసాగుచేసే రైతుకు వస్తాయా? అనేది ప్రశ్న. ధాన్యం ఎవ్వరు అమ్మితే వారికి కూపన్లు వస్తాయి. ఉదాహరణకు—10 ఎకరములు భూమి (పల్లం) మక్తాకు చేసే రైతు సాలీనా ఎన్ని బస్తాలు అమ్ముతాడు. యకరం 1 కి 15 బస్తాలు సగటున పంట వేసుకుంటే భూమందుకు 12 బస్తాలు మక్తాతీసి పాలేళ్ళకు 1 బస్తా తీసినను అసాధారణ పరిస్థితిగా యకరం 1 కి 2 బస్తాలకన్న ఎక్కువ అమ్మజాలడు. అంటే ఎకరం వ్యవసాయం చేసే రైతుకు రు 2 లు బోనసు కూపన్లు వస్తాయి అన్నమాట. అదే భూఖామందు తన తిండికిపోను సగటున 10 ఎకరములుగల ఆసామీ 60 బస్తాల వరకు అమ్మగలడు. అతనికి రు 60 లు రొఖ్ఖం కావలసినవానికి ఎరువు కూపన్లు వస్తున్నాయి. ఎరువు కావలసిన రైతుకు కూపన్లు రావటం లేదు. అందువల్ల రెండవపంటవుంటే ఆ రైతుకు కూపనులేక డిపోలలో ఎరువు తీసుకొనలేక పోతున్నాడు, సక్రమంగా. అందువల్ల భూమి సాగుచేసే రైతు బ్లాకులో భూఖామందులనుండి కూపన్లు కొనుక్కొనియైనా డిపోలలో ఎరువు తీసుకొనవలసివస్తూంది. లేదా కూపన్లు గలవారు తెచ్చుకొంటే బ్లాకులోనయినా తీసుకొనవలసి వస్తూంది. డిపార్టుమెంటు డిపోలలో ఎరువు (వేరుశెనగపిండి) బస్తా 1 కి రు 8-8-0 లు అయితే బయట రు 13 లు బస్తా వున్నది. యిక అరటి, చెరుకుతోటలవారి పరిస్థితి చెప్పనక్కరలేదు. వారు సరియైనధరలకు ఎరువులు అందక వచ్చే ఫలసాయంయొక్క ధరలు తగ్గినా అమితంగా వెచ్చించి బ్లాకులో ఎరువులు కొనవలసి వస్తూంది. గనక యీ బోనసును ఎరువుల కూపన్లుగా యిచ్చినందున భూమి సాగుచేసే రైతుకు కావలసిన ఎరువు అందటంలేదు. గనుక ఏ రైతుఅయితే భూమి సాగుచేస్తాడో వానికి ఎరువులు యిచ్చేందుకు వుత్తరువులు చేయాలి. ఆసామీ చేసే భూమియొక్క నెంబర్లు, పర్మితంలు గ్రామాధికార్ల చేత సర్టిఫై చేయించుకొని వచ్చినవారికి యివ్వాలి. రైతుకు కూపన్లున్నా డిపోలలో ఎరువులేదు. ఎరువులు సప్లయి చేయలేనిదానికి కూపన్లు యివ్వడం రైతులకు రెండువిధాల అపకారం అని ప్రభుత్వం గుర్తించవలెను. సరియైన పద్ధతి త్వరలో అమలులో పెట్టి ఎరువులు విరివిగా సప్లయి చేయిచాలి.

తంగిరాల కృష్ణానంద తిలక్,

ఇరగవరం.

* * *

చేతికాగితపు పరిశ్రమలు

అయ్యా,

ప్రభుత్వమువారు యిటీవల తమకార్యాలయములు అవుసరములకు కావలసిన కాగితము, గుడ్డ వగైరా వస్తువులు మొదటిపక్షంగా ప్రభుత్వసంస్థలలో తయారైనవే వాడవలయునని, రెండవ పక్షంగా మనరాష్ట్రములో తయారైనవి వాడవలయునని చేసిన వుత్తర్వులు, కేవలము ప్రభుత్వపరిశ్రమల నష్టమును కూడదీసుకొనుట కుపకరించునేగాని ప్రజాసంస్థలచే నిర్వహింపబడుచున్న చేతి పరిశ్రమల కేలాటి సహాయమును చేయజాలవు. అదిన్నిగాక, బడ్జెట్ చర్చ సందర్భమున పరిశ్రమల మంత్రిగారు, చేతికాగిత పరిశ్రమను ప్రోత్సహించుటే ప్రభుత్వవిధాన మని, ప్రత్యేక వ్యక్తులు, సంస్థలు, యీ పరిశ్రమను నిర్వహించు నెడల ప్రభుత్వసహాయము, సలహాల నిచ్చెద రని చేసిన వాగ్దానమునకు పై వుత్తర్వులు విరుద్ధములు. చేతిపరిశ్రమలు ప్రభుత్వముచే నడుపబడినను, ప్రజాసంస్థలచే నిర్వహింపబడినను వాటి అమ్మకమునకు, మిల్లువస్తువులనుండి పోటీకి ప్రభుత్వరక్షణ అవుసరము. అలాకాక ఖరీదులో తేడా లేనియెడల ఖద్దరు వ్యాప్తికి ముప్పది సంవత్సరముల మహాత్ముడేమి, యిప్పుడు ప్రభుత్వమేమి యింతగా ప్రయత్నమే చేయ నవుసరం లేదు. ప్రభుత్వముచే నిర్వహింపబడుచున్న చేతిపరిశ్రమలు యుద్ధకాలంలో ప్రారంభింపబడినవి.

శిథిలావస్థలో నున్న మన దేశీ చేతి పరిశ్రమలను పునరుద్ధరించుటయే తమ ఆశయముగా గల బందరు, ఆంధ్రజాతీయ కళాశాలలో యిప్పటికి పదిసంవత్సరములనుండి 'చేతికాగిత పరిశ్రమ' నడుపబడుచున్నది. ఇప్పటికి 200 మందికిపైగా విద్యార్థులకు చేతితో కాగితము తయారు కచేయు విధానము నేర్పబడినది. కళాశాలవారు యిప్పటికే యీ పరిశ్రమనిర్వహణకుగాను పదిహేనువేల రూపాయలు ఖర్చు పెట్టియున్నారు. రోజుకు పది రీములకు పైబడి కాగితము తయారుచేయుటకువలయు సాధన సంపత్తిగలదు. తక్కువ ఖర్చుతో ఎక్కువ కాగితము తయారుచేసి, తద్వారా కాగితం ధర తగ్గించుట కళాశాల సంకల్పము. మనకు స్వతంత్రము లభించిన పిమ్మట యీ పరిశ్రమకు మంచి భావి కలదను తలంపుతో, కళాశాలవారు యింత దూరము, ఏటేటా వచ్చుచున్న నష్టమును లెక్కచేయక యీ పరిశ్రమ నిర్వహించుచున్నారు.

ఏ పరిశ్రమనైనను స్వయంపోషక మొనర్పవలె ననిన, ఆ పరిశ్రమనిర్వహణ కగు ఖర్చు, అక్కడ తయారగు వస్తువుల అమ్మకమునుండి రావలసియున్నది. అందులో యిలాటి శైశవావస్థయందున్న చేతిపరిశ్రమలలో తయారగు వస్తువుల అమ్మకమునకు తగిన రక్షణ ప్రజాప్రభుత్వము కలిగించవలసి వుంది. ఈమధ్య యుద్ధకాలంలో మిల్లుకాగితం దొరకక చేతికాగితంకు ఒరవడి కలిగింది. క్రమేణా పరిస్థితి మారింది. కాబట్టి చేతికాగిత పరిశ్రమకు ప్రభుత్వం ఒడిదుడుకులు లేని market protection కలిగించవలసి వుంది.

ఈమధ్య నైజాం ప్రభుత్వం తమ సంస్థానమందలి గృహపరిశ్రమలలో తయారగు వస్తువులను ప్రభుత్వపు సహకారసంస్థలు తీసుకొని, ప్రభుత్వమే వాటిని అమ్మకం చేయు బాధ్యత వహించి, చేతిపరిశ్రమలకు రక్షణ చేకూర్చినది. మన ప్రభుత్వమయిననూ అలా చేయవచ్చును.

మన ప్రభుత్వంవారే తమ ఆధర్వర్యమందలి పరిశ్రమలలోని వస్తువుల విక్రయం విషయంలో తమ కార్యాలయములో వాడవలె నని వుత్తర్వులిచ్చి రక్షణ కూర్చుకున్నప్పుడు, ప్రజాసంస్థలకు తగిన సహాయంచేస్తామని వాగ్దానంచేస్తున్నప్పుడు చేతికాగిత పరిశ్రమను ప్రోత్సాహపర్చడమే తమ విధాన మని ప్రకటిస్తున్నప్పుడు నేను పైన చెప్పిన విధంగా market protection కోరటం అసమంజసమైన విషయం కాదు.

కు॥ మాధవరావు,

బందరు.



ఇంగ్లండు, పల్లెటిసీమలో, మరల కుటీరపరిశ్రమల పునరుద్ధరణము. రై అనే సస్సెక్సు గ్రామంలో చేతితో తయారుచేసిన పాత్రకు శిల్పి అలంకరిస్తున్న దృశ్యం. ఈ పాత్రలు ఇప్పుడు బాగా ఎగుమతి అవుతున్నాయి.

* * *

మహాశివరాత్రి వివాదపరిష్కారం

అయ్యా,

సర్వజిదుత్తర మగు సర్వజిద్వత్సర మాఘ కృష్ణ త్రయోదశీ సోమవారం మహాశివరాత్రిని విడిచి మంగళవారమునాడు మహాశివరాత్రి యని పంచాంగములందును పత్రికలందును వ్రాసిన వారును, అట్లే వాదించువారును, ఈ క్రింది దోషములను వాదింపవలసి యున్నారు. సప్రమాణముగా నివారింపనిచో వారందఱును తాము తప్పుచేసినట్లు ఒప్పుకొన్నవారే యగుదురు.

నాలుగు దోషములు

1. నిశీథకాలమునకు సంపూర్ణ చతుర్దశీ వ్యాప్తి లేకుండుట దోషము,

"పరేద్యుః నిశీథైకదేశవ్యాప్తా, పూర్వేద్యుః సంపూర్ణతద్వ్యాప్తా పూర్వైవ"—ఇతి ధర్మసాసింధుసారః.

దీనింబట్టి యేకదేశవ్యాప్తిగల మంగళవారమునాడు మహాశివరాత్రి కాదని తేలుచున్నది.

2. నిశీథకాలములకు పూర్వాపరములందు చతుర్దశి లేకుండుట దోషము.

"నార్ధరాత్రా దధశ్చోర్ధ్వం
యుక్తా యత్ర చతుర్దశీ,
నైవ తత్ర వ్రతం కుర్యా
దాయురైశ్వర్యహానితః"

—ఇతీశానసంహితాయా మితి నిర్ణయసింధుః.

దీనింబట్టి పరమందు చతుర్దశిలేని మంగళవారమునాడు మహాశివరాత్రి కాదని తేలుచున్నది.

3. అమావాస్యాసంగదోషము.

"మహతా మపి పాపానాం దృష్టా
వై నిష్కృతిః పరా,
న దృష్టా కుర్వతాం పుంసాం
కుహూయుక్తాం తిథిం శివాం"

—"ఇతి స్కాందే దర్శయోగస్య నిందితత్వాచ్ఛ" ఇతి నిర్ణయసింధుః.

దీనింబట్టి యమావాస్యాసంగదోషము గలని మంగళవారమునాడు మహాశివరాత్రి కాద తేలుచున్నది.

4. దర్శపారణదోషము:

"తిథీనా మేవ సర్వాసా
ముపవాసవ్రతాదిషు,
తిథ్యంతే పారణం కుర్యాత్
వినా శివచతుర్దశీం"

—ఇతి స్కాందే, ఇతినిర్ణయసింధుః.

"తిథ్యంతే పారణం భవే దితి కృష్ణాష్టమ్యాది విషయ మేవ; నతు శివరాత్రి విషయం...వినా శివచతుర్దశీ మితి పర్యుదస్తత్వాత్. శివరాత్ర్యాః సర్వప్రకారేషు తిథిమధ్య ఏవ పారణేతి బ్రూమః, శిష్టాచారో ప్యేవ మేవ" ఇతి నిర్ణయసింధుః.

దీనింబట్టి, వ్రతతిథి పారణార్హము, కాని మంగళవారమునాడు మహాశివరాత్రి కాదని తేలుచున్నది.

ఇట్లు,

పి. చిదంబరశాస్త్రి

(శతావధాని)

టూర్జెన్యేవ్

ఒకప్పుడు టూర్జెన్యేవ్ నవలలకు విదేశాలలో, ముఖ్యంగా ఇంగ్లాండులో ఉన్నంత ఆదరణా, పలుకుబడీ మరే ఇతర రష్యన్ నవలాకారువాటికీ ఉండేవికావు. అతిలలితంగా, కరుణరసంతో ఉట్టిపడే అతని రచనలు, టాల్‌స్టాయి, డాస్టావిస్కీల, హిమాచలోత్తుంగ శిఖరసదృశాలైన రచనలకన్నా విశ్వసాహిత్య పిపాసువులకు ఆప్యాయంగా కనబడేవి. అసలావాటికి డాస్టావిస్కీ పేరు ఎక్కువగా విదేశీయులకు తెలిసేది కాదు. అతని "క్రైమ్ అండ్ పనిష్మెంటు" (నేరము : శిక్ష) "పూర్ ఫోల్క్" (బీదజనం) అన్న నవలలుతప్ప ఆంగ్లంలోకి అనువాదమైనవే లేవు.

ముఖ్యంగా సాహిత్యపరులకు టూర్జెన్యేవ్ అంటే చాలా అభిమానంగా ఉండేది. పోగస్టేవ్ ఫ్లాబే అతన్ని తన తోడబుట్టినవానిలాగా ప్రేమించేవాడు. మాపాసా మహా అభిమానంతో అతన్ని, రచయితగా మాత్రమేకాకుండా, పూర్ణపురుషునిగా గౌరవిస్తూ, "ఫ్లాబే" కన్నా గొప్పవాడని స్తుతించేవాడు. "టూర్జెన్యేవ్ వ్రాసిన కథలు పురాణాలతర్వాత ప్రపంచములో మళ్ళీసాహిత్యసేవకు ప్రథమకానుకలుగా గణించవచ్చునని" జార్జిమూర్ అంటాడు. "బాల్జాక్, టూర్జెన్యేవ్ లకుమించిన కథకుల్లేరు, పరంపరాగతంగా నిలచే కథలువ్రాసినవాళ్ళు వీళ్లిద్దరే" అనికూడా అన్నాడు.

ఫాదర్స్ అండ్ సన్స్ (తండ్రులూ పిల్లలూ) అన్న అతని నవలను దేశదేశాల అందరూ చదివి చాలా మెచ్చుకున్నారు, టాల్‌స్టాయి మినహాగా! టూర్జెన్యేవ్ నవల వ్రాసి పూర్తిచెయ్యగానే టాల్‌స్టాయికి చదువమని ఇచ్చాడు. టాల్‌స్టాయి చదివి, చాలా నికృష్టంగా ఉందన్నట్టు తేల్చాడు. అప్పుడు టాల్‌స్టాయి, టూర్జెన్యేవ్ దగ్గిరే ఉంటూన్నాడు. తన నవలమీద అతని అభిప్రాయం తెలుసుకొందామని సహజ కుతూహలంతో, టాల్‌స్టాయి చేతిలో ఆ గ్రంథమును చి, అతని చదువుకు ఏమాత్రం భంగం కలుగకుండా ఉండేందుకు ఆ గదిలోనే అతన్నొంటరిగా ఉంచి ఇవతలకి వచ్చాడు. టాల్‌స్టాయి చదవటం మొదలు పెట్టాడు. "చాలా అముఖ్యమైన విషయాన్నాధారం చేసుకొని కథావస్తువు ఉంది. కథారచన చాల్లా కృతకంగా ఉంది. కథ మధ్యలోనే నాకు నిద్రపట్టింది. ఏదో ఎందుకో అకస్మాత్తుగా మెలకువ వచ్చినట్లయి చూస్తే, అప్పుడే గదిలోకివచ్చి వెనుదిరిగి వెళ్ళిపోతున్న టూర్జన్యేవ్ వీపుమాత్రం కనబడింది" అని టాల్‌స్టాయి ఆత్మకథలో వ్రాశాడు.

టూర్జెన్యేవ్ టాల్‌స్టాయికన్నా పది ఏళ్ళు పెద్ద. టాల్‌స్టాయిని ముందు సాటిరచయితగా, ప్రతిభాశాలిగా ప్రప్రథమంగా గుర్తించి పైకి తెచ్చినవాడు టూర్జెన్యేవ్. కాని ఆ యీడున తనకన్నా పెద్దవాడు చూపిన గౌరవాన్ని, చేసిన సహాయాన్ని, ఏదో పెద్దరికంతో, ధామేదాతనానికి పోటుపట్టూ పైకి తెచ్చామన్న పేరుకోసం చూస్తున్నట్లుగా టాల్‌స్టాయ్ తన పెంకితనంలో అనుకున్నాడు. అసలు తమనెవరో ఉద్ధరిస్తారన్న భావాన్నే భరించలేనిరకంవాళ్లు, టాల్‌స్టాయి కాని, డాస్టావిస్కీగాని! డాస్టావిస్కీకూడా, ముందు టూర్జెన్యేవ్‌ను భక్తితో పూజించటం మొదలుపెట్టాడు. కాని కొన్నాళ్ళయాక ఎదురుతిరిగి, అతన్ని "అడుసులోకి తొక్కేశాననీ", అతని ఆ గొప్పకుపోయే పోకడలు, "తానొక మహోదాత అయి, తక్కినవాళ్ళు తన మోచేతినీళ్ళు తాగేరకాలుగా దయతో చూస్తున్నట్టు" నడిచే నడకలూ, అవన్నీ చాలా దుర్భరమనీ దుమ్మెత్తిపోశాడు. కేవలం టూర్జెన్యేవ్ నాటి సాటిరష్యన్ రచయితల భావాలే అంటే, టూర్జెన్యేవ్ అంటే నిజంగా అసహ్యమే కలుగుతుందేమో. కానీ అతని ఫ్రెంచి స్నేహితులు చెప్పిన మాటలు వింటే, అంతటి సౌమ్యదసుడు, స్నేహపాత్రుడు వినయశీలి మరొకరుండరేమోనని అనిపిస్తుంది.

టాల్‌స్టాయి, టూర్జెన్యేవ్‌ను, చాలా ఉక్రోషంమనిషనీ, ద్వేషపూరితుడనీ, అతని నవలలోకూడా రాక్షసులను సృష్టించి, వాళ్ళంటే దయ, ఆదరం లేకుండా, దూషించటానికే పాల్పడ్డాడనీ విమర్శించాడు.

టాల్‌స్టాయిమాటలతో పూర్తిగా ఏకీభవించటం కష్టం. అసలప్పుడు, కల్పనాకథలు చదివే మనఃస్థితిలోనే టాల్‌స్టాయి ఉండి ఉండడు. "అసలునవలలు వ్రాయటం, అందులో ముఖ్యంగా, నిస్పృహలోపడిపోయి జీవితంలో తమకేం కావాలో తెలియనివాళ్ళు నవలలు వ్రాయటం పనికిరాదనే నా అభిప్రాయం" అన్నాడు.

టూర్జెన్యేవ్, తనచుట్టూ ఉన్న పురుషులలో, స్త్రీలలో, అసలు ప్రకృతిలో ఉన్న, వికృతాన్ని చాలామటుకు అవగాహన చేసుకొన్నాడు. వాస్తవికరచయితగానే వాటిని వర్ణించాడు. కాని పూర్తిగా అతన్ని చదివితే, మానవసౌజన్యంలో, మంచితనంలో, అమితమైన హృదయవిశ్వాసమున్న కవిగా, ప్రకృతి అందాన్ని కలకలలాడే పక్షులతో రమ్యంగా చిత్రించిన రచయితగానే గోచరిస్తాడు.

నవల అనేది "జీవితంలో ఒక ఖండంగా" ఉండాలన్న సూత్రమే అతను తన రచనలో అనుకరించాడు. మహాభావుకుడు, ముఖ్యంగా కవీ అయినాకూడా, తన నవలల్లోని మానవ వృద్ధులు, యువకులు, అందరూకూడా; ఎవరెవ వ్యక్తులు ఎలా మాట్లాడుతారో, ఆలోచిస్తారో, నడుచుకొంటారో, అన్నీకూడా, వాస్తవికవాదులకన్నా కూడా ప్రశస్తమైన వాస్తవిక పద్ధతిని చిత్రించాడు. అతని నవలలోని వ్యక్తులు సజీవులుగా కళ్ళముందు నిలుస్తారు.

"ఫాదర్స్ అండ్ చిల్డ్రెన్ లో" అతను సృష్టించిన బాజరోవ్‌పాత్ర, పెద్ద యీడు పైబడుతూన్న వాళ్ళకు చాలామందికినచ్చదు. యువకుడు, నాస్తికవాది, మొటు మనిషి, తన పెద్దల ఆదర్శాలను భరించలేని ముక్కోపి, ఈ బాజరోవ్ యువకలోకానికి ఆదర్శనాయకుడుగా కనబడేవాడు. రష్యన్ సారస్వత కథానాయకుల్లో అందరిని మించి మిన్నంది నిలిచినట్లుంటాడు.

కాని నవల అంతా చదివితే, హృదయతంత్రులను కదల్చి, చదువరిలో ఆదరాభిమానాలు కల్పించేవాడు బాజరోవ్ కాదు. అతనిముందు వాలఖిల్యుల్లాగా కొంచెపడిపోయిన ఆ వృద్ధులే, వారి విశాలహృదయాలవల్లా అతి మంచితనం కల్లా మనకు సన్నిహితులై, నవలకు మహోన్నత సాహిత్యరూప మిస్తారు.

టూర్జెన్యేవ్‌లో ఎంత దయారస ముందో, అతనిహృదయ మెంత కరుణార్ద్రమో, నవల అంతంలో, చివరిఘట్టంలో తమ కుమారుని సమాధిని సందర్శిస్తున్న ఆ వృద్ధులైన తలిదండ్రులనుగూర్చి వ్రాస్తూ నవలను ముగించిన అతని వాక్యాలవల్ల తెలుస్తుంది.

"కన్నీళ్ళూ, ప్రార్థనలూ, అన్నీ ఫలశూన్యాలేనా! ప్రేమ, పవిత్రమూ అచంచలమూ ఐన ప్రేమసర్వశక్త్యాత్మకం గాదా! కాదు! కాదు! సమాధిలో దాగిన హృదయం, ఎంత పాపపంకిలమై, ఎంత విషమగతిని నడిచినదైనా, సమాధిపై గడ్డిలో మొలిచే పూలు, తమ అమాయకపు కన్నులతోనే, గంభీరంగా, మనవైపు చూస్తాయి. అనంతప్రశాంతత్వాన్నే కాకుండా, ప్రకృతి యొక్క నిస్సంగశాంతగాంభీర్యాన్నికూడా సూచిస్తాయి. అవిరళసంయోగవియోగాల శాశ్వతాల అంత మెరుగని జీవితాన్నే సూచిస్తాయి.

(జార్జ్ ఆఫ్ లండన్)



ఢిల్లీ, 'ఇర్విన్ స్టేడియంలో మార్చి 26 న జరిగిన భారతసైనికదళాల ప్రదర్శనంలో "అంచెలసవారీ" అనే ప్రదర్శనం.

బ్రాహ్మణశాఖలు

(7 వ పేజీ తరువాయి)

అనంతా యిక్కడ ప్రస్తుతం గాదు. దీక్షితులుగారు మహాపురుషుడు, మహావిద్వాంసుడు, మహాకర్మఠుడు బ్రాహ్మణ్యాభిమాని ఆయీ సంస్కర్త అధమం వక వందయేండ్లకు పూర్వం అవతరిస్తే ఆయన చేసిన సంస్కారానికి యెంతేనా ఫలితం కనపడేది. వూరికే పూర్వాచారాలు వాటంతట అవి వొద్దు వితిగి ప్రవాహంలో పడేకాలం ఆసన్న మయ్యే టయిములో అవతరించడం చేత యేకొంచెమో ఫలితం కలిగినా కలగదగినంత కలగలేదనే చెప్పవలసి వుంటుంది. ఆర్వేలనియోగులకు-వెల్నాటినియోగులనీన్నీ క్వాచిత్కంగా వ్యవహారంవుంది. దీన్నిబట్టే అనుకుంటాను పర్వే సర్వత్ర, నిలువుబొట్టువగయిరా వైష్ణవచిహ్నలతో వుండే గోలకొండవ్యాపారులను మనదేశంలో తెలగాణ్యపు నియోగులంటారు. ఆర్వేలవారు వెల్నాట్లగోనుంచి వస్తే వచ్చారేమో చెప్పలేముగాని, వీరు తెలగాణ్యలనుండి విడివడలేదు; అని తెల్పిడి ఆలువేలవారికీ వీరికీయిచ్చిపుచ్చుకోవడాలు లేవు వీరు దొరికినంతలో ఆబ్దికాదులలో వైష్ణవులనే అర్చిస్తారు. దొరక్కపోతే వాపత్కంగా స్మార్తులకీ పెడతారు. స్మార్తులకీ వీరికీ సహపంక్తి నడుస్తూ వుంది గాని, వైష్ణవులు ఆబ్దికభోక్తలుగా వచ్చికూడా-"తెరతీయగరాదా!...అనే త్యాగరాయకృతిని పాడిస్తారు భోక్తలు వారే పాకం చేసుకుంటారు; తెరలో వుంటారు. కర్త యీ వలవుంటాడు. వడ్డన స్వాములే చేసుకుంటారు. నిజమో అబద్ధమో కాని, కర్తయింకా స్నానం చేయకపూర్వమే స్వాములు భోంచేసి, విస్తళ్లు దొడ్లో పడేశారనీ ఆ సమయానికి కర్త దొడ్లో వుండడం తటస్థించి ఆ విస్తళ్ళు ఆయనమీద పడ్డాయనీ, ఆరోజు మొదలుకొని ఆయన స్మార్తుడుగా మాటిస్వాములను అర్పించడం మానుకున్నాడనీ చెప్పుకోవడం. మొత్తం ఆయీ శాఖవారు స్మార్తాచారాలు విధిలేక అవలంబించినా బొట్టుమాత్రం నిలువుబొట్టే. నూటికి యాభైమంది తిరుచూర్ణం మాత్రమే ధరిస్తారు. తక్కినవారు తిరుమణితో సహా కేవల ఫాలభాగమందే కాక శాస్త్రోక్త ప్రకారం ఆయా స్థలాలయందు ద్వాదశోర్ధ్వ పుండ్రాలు ధరిస్తారు. మధ్యవైష్ణవుల నామములు పెద్దవి. (వేణుగోపాలశతకం చూ.) విధిలేక వీరు స్మార్తాచారాలు అవలంభించినా వైష్ణవులే. యెవరైనా బ్రాహ్మణ్యానికి భంగం లేదు. అది వ్యాపకధర్మం. వైష్ణవత్వం లోనైనవి వ్యాప్యధర్మాలు.

మరికొన్ని నందవరీకులు కూడా నియోగులలోని వారే. అల్లసాని పెద్దన్నగారు, కణాద పెద్దన్నగారు (గద్వాల సంస్థానకవి. ముకుందవిలాస గ్రంథకర్త) వీరంతా నందవరీకులే. ఆయీ శాఖవారు దత్తమండలములో కొంత విశేషించి వున్నారు. అల్లసాని తాతగారు గద్యలో, అమాత్యపదం వాడడంవల్ల వీరు వైదీకులుకారు. యీ నందవరీకులు కాశీనుంచి యీ దేశం రావడాన్ని గురించి వొకపుస్తకం చూచినట్టు జ్ఞాపకం. మొట్టమొదట నందవరంలో మకాం పెట్టడం చేత ఆయీ పేరు వచ్చినట్టు దానిలో వుంది. రమారమి వొకశతాబ్దాన్నుంచి వైదీకులు చాలామంది వృత్తిచే నియోగులుగా మారి వున్నారుగాని, ఆ మార్పల్లా పేరు చివర రావుపదం చేర్చుకోవడంవఅకేని గ్రంథంతుదను గద్యలో అమాత్యపదం చేర్చుకోవడం దాకా రాలేదు. నియోగులలో కొందఱు వేదశాస్త్రాదు లభ్యసించి శాస్త్రి బిరుదం ధరించడం కలదు గాని, వేదం అంతా కాకపోయినా స్మార్తభాగం వర్జించి షోడశకర్మాధికారులుగా పరిణమించిన్నీ, అవధాని బిరుధాన్ని ప్రేమించినట్లు కనపడదు. కారణం, ఆయీ అవధాని బిరుదం గౌరవనీయమే అయినా యేదో పేదతనాన్ని సూచిస్తుంది. యీ బిరుదం మాత్రమే కాదు. బ్రాహ్మణ శబ్దంకూడా అట్టిదే. వ్యుత్పత్త్యర్థం శూద్రాదులకే కాదు బ్రాహ్మలలోనేనా యెవరికో గాని తెలియదు. పిల్లలు పుట్టి నిలవని కాపుగృహస్థులు, తమ పిల్లలకు పేరుగా బ్రాహ్మణ పదాన్ని పెట్టుకుంటారు. కొందఱు పుల్లయ్య, పెంటయ్య యీ పేర్లు పెట్టడమే కాదు; పెంటలో పార్లించి తీసుకుంటారు. క్రియలో మాట బ్రాహ్మణ పదం యెంత మంచి అవయవార్థం కలదైనా సామాన్యజనుల దృష్టిలో చాలా దైన్యాన్ని సూచించేదిగా వుంటుందని ఫలితం నేటికి నల్లైయేళ్ళనాడు కీ॥ శే॥లు రెంటాల సుబ్బారావుగారు 'జనరంజని' అనే పత్రికను ప్రారంభించి రెండుమూడు సంచికలుమాత్రమే ప్రచురించి ఆపు చేశారు. దానిలో (1) అవధాని (2) సోమయాజి (3) శాస్త్రి—ఆయీ పేర్లు నామకరణం ద్వారా పూర్వులవి చిన్నప్పుడు పెట్టబడ్డవారు ప్రస్తుతం రాజకీయభాషలో ఆటితేటి పెద్దపెద్ద వుద్యోగాలు నిర్వహిస్తూ వున్నారుగదా! వీరి పేర్లకు చివర రావుపదం చేరిస్తే యేలా వుంటుందంటూ చమత్కరించి వ్రాసిన వ్యాసం చూచినట్లు జ్ఞాపకం. లోకానికి యిపుడు అబ్రాహ్మణ చండాలపర్యంతం రావుబిరుదంమీద వున్న ప్రేమకు అంతూ పొంతూ లేదు. రయితు రావు, పాలికాపు రావు. అంతే కాదు; మొగుడు రావు, పెండ్లాం రావు దీనికి లింగభేదం కూడా లేదు. "రావుపద్దేటికిరా !" అంటూ వొక పద్యం విన్న జ్ఞాపకం. ఆ పద్యం ఆయీ బిరుదు వెలమవారికి వుండాలి కాని తదితరులకు వుండగూడ దన్నట్లు తేలుస్తుంది.

పూర్ణయ్యమంత్రి

శ్రీ కోన వెంకటరాయ శర్మ

అచ్యుతదేవరాయలు చోళపాండ్యదేశముల రెండిటిని బరిపాలించుచు నచ్చటికి దెలుగు దేశమునుండియె సచివోత్తములను దండనాథులను, గాయకులను, బండితులను కవిశేఖరులను నర్తకులను బిలువనంపించెను. అటుల బిలువంబడిన నియోగికుటుంబములలో దిరుచినాపల్లి మండలము (Trichy District) లోని 'తిరుకంబూరు'నం దున్న నియోగిబ్రాహ్మణకుటుంబ మొకటి. అచ్యుతరాయల తరువాత కొంతకాలమునకు ఆ కుటుంబమునవారియందు జీవనోపాధి తక్కువయై పలుకష్టములకు లోనుగావలసివచ్చెను. ఆ బ్రాహ్మణకుటుంబమున బూర్ణయ్యమంత్రి జనియించెను.

అతడు ప్రారంభవిద్యను మాత్రమే పూర్తియొనర్చి వర్తక వాణిజ్యములలో బ్రాశస్త్యము గడించిన రంగయ్యచెట్టియొద్ద వ్రాయసకాడుగా నుండుచుండెను. పూర్ణయ్య పొట్టిగను, లావుగను నుండుటయేగాక కుదిమట్టముగనుండి చూపఱుల నాకర్షించుచుండెను.

మహీశూరరాష్ట్రము (Mysore State) న వర్తకవాణిజ్యములలో బేరెన్నికగన్న హైదరల్లీ-సౌదీ ఆనందచెట్టీలతో లావాదేవీలు గలవాడగుటచే రంగయ్యచెట్టి పూర్ణయ్యను వెంట నిడికొని శ్రీరంగపట్టణమునకు బోయెను. అచట లెక్కలదేల్చు విషయమున బూర్ణయ్య యగపఱచిన బుద్ధివిశేషమున కాశ్చర్యచకితుడై యానందచెట్టి రంగయ్యచెట్టితో జెప్పి యధికవేతనముతో బూర్ణయ్యను దన దగ్గఱ వ్రాయసకాడుగా నుంచికొనియెను.

ఆకాలమున నా ప్రాంతముల వ్యవహారభాషగా నున్న 'హిందూస్థాని' భాషను జక్కగా నేర్చికొని యనర్గళముగా మాటలాడుటకును, సవ్యాపసవ్యములుగ వ్రాయుటకును జాలి యుండెను. అక్కతన నితనినే యానందచెట్టి హైదరల్లీ దర్బారున కంపుచుండెడివాడు. దర్బారు రాకపోకలలో బూర్ణయ్య యగపఱచిన శక్తిసామర్థ్యములకు, జూపిన బుద్ధిచాతుర్యమునకును హైదరల్లీ యబ్బురపడి యీతని దన దివాణపు వ్రాయసకానిగా నేర్పాటు సేసికొని, క్రమక్రమముగా గోశాధికారి (Treasury Officer) గా నియమించి, నవనవోన్మేషమై దినదినప్రవర్ధమానమై తేజరిల్లుచున్న యాతని ధీశక్తి నవలోకించుచు లోలోన నానందించుచుండెను.

హైదరల్లీ కుశాగ్రబుద్ధి. అక్బరు శివాజీ సమ్రాట్టులంబలె మనుజుల చిత్తవృత్తుల గనిపట్టగల నిపుణులలో హైదరల్లీ యొకరుడు. అతడు సారస్వతోపాసకుడు గాకున్నను బెక్కుభాషలలో ననర్గళముగా బ్రసంగించగల శక్తి గల్గియుండెను.

పూర్ణయ్య యైత మనేకభాషలలో మాటాడనేర్చికొని యదివఱకు వక్రమార్గమున (హంగామాగా) నున్న కోశద్రవ్యవ్యయము సక్రమమార్గమున బెట్టి యాశాఖయం దెన్నియో సంస్కరణల నొనర్చుటవలన హైదరల్లీకి గూరిమి మిత్త్రుడై విలసిల్లెను. అతడు గావించిన సంస్కరణ లిప్పటికి ననుసరింపబడుచున్నవి. ఇట్టి మహత్తరమైన యుపకార మొనర్చుటచే బూర్ణయ్యకు హైదరల్లీ జాగీరొసంగి, బంగారుగొడుగు క్రింద నడచు నత్యుత్తమ రాజలాంఛనతో సత్కరించెను.

భగవద్దత్తమైన ప్రతిభాసమన్వితం బగు ధీశక్తిని స్వయంకృషిచే నభివృద్ధి పఱచికొని, యత్యున్నతపదవిం బొంది, జరామరణములు లేని చిరయశస్సు నార్జించినవారిలో బూర్ణయ్యమంత్రి యొకడు.

హైదరల్లీ మహీశూర రాజన్యుల కొల్వులో నుండి, తన ప్రజ్ఞాప్రాభవకీర్తులచే నాయేలిక మెప్పొంది, "డిండిగల్లు"నకు "ఫౌజుదారు"గా నియమింపబడి, నాడు నాటికి విజృంభించుచు బ్రజల వశంవదుల నొనర్చికొనుచుండ గ్రీస్తుశకము 1766-వ సంవత్సరమున మైసూరు ప్రభువు వార్ధకమున జనిపోవుట దటస్థించెను. ఆ సమయమందే పరాసుదేశవర్తకులు (French Traders) హిందూరాజ్యతంత్రమున జోక్యము గలిగించుకొనుచుండిరి. హైదరల్లీ పరాసువర్తకులతో మంతనముల జాగించుచు నాంగ్లవర్తకులతో ననగా బ్రాగ్భారత సంఘము (East India Company) తో విరోధించెను.

రాజకీయవ్యవహారములలో నిమగ్నుడై హైదరల్లీ యుక్కిరిబిక్కిరి యగుచుండగా, బూర్ణయ్య తన ధీబలోత్కర్షమున బ్రజల స్వాధీనము సేసికొని రెండవ మహీశూర యుద్ధము (Second Mysore War) నాటికి సరఫరా యుద్యోగి (Supply Officer) గా నుండి, నలుబదియైదు వేల యాశ్వికదళమును, ముప్పదివేల పదాతులను, 100 ఫిరంగులను-సమకూర్చుటయేగాక లక్షలకొలది వృషభశకటములతో యుద్ధరంగమున కాహార సామగ్రిని జేర్చునట్టు లేర్పాటొనర్చెను.

అప్పుడు చెన్నపట్టనమున గర్ణాటక నవాబును, బ్రాగ్భారత సంఘము (East India Company) వారును,-పెట్టుబడిదారులకు జాగాపాశనిబద్ధులకు లోబడియుండి హైదరల్లీ పూర్ణయ్యల ధాటి కాగలేకపోయిరి. క్రీ. శ. 1773 లో హైదరల్లీ చనిపోగా నతని కుమారుడు టిప్పుసులతానుడు మలయాళము (Malabar)లోని నాయరు విప్లవ మడంచుటకయి వెడలియుండెను. ఆ సమయమున బూర్ణయ్య మంత్రియే సర్వాధికారి. సర్వతంత్రస్వతంత్రుడు. పరిపాలనాదక్షుడు, బుద్ధిమదగ్రగణ్యుడునగు పూర్ణయ్య హైదరల్లీ మరణవార్త నొరులకు దెలియకుండ నాహజారమున దానే యుండి మంత్రరక్షణ మొనర్చి వార్త లందుటయే దుర్ఘటముగానున్న యా దినములలో విశ్వాస్యుడగు నొక యాశ్వికసైనికునిచే నాల్గువందల మైళ్ళ దూరమున నున్న మళయాళమునకు నాల్గు దినములలో నొరు లెఱుగకుండ హైదరల్లీ చనిపోయిన వార్తను టిప్పుసులతానున కందించెను. తండ్రివలె గుమారుడును ధైర్యస్థైర్యగాంభీర్య విక్రమోపేతుడు.

బ్రిటీషువారును, ఫ్రెంచివారును, రాజ్యాక్రమణ మొనర్ప దరుణ మెపుడు సేకూఱునాయని పొంచియున్న సమయమున బూర్ణయ్య మంత్రి యప్పటి రాజప్రతినిధి వారన్ హేస్టింగ్సు అనుమతి నంది టిప్పుసులతానుని భద్రసింహాసనాధిష్ఠితు నొనర్చెను. రాజప్రతినిధియగు వారన్ హేస్టింగ్సు భారతదేశమున గావించిన దుష్పరిపాలనమున కతిక్రుద్ధులై యేవగించి బర్కు-షెరిడను లాతని నింగ్లండునకు రావించి, నిందితు నొనర్చి శిక్షించిరి.

పరాసువారి (French people) స్నేహసాహచర్యముల నిరసించుచు సముద్రాధిపత్యమున నధికులని యనిపించికొనిన యాంగ్లేయులతో (British people) తో సఖ్యముగా నుండవలసినదని హైదరలీ తన మరణశాసనమున వ్రాసినను టిప్పుసులతాను డద్దాని బాటింపక స్వతంత్రించెను. కాగా, బ్రిటను టిప్పుసులతానుం జంపవలెననిగాని, పదచ్యుతు నొనర్పవలెననిగాని యుద్దేశింపకున్నను దమవశము సేసికొనదలచెను కాని శ్రీరంగపట్టణపు యుద్ధమున నాకస్మికముగ గుండుదెబ్బ తగిలి టిప్పుసులతానుడు చనిపోయెను. తోడనే రాజప్రతినిధియగు వెలస్లీప్రభువు రాజ్యాక్రమణపరతంత్రుడుకాడు గావున నొక కుటీరముననున్న ప్రాచీనరాజవంశములోనివాడగు నుమ్మడి కృష్ణరాజ ఉడయరును సింహాసన మెక్కించి, పూర్ణయ్య మంత్రిని రీజెంటు (Regent) గా నియమించెను. మైసూరురాజ్యమునకు బూర్ణయ్య మంత్రి యిప్పుడు సర్వతంత్రస్వతంత్రుడు.

ఇతని రాజనీతివేత్తృత్వము పరిపాలనాధౌరంధర్యము ప్రపంచదృష్టి నాకర్షించినది. సివిల్, మిలిటరీశాఖలకు రాష్ట్రవాసులనే యధిపతులనుగా నితడు నియమించెను. అంతతో దనివోక బకాయిపన్నుల రద్దు గావించెను. దేవాలయాల సంరక్షణకై యగ్రహారముల నొసంగి ప్రజాహితైకతత్పరుం డని విశ్రుతుం డయ్యెను. ఉద్యోగులలో లంచగొండితనమును నిర్మూలింప దలంపుగొని తత్తదుద్యోగుల బదభ్రష్టుల నొనర్చి, ప్రజలిచ్చు ప్రతిపైసయు గోశమున జేర్చి, సక్రమముగ వినియోగ మగునట్టు చండశాసన మొనర్చెను. అంతతో నూఱుకొనక దేశమందంతను బాళెగాండ్రతో సామంతులతో బర్యటించుచు, బత్యంశమును జాగరూకతతో బరిశీలించుచుండెను.

క్రీ. శ. 1805 వ సంవత్సరమున 'అదాలతు కోర్టు' నొకదాని నెలకొల్పి హిందూమహమ్మదీయుల నిద్దఱను న్యాయాధిపతులను (Judges)గా నియమించి, సైన్యనివహంబుల బలిష్ఠ మొనర్చెను.

ప్రభుసేనకై ప్రతికుటుంబము (family) ను నొక్కొక్క మనుష్యుని నంపునట్లు కట్టడిసేసి, 20 వేల దేశరక్షకుల (Civic Guards) ను గ్రామములను తత్పరిసరారణ్యములను బరిరక్షయొనర్చునట్టు లొనర్చెను. ఇమ్మహామంత్రి మైసూరు రాజ్యచరిత్రను రచించగా "మార్కు విల్కుసు" అనునత డాంగ్లభాషలో నద్దానినే "క్రీ. శ. 1810 వ సంవత్సర దక్షిణ భారత విఖ్యాత పురుష చరిత్ర" మను పేరితో బ్రకటించినాడు.

వెలస్లీ ప్రభువు తా నింగ్లండుదేశమున కేగకముందు తన ఛాయాచిత్రము (Photograph)ను క్రీ. శ. 1805 వ సంవత్సరమున బూర్ణయ్య మంత్రికి బహూకరించి యతని పరిపాలనా విశిష్టత నభినందించెను. క్రీ. శ. 1811 వ సంవత్సరమున బూర్ణయ్య "రీజెంటు" (Regent) పదవినుండి విరమించికొని విశ్రాంతి నందుచు గ్రీస్తుశకము 1812 వ సంవత్సరము మార్చి 29 వ తేదీన స్వర్లోకప్రస్థాన మొనర్చెను.

ఇమ్మతిమంతుని రాజకీయవేత్తృత్వమునకును, బరిపాలనా సౌష్ఠవమునకును, శక్తిసామర్థ్యములకును మింటో ప్రభు వెంతయో వినుతించెను. వర్తకులయొద్ద వ్రాయసకాడుగా జీవితము నారంభించి మహీశూర (Mysore state) రాజ్యమునకు, సర్వతంత్ర స్వతంత్ర ప్రభువుగా సుపరిపాలన మొనర్చి విశ్రుతకీర్తియైన ప్రతిభావంతుడు పూర్ణయ్య మంత్రి. ఆంగ్లవిద్యాపారంగతుడే సుపరిపాలన మొనర్పవలంతిగాని యన్యుడుగా డను దురభిప్రాయమునకితడు దిద్దుబాటు. క్రీ. శ. 1746 వ సంవత్సరప్రాంతమున నాంగ్లవిద్య యగపడదు. వీథిబడులలో నోనమాలునేర్చికొని ప్రభువులిచ్చిన మాన్యముల ననుభవించుచు, వారొసంగిన యగ్రహారములలో నివసించుచు, నుచితముగ విద్యాప్రదాన మొనర్చు నే విపశ్చిద్వరు నింటనో మధూకరవృత్తితో విద్య నభ్యసించుటయే యానాటి బ్రాహ్మణవిద్యార్థుల బ్రహ్మచర్య వ్రతముగా, తెలుగుచదువుతోడనే పని పుచ్చుకొని యే వర్తకునియొద్దనో, యే కార్యాలయము (Office) నందో, వృత్తికి గుదురుటయే సామాన్యబ్రాహ్మణ బాలుని నిత్య జీవితముగా, పరమప్రాప్యముగా నుండిన యా దినములలో బుట్టినవాడు పూర్ణయ్యమంత్రి.

ఇబ్బుద్ధిమదగ్రగణ్యునకు నా నమోవాకములు.

మోటుపల్లి ఓడరేవు

శ్రీ పెండెం వెంకట్రాములు

తెలుగుతల్లికి జన్మించిన రేవుపట్టణములలో మోటుపల్లిరేవు పురాతనమైనది; చాలగొప్పది. గుంటూరుజిల్లా బాపట్లతాలూకా చిన్నగంజామునకు మూడుమైళ్ళదూరమునందు మోటుపల్లి గలదు. వెలనాటికి ముఖ్యపట్టణమైనందున వేలానగర మనియు, మోసలదేశమునందుగల మోటుపల్లి యనియును, దేశాయికొండ పట్టణమనియును ఈరేవునకు మూడుపేర్లు గలవు.

సుమారు 2500 సంవత్సరములనుండి యున్నటుల తలంపబడుచున్నది. ఘరణికోట ధాన్యకటకములయొక్క ఆంధ్రసామ్రాజ్య మంతరించిన తరువాత ఈ రేవు క్షీణించినది.

ఓరుగల్లు సామ్రాజ్యమును 1199 సంవత్సరమునుండి పాలించిన కాకతీయ ప్రథమ గణపతిదేవ చక్రవర్తి వెలనాటిని జయించిన తరువాత స్వయముగా మోటుపల్లిని దర్శించి రేవునందుగల విదేశ వాణిజ్యసంప్రదాయములను తెలుసుకొని, తన ప్రతినిధిగా సిద్ధయదేవమహారాజును నియమించి క్రీ. శ. 1244 సంవత్సరమునందు ఇక్కడ గల వీరభద్రాలయ మంటపమునకు ఎదురుగా రేవురక్షణ అభయశాసనమును వేయించెను.

దేశాయికొండపట్టణ మనుపేర 178 పంక్తులలో ఈ శాసనము వ్రాయబడినది. "నాజీవితమునకన్నను నౌకావాణిజ్యమును జేయు సాహసికులగు నాప్రజల సంరక్షణమే నాకు నెక్కువ ప్రీతికరమైన విషయము" అని అభయశాసనమునందు 146 మొదలు 149 వ పంక్తివరకు వ్రాయించిన గణపతిదేవచక్రవర్తి పారిశ్రామికవాణిజ్యాభివృద్ధికరమార్గ మెంత అభిమానముతో కూడియున్నదో తేటపడుచున్నది.

గణపతిదేవచక్రవర్తికుమార్తె మహావీరవనిత తెలుగుసామ్రాజ్య సార్వభౌమురాలు అగు 'రుద్రమదేవి' పాలన కాలమునందు క్రీ. శ. 1296 సంవత్సరము వెన్నీసుయాత్రికుడు మర్కోపోలో మోటుపల్లి రేవునందు ఓడ దిగి ఓరుగంటికి వెళ్లెను.

మోటుపల్లి పరిసరగ్రామములందు తయారగుచున్న వస్త్రపరిశ్రమనుగూర్చి మిక్కిలి చక్కగా తెలియజేసియుండెను. వెండి, బంగారు సరిగ బుట్టాలు పనిజేసిన నూలుబట్టలు, పట్టుబట్టలు సాలెపురుగుబూజును మించిన ఉల్లిపొరకంటె మిక్కిలి సన్ననివస్త్రములు తయారగుచున్నవనియును మోటుపల్లి రేవుమీదుగా నెగుమతి చేయబడుచున్నవనియును తెలియజేసెను. మరియు వజ్రములకు ఈప్రాంతము ప్రసిద్ధిచెందియున్న దని గూడ తెలిపెను. ఓరుగంటి ప్రభుత్వపుకాలమునందు రేవురక్షకసైన్యములాదిగాగల రాజకీయ అధికారముతో వలసవచ్చిన ఓరుగంటిరెడ్ల కుటుంబములు వందలకొలదిగా మోటుపల్లి పరిసరగ్రామములందు నేటికిని గలవు.

సుమారు 150 సంవత్సరములు కాకతీయ ప్రభుత్వముక్రింద మోటుపల్లిరేవు మహావైభవముతో నలరారియుండెను. 1350 సం. అనంతరము ప్రతాపరుద్రునితో కాకతీయ ప్రభుత్వము నీరసించిన తరువాత కొండవీటి రెడ్డిరాజులు మోటుపల్లిని స్వాధీనము చేసికొనియుండిరి.

ఎఱ్ఱాప్రగడ హరివంశమును అంకితమును బొందిన "దేసటి పోలయవేమారెడ్డి" సోదరుడును, సర్వసేనానియునగు మల్లారెడ్డి కాకతీయ రేవు రక్షణసైన్యములను ఓడించి మోటుపల్లిని జయించెను.

"బాహాదర్పమునం బ్రతీపధరణీ
పాలావలిందోలి, యు
త్సాహోదగ్రుడు మోటుపల్లిఁ గొని స
ప్తద్వీప సద్వస్తు సం
దోహంబుల్ దన కిచ్చు నెచ్చెలి సము
ద్రుం బ్రీతిఁ గావించుచున్
మాహాత్మ్యంబు వహించె మల్లరథినీ
నాథుండు గాఢోద్ధతిన్."

మల్లయరెడ్డి విరోధిరాజులను పారద్రోలి మోటుపల్లిని జయించిన విషయము మహాకవి ఎఱ్ఱాప్రగడ తన హరివంశమునందుగల పై పద్యమున తెలిపియుండెను.

పోలయవేమారెడ్డి తరువాత అతనికుమారుడు పోతారెడ్డి మోటుపల్లివాణిజ్యమును పెంపుజేయుటకుగాను మోటుపల్లియందు తమ ప్రతినిధిగా పాలించుచుండిన సోమయామాత్యునిచేత క్రీ. శ. 1358 సంవత్సరము రేవురక్షణ అభయశాసనమును వీరభద్రాలయమునగల మంటపస్తంభమునకు చెక్కించెను.

(22 వ పేజీ చూడుడు)

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

అధికోత్పత్తి జరుగకుండుటకు కారణములు

పారిశ్రామికవేత్తల సమావేశం చర్చలవివరాలు

ప్రతిదేశంలోను పారిశ్రామికవేత్తలు తమ ప్రయోజనములను, హక్కులను రక్షించుటకు, తమపక్ష దృక్పథమును ప్రభుత్వమునకు నచ్చజెప్పుటకు తామందరు కలసి ఒక సంస్థ నేర్పరచుకొనుచుందురు. ఈ సంస్థలనే వాణిజ్యసంఘము లందురు. వాణిజ్యసంఘములు భౌగోళికావసరములనుబట్టి ప్రతిపట్టణమునకు, ప్రతిరాష్ట్రమునకొకటి చొప్పునను, పరిశ్రమల విభేదములనుబట్టి ప్రతిపరిశ్రమ కొకటిచొప్పునను ఏర్పడి, ఆయా ప్రాంతములలోని, ఆయా పరిశ్రమల యొక్క, పారిశ్రామికవేత్తల సౌకర్యార్థము పనిచేయుచుండును. ఒక దేశములోనున్న వాణిజ్య సంస్థలన్నియు కలసి ఒక కూటమిగా నేర్పడి దేశవాణిజ్య సంస్థను ఏర్పరచి, తద్వారా పారిశ్రామిక, వర్తకవర్గముల కష్టనష్టములను ప్రభుత్వమున కెరుకపరచుకొనుచునూ, ఆ వర్గముల అభ్యున్నతికి ఇతర విధముల కృషిచేయుచునూ ఆర్థికాభ్యున్నతికి కృషిచేయుచుండును. మనదేశమును బ్రిటిష్‌వారు పాలించుచున్నంత కాలము, మన దేశములోని బ్రిటిష్ వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఏర్పరచుకొనిన కేంద్రవాణిజ్య సంఘమగు అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్సు (కలకత్తా) ముఖ్యఆర్థిక విషయము లన్నింటిపైన వాణిజ్యవర్గపు దృక్పథమును వెల్లడించుచు, మంచి పలుకుబడిలో నుండెడిది. ఈ సంస్థ వారి కోర్కెలను బ్రిటిష్ రాజప్రతినిధి హాజరై, ప్రభుత్వవిధానమును గురించి ముఖ్య ప్రకటన చేయుచుండెడివాడు. బ్రిటిష్ పరిపాలన అంతరించుటతో ఈ సంఘము పలుకుబడి కొంతవరకు తగ్గినది. ఈ ప్రముఖస్థానమును భారత పారిశ్రామికవేత్తలచే స్థాపింపబడిన కేంద్ర వాణిజ్య సంఘమగు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్సు ఆఫ్ కామర్సు అండ్ ఇండస్ట్రీస్ (ఢిల్లీ) క్రమేణా ఆక్రమించుకొనుచున్నది. ఈ వాణిజ్యసంఘపు వార్షికోత్సవము గతవారము ఢిల్లీలో యం. ఏ. మాస్టర్ అధ్యక్షతన జరిగినది. భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈ సభకు ప్రారంభోపన్యాసము చేసినాడు. ఈ సభ కార్యక్రమ వివరములు పరిశీలించినచో, మన దేశములోని పారిశ్రామికవేత్తల దృక్పథము బోధపడగలదు.

త్రైపాక్షికసమావేశము యజమానులు

ఈనాడు భారతదేశ మొక ఆర్థికవిపత్తును ఎదుర్కొనుచున్నదను విషయము సువిదితమే. ఈ విపత్తునుండి బైటపడుటకు దేశములో వ్యవసాయిక, పారిశ్రామిక వస్తువులను అధికముగా ఉత్పత్తి చేయుటయే సులభమార్గమని కూడ మనకు తెలియును. యుద్ధానంతరము వ్యవసాయిక, పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తి ఆందోళన జనకముగా పడిపోయి, ధనోల్బణము, తద్వారా వస్తువులధరలు ప్రజల కష్టములు కూడ పెరిగిపోయినవి. ఇట్టి పరిస్థితినుండి తప్పించుకొనుటకు అధికోత్పత్తి కన్న అన్యమార్గము లేదు. కాని అధికోత్పత్తికి కార్మికులు సహకార మొనర్పకున్నారని యజమానులును, తమ జీతములు జీవనవ్యయమునకే సరిపోవుట లేదని కార్మికులును ఒకరిపై నొకరు ఆరోపణలు జరుపుకొనుచు అధికోత్పత్తి జరుపలేక పోయిరి. అందువలన ప్రభుత్వము యజమానులను, కార్మిక ప్రతినిధులను సమావేశపరచి, మూడు సంవత్సరములవరకు కార్మికులు సమ్మెలు జరుపకుండునట్లును, యజమానులు అధికోత్పత్తి జరుపుటకు కృషి చేయునట్లును ఒప్పించినది. ఈ సభకు హాజరయినవారు కార్మికులకు, యజమానులకు ప్రతినిధులుగా గాక తమ వ్యక్తిగతహోదాలోనే ఈ సభలో పాల్గొనియుండుటవలననూ, ఈ ఒప్పందము నుభగ్నపరచవలెనని ఇతర పక్షముల వారు తమ పలుకుబడి క్రిందనున్న కార్మికులను రెచ్చగొట్టి సమ్మెలు చేయించుటవలననూ, యజమానులు కూడ ఈ ఒడంబడిక అండ జూచుకుని కార్మికుల కోర్కెలను నిర్లక్ష్యము చేయుట వలననూ, అనుకున్నంతగా అధికోత్పత్తి జరుగలేదు. ఈ ఒడంబడికవలన సమ్మెలు కొంతవరకు తగ్గిన మాట వాస్తవమే. యజమానులకు కార్మికులకు మధ్య సంభవించిన తగాదాలకు మధ్యవర్తిత్వము ద్వారా పరిష్కరించుకొను విధానము ఇప్పుడెక్కువగా అనుసరింపబడుచున్నది. త్రైపాక్షికసమావేశమునకు ముందు రెండు నెలలలోను 53 తగాదాలు మధ్యవర్తిత్వము ద్వారా పరిష్కరింపబడినవి; ఆ సమావేశము తరువాత రెండు నెలలోను 77 తగాదాలు మధ్యవర్తిత్వముద్వారా పరిష్కరింపబడినవి.



సైన్యంలో కొత్తగా చేర్చుకున్నవారికి సైనిక ప్రాథమిక శిక్షకు అడ్డువచ్చే స్వల్పమైన అంగవైకల్యాలను నివారించే వైద్యశిక్షణా కేంద్రములో వ్యాయామము.

త్రైపాక్షిక సమావేశములో యంగీకరింపబడినట్లుగా అన్నివిషయములు అమలు జరుపబడినను అధికోత్పత్తి జరుగకపోవుటకు కార్మికులే కారణమని యజమానులు ఆరోపించిరి. "కార్మికులు ఎక్కువ రోజులు పని మానివేయుచుండుటవలనను, తమ ఉద్యోగపరిస్థితులననుసరించి వారిలో అసంతృప్తి ప్రబలియుండుటవలననూ, తగాదాలు పరిష్కరించుకొనుటకు కార్మికులు ఎక్కువగా సమ్మెలు ప్రారంభిస్తుండటమువలననూ, ఉత్పత్తి ఇంతగా తగ్గిపోవుచున్నది" అని మొన్నటి సమావేశమునకు అధ్యక్షత వహించిన యం. ఏ. మాస్టర్‌గారు ఆరోపించారు. కార్మికులవిషయమై సభలో అంగీకరింపబడిన తీర్మానములో, కార్మికుల జీతములు పెరిగినంతగా వారి ఉత్పత్తి-శక్తి పెరగలేదనీ, గరిష్ఠధరలు నిర్ణయింపబడుచో, గరిష్ఠ వేతనములు కూడ నిర్ణయింపబడవలెననీ, కార్మికులకు ఇవ్వవలసిన జీతములు దేశపారిశ్రామికాభివృద్ధిని, ఆపరిశ్రమ కల్గింపగలిగిన శక్తినిబట్టి నిర్ణయింపబడవలెననీ తీర్మానింపబడినది. దేశములోని ఒక రాజకీయపక్షము ఏవిధముగా నైనను అధికోత్పత్తికి ఆటంకము కల్గించవలెనని ప్రయత్నిస్తున్న ఈ రోజులలో ఇట్టి తీర్మానము కార్మికులను మరింత రెచ్చగొట్టుటకు మాత్రమే ఉపయోగపడును. దేశపారిశ్రామికాభివృద్ధి ఎట్టి స్థితిలో నున్నా, పరిశ్రమ ఎట్టి స్థితిలో నున్నా కార్మికులు తమ జీవనమునకు అవసరము జీతము లభించవలెనని పనిచేయు రనుట నిర్వివాదాంశము.

పన్నుల విధానము

మనరాష్ట్రీ, కేంద్ర ప్రభుత్వముల పన్నుల విధానములు పారిశ్రామికాభివృద్ధికి ఆటంకములుగా నున్నవని ఆందోళన చాల రోజులనుండి జరుగుచునేయున్నది. మన దేశ పన్నులవిధానము పూర్తిగా విచారింపబడి, పునర్నిర్మించింపబడవలసిన ఆవసరముకూడ గుర్తింపబడినది. కాని ఇది జరుగువరకు వేచియుండక, వెంటనే జరుపవలసిన సంస్కరణలను సూచిస్తూ ఒక తీర్మానము చేయబడినది. ఒక రాష్ట్రములోని ముడిపదార్థము, ఇంకొక రాష్ట్రములోని పరిశ్రమలో ఉపయోగింపబడి, ఆ తయారైన పదార్థము వేరొకరాష్ట్రములో అమ్మబడినప్పుడు, ఆ ముడిపదార్థముపై మూడురాష్ట్రములలోను మూడుపర్యాయములు అమ్మకపు పన్ను విధింపబడుచున్నది. ఇందువలన వర్తకమునకు ఆటంకము కలుగుచున్నది. ఇట్టి పన్నులను తొలగించి, రాష్ట్రముల మధ్య స్వేచ్ఛాపూరితముగా వ్యాపారము జరుగునట్లు చేయవలెనని పండిట్ నెహ్రూ కూడ సూచించినాడు ఈసంస్కరణ బహుశః నూతనరాజ్యాంగచట్టము అమలులోనికి వచ్చిన తరువాత ప్రవేశపెట్టబడవచ్చును.



డా. శ్రీ. వి. బాలయ్య పి. హెచ్. డి.

వీరిని మద్రాసు ప్రభుత్వము ఉన్నత విద్యకై, అమెరికా పంపిరి. అచ్చట కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో డాక్టరేటు బిరుదమును పొంది అమెరికా పరిశోధన సంఘ గౌరవ సభ్యులుగా ఎన్నుకొబడిరి. జూలైలో మరలి స్వదేశానికి వస్తున్నారు.

పరిశ్రమలను జాతీయ మొనర్చుట

తన ప్రారంభోపన్యాసములో పండిట్ నెహ్రూ పరిశ్రమలను జాతీయమొనర్చు విధానమునుగురించి ముచ్చటించెను. ఇప్పుడు నడచుచున్న పరిశ్రమలను ప్రభుత్వము వశపరచుకొనుటకన్న, క్రొత్తగా స్థాపింపబడు పరిశ్రమలను ప్రభుత్వపరముగా స్థాపించుట మంచిదని పండిట్ నెహ్రూ అన్నాడు. తామిన్నాళ్లనుండి లాభసాటిగా నిర్వహించుకుంటున్న పరిశ్రమలను ప్రభుత్వము వశపరచుకొనునేమో యని భయపడుచు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పారిశ్రామికవిధానమును స్పష్టముగా తెలియజేయవలసినదని కొద్దిరోజులనుండి కోరుచున్నారు. వీరి ఈ ఆందోళనమూలముననే అధికోత్పత్తి ఉద్యమము కొంతవరకు కుంటుపడినది. అందువలన ఈ మధ్యపార్లమెంటులో పండిట్ నెహ్రూ ఇట్టి ప్రకటననే చేసి వీరి శంకలను నివారించినాడు. ప్రభుత్వపారిశ్రామిక విధానము పూర్తిగా నిర్ణయింపబడిన తరువాత నైనను ప్రైవేటుగా నిర్వహించదగిన పరిశ్రమలు కొన్ని వుండగలవని కూడ పండిట్ నెహ్రూ ఆప్రకటనలో తెలియజేసెను. దాదాపు ఆ ప్రకటన అంశములనే పండిట్ నెహ్రూ ఇప్పుడు పునరుద్ఘాటించుట పారిశ్రామిక వేత్తలకు కొంత ధైర్యము చేకూర్చుటకే. ప్రభుత్వ పారిశ్రామిక విధానము త్వరలోనే ప్రకటించబడును.

కార్మికులను గూర్చి ప్రస్తావిస్తూ "కార్మికులకు సంతృప్తి మానసిక శాంతి లభించునట్లు చూచుట ముఖ్యమైన విషయము. కార్మికుల మనస్సులు చీకాకుగా నున్నప్పుడు, కల్లోలము రేకెత్తింప దలచుకున్న వారికి వారు సులభముగా వశపడిపోవుదురు" అని పండిట్ నెహ్రూ అనెను. కార్మికుల పట్ల ఇట్టి దృక్పథమే యజమానులకు కూడ అలవడినచో మనదేశములో సమ్మెలు ఇప్పటికే పూర్తిగా తగ్గిపోయి వుండెడివి. కార్మికశాఖామంత్రి జగజీవనరాంగారు ఈమధ్య ఒక్క ప్రసంగములో తెలియజేసినట్లు కార్మికులు పరిశ్రమలో భాగస్వాములుగా పరిగణించబడవలసిన రోజులు వచ్చినవి. భాగస్వాములుగా వారికి లభించవలసిన సౌకర్యములు లభించినప్పుడే కార్మికులు తమ బాధ్యతలను సక్రమముగా నెరవేర్చెదరు.

భారతప్రభుత్వ పారిశ్రామిక విధానముతోపాటు కార్మిక విధానము కూడ నిర్వచింపబడి, అవి సక్రమముగా అమలు జరుపుటకు తగిన ఏర్పాట్లు జరిగిననే గాని దేశములో అధికోత్పత్తి పారిశ్రామికాభివృద్ధి మనము ఆశించినంతగా జరుగనేరవు. ప్రతి యంత్రాగారములోను యజమానులు,

గ్రంథ పరిచయము



గణపతిశతకము

రచయిత—చదలువాడ జయరామశాస్త్రి గారు.

ఈ రోజుల్లోకూడా శతక కవులు ఉన్నారా అని సందేహించేవారికి గణపతిశతకం ఆశ్చర్యం కలగజేస్తుంది. పద్యాలలో శతకములకు కావలసిన ఉదాత్తభావాలు, శైలి అమరి వున్నాయి. కాని ప్రథమపద్యం చదివిన అనంతరం ఒక చిన్న పొరపాటువంటిది కన్పిస్తుంది కంద పద్యం పుటంతిమ పాదంలోని 'గణపతీ' అనే మకుటం పద్యపు నడకను కుంటు పరుస్తోంది. అక్కడవరకూ సాఫీగా వచ్చి గణపతీ అనటంలో నడక విరిగిపోతోంది.

కార్మికుల ప్రతినిధులు ఒక 'కార్యాచరణ సంఘము'గా ఏర్పడి, చేయవలసిన పని, యంత్రాగారములోని ఏర్పాట్లు, కార్మికుల ఇబ్బందులు, సౌకర్యములు మొదలగు విషయములను నిస్సంకోచముగా, చర్చించుకుని, ఉభయులకు అంగీకారయోగ్యముగా నుండు అధికోత్పత్తి మార్గముల నన్వేషించి, అమలుజరుపుకొనుటకు పూనుకొనుట యుక్తము. ప్రతియంత్రాగారములోను ఒక్కొక్క 'కార్యాచరణసంఘ'మే గాక, ఒక్కొక్కరకపు పరిశ్రమకు ఒక్కొక్క 'త్రైపాక్షిక సంఘము' ఏర్పడి, ఆ పరిశ్రమ సమస్యలను పరిష్కరించుకొనుట మంచిది. ఈ విషయములో, ఈ మధ్యనే ఏర్పరుచబడిన 'తోటల పరిశ్రమల త్రైపాక్షిక సంఘము' ఇతర పరిశ్రమలకు మార్గదర్శకముగా నున్నది.

కార్మికుల వైఖరి నింత విమర్శించిన పారిశ్రామిక వేత్తలు అధికోత్పత్తికి తా మనుసరింప నున్న పథకమును గురించి ఆలోచింపనేలేదు. కంట్రోల్ తొలగించినతరువాత ధరలను అనవసరముగా పెంచివేయవద్దని తమ సభ్యులకు ఒక్క సూచనయైన చేయనేలేదు. కొద్దిమొత్తము సుంకము పెంచుటవలన అగ్గిపెట్టెల ధరలను విపరీతముగా పెంచివేసి, ప్రభుత్వమే పోస్టాఫీసులద్వారా అగ్గిపెట్టెలు అమ్మించవలసిన పరిస్థితిని తెచ్చిపెట్టిన వర్తకులను ఈ సంస్థ రవ్వంతయైన మందలించనేలేదు. పరిశ్రమలలో కల్గుచున్న ప్రతిఅవాంతరమునకు బాధ్యత ఎవరోఒకరిపై నెట్టివేయుటవలన పారిశ్రామిక వేత్తల కార్యము సులభముకాదు; తమ సౌకర్యములను కొంతవరకు వదలుకొనియైనను పారిశ్రామికాభివృద్ధికి, అధికోత్పత్తికి తీవ్రముగా కృషిచేయుట పారిశ్రామిక వేత్తల కర్తవ్యము.

భాగవతకథ-1 వ భాగము

రచయిత-శ్రీ 108 ప్రభుదత్త బ్రహ్మచారి మహారాజా. అనువాదకులు-శ్రీ పందుర్తి వేంకట నరసయ్య. కావలసినవారు శ్రీ కృష్ణా బుక్‌డిపో, తెనాలికి వ్రాయవలెను.

ప్రసిద్ధిచెందిన భక్తియోగులు, హిందీ భాషలో అనేక భగవద్గ్రంథాలను రచించినవారు అయిన శ్రీ ప్రభుదత్తు లీ గ్రంథరచయితలు. ఈ గ్రంథం మనోరంజకంగా ఉండటానికి అనేక కారణా లున్నాయి. ఒకటి-దీనిలో ఆంధ్రదేశంలో ప్రచారంలో లేని క్రొత్త కథలు, అత్యుత్సాహకరమైనవి చాల వున్నాయి. రెండు—గ్రంథరచనలో మంచి హాస్యధోరణి వుంది. ఆ హాస్యంకూడా మనవంటి లౌకికులధోరణిలో కాక యమ నియమాది నిష్ఠలు కలిగిన మహాత్ముల ఆరోగ్యవంతమైన శైలిలో వున్నది. మూడు, భక్తునిచే రచింపబడిందిగనుక భక్తిరసపు పొంగులు వారుతున్నది.

దీనిని తెలిగించిన నరసయ్యగారు కూడా సారస్యం చెడకుండా, అనువాదం అనిపించకుండా నిసర్గమధురశైలిలో వ్రాశారు. ఈ ప్రశంసావాక్యాలు వ్రాశారు. రసపిపాసువులకు ఇది రసనిర్ఝరి.

ఇది ప్రథమభాగం మాత్రమే. బుద్ధునిలో యౌవనం తొంగిచూసే వయస్సువరకూమాత్రమే కథ చిత్రితమైనది.

"రామో"

గ్రంథ స్వీకారము

ఈ నాడు

(సాంఘిక నాటకం) రచన ఆత్రేయ. ప్రజాశక్తి ప్రచురణాలయం. బెజవాడ వెల 1-0-0

ఆదర్శప్రేమ

(నవల) వాండా వాసిలెవస్కా. అనువాదం ప్రవాసి. ప్రజాశక్తి ప్రచురణాలయం బెజవాడ. వెల రూపాయిన్నర.

మార్క్సిస్టు మూలసూత్రాలు

రచన నండూరి ప్రసాదరావు. (అఖిలభారత కిసాన్‌సంఘసభ్యుడు) ప్రజాశక్తి ప్రచురణాలయం. వెల రెండు రూపాయలు.



యూనిటీ పిక్చర్సువారి "సాయిబాబా"లో
గోపాలరావ్ దేశముఖ్ పాత్ర వహించిన శ్రీ అద్దంకి శ్రీరామమూర్తి

పుస్తకం దేవాలయాలలో హరికథాకాలక్షేపం జరిపేవారికి ఉపయుక్తంగా వుంటుంది. శైలి కూడా సులభధోరణిలో నున్నదిగనుక పామరులందరికీ తేలిగ్గా అర్థమౌతుంది.

* * *

కరుణశ్రీ

ఖండకావ్యము-రచయితజంధ్యాల పాపయ్యశాస్త్రిగారు. గ్రంథప్రాప్తిస్థానము: వాణీ బుక్‌డిపో భీమవరం. రామా అండ్ కో. గుంటూరు వెల 1-8-0.

దీనిలో బుద్ధభగవానుని అమరజీవిత చరిత్రం వర్ణింపబడింది. దొరకిన స్వల్పమాత్రపు చారిత్రక వివరాలపైననే యీ కావ్యసౌధం భావనా సహాయంతో నిర్మింపబడింది. కవికి పూర్వకవుల వ్యుత్పత్తి, ఆధునికుల ప్రతిభ చక్కని పరిమాణంలో అలవడ్డాయి. పద్యాలలో ఇతివృత్తానికి తగినశయ్యామాలాలిత్యం వుంది. కరుణరసం పరిపాకానికి వచ్చింది. ఈ కవికి కరుణరసం అత్యంతప్రీతిపాత్రమైనదని తెలపడానికి వీరి నామాంతరము "కరుణశ్రీ"యే గాక వీరి పూర్వకావ్యాలుకూడా నిదర్శనమే. ఉపమాలంకారంలో క్రొత్త మెలకువలు చూపించారు. కావ్యంలోని టెక్నిక్ ఆధునికపద్ధతులలో వున్నా, పద్యముల నడక, వర్ణనలు, కవిసాంప్రదాయాలు పూర్వీకులను పోలి వున్నాయి.

నండూరి రామకృష్ణాచార్యులవారు సాంగోపాంగంగా ఈ కావ్యసౌందర్యమును ఎత్తిచూపిస్తూ గ్రంథానికి ఉపశ్రుతి రచించారు. తల్లావజ్ఝలవారు "ఆలోకనము" అనే శీర్షిక

ఏరువాక

(ఉత్తమజీవితములు) పాఠ్యపుస్తకము. రచన పువ్వాడ శేషగిరిరావు. పబ్లిషర్సు: రావు బ్రదర్సు, తెనాలి. మూల్యము ఒక రూపాయి.


భారతజ్యోతి

(పద్యములు) గ్రంథకర్త రేపూరు సుబ్బారావు. ప్రతులకు: రచయిత, రామదాసు ఖండ్రిక గ్రామం, సర్వేపల్లి పోస్టు. నెల్లూరు తాలూకా.

పత్రికాస్వీకారము:

'విశాలాంధ్ర'

సెట్టి ఈశ్వరరావుగారి సంపాదకత్వాన వచ్చిన నూత్న మాసపత్రిక. 1/8 డెమ్మిసైజులో తామరకొలను ముఖచిత్రంతో పత్రిక ఇంపుగా ఉంది. శ్రీ శ్రీ, ఆరుద్ర, వాసిరెడ్డి భాస్కరరావు, చిట్టూరి సత్యనారాయణగార్ల పదకవితలు, వ్యంగ్య చిత్రాలు, కొడవటిగంటి కుటుంబరావు, తెన్నేటి సూరి, సెట్టి ఈశ్వరరావుగార్ల కథలూ, గోపాలరాయశర్మ గారి "బాపూజీబాల్యం" నాటిక ఉన్నయి. పాఠకులుకూడా పాల్గొనేందుకు కొన్ని శీర్షికలు, పాఠకులు ఆలోచించేందుకు కొంత మేతకూడా పాశ్చాత్య మేగజీనుల పద్ధతిలో కలిపారు. ఆంధ్రరాష్ట్రం, విశాలాంధ్రం, ఇవి నిర్మించటానికి అయిన కృషిలో సంపాదకీయమూ, గేయాలూ, కథలూ వ్యాసాలూ కూడా పాల్గొన్నాయి. విడిపత్రిక నాల్గణాలు. ప్రతులకు సెట్టి ఈశ్వరరావు, 9-C, సోమప్ప మొదలివీథి, మైలాపూర్, మద్రాసు.



శ్రీ గోనుగుంట్ల సుబ్రహ్మణ్యం గుప్తగారు
గుడివాడ మునిసిపల్ ఛైర్‌మన్

కొత్తరకం పాఠశాలలు

(13-వ పేజీ తరువాయి)

పాల్గొనును. మరీ ఫుట్‌బాల్, హాకీ, టెన్నిస్, క్రికెట్, వ్యాయామము మొదలగు ఇతరఆటలు, వ్యాయామము ఇచ్చట ప్రోత్సహించబడును. సంవత్సరం పొడగునా, ఒక నేర్పరి, విద్యార్థులకు సుగ్రపుస్వారి నేర్పుచుండును.

బ్రియాన్‌స్టన్‌లో విద్యార్థికి అన్నివిధముల అవకాశములు సంపూర్ణముగా వుండి, జీవితము ఆనందదాయకముగా గడచునని పైజెప్పినదానినిబట్టి తేలుచున్నది పాఠశాల జీవిత మనగా, ఒక గది పాఠములనుండి మరొకగది పాఠములకు విసుగుకొంటూవెడుతూ, ఎప్పుడూ చదువుతప్ప మరేమీ ఎరగని 19 వ శతాబ్దకాలపునాటి పాఠశాలలకు ఈ పాఠశాలకు ఎంత తేడా వున్నది! బ్రియాన్‌స్టన్‌లోని ఈ వాతావరణములో చదువు ఆనందదాయకమైన సాహసకృత్యముగా పరిణమించి, భవిష్యత్తులో ఎదుర్కొనవలసిన జీవితసమస్యలకు ఒక నాందిగానుండును. ఈ విద్యావిధానమే, తన విద్యార్థి దశ గడచిన తరువాత విద్యార్థి గడుపవలసిన జీవితమునకు తగిన శిక్షణను ఇవ్వగల్గును. బాధ్యతానిర్వహణ శక్తిని, ఆత్మవిశ్వాసమును విద్యార్థికి ఈ విద్యావిధానమే కల్గించును. తనకుతానై ఆలోచించుట, విజ్ఞానరంగములో తానై విహరింపగల్గుట, తన ఆశయములను తన వాతావరణమునకు తగినట్లుగా సరిదిద్దుకొనుట విద్యార్థికి ఈ విద్యావిధానము బోధించును.

సాహసకృత్యములకై ఆటవిడుపు

బ్రియాన్‌స్టన్ పాఠశాలలోని మరొక ప్రత్యేకతను—'మార్గదర్శకుల విధానమును'—గురించి ఇచ్చట ప్రస్తావింతును. ఇది స్వచ్ఛందముగా ఏర్పడిన సమితిగాక, పాఠశాల బోధనక్రమములో ఒకభాగము మాత్రమే. పౌరసత్వవిధులలో విద్యార్థులకు వాస్తవము, నిర్మాణాత్మకమునైన శిక్షణ యిచ్చుట, తద్వారా వారిలో తెలువ, చొరవ అభివృద్ధిపరచుట ఈ విధానము యొక్క ఉద్దేశ్యాలు పర్వతము లెక్కుట, సముద్రయానము చేయుట మొదలగు సాహసకృత్యములు చేయుటకు, జీవితములో అనేకరంగములలో పనిచేస్తున్న వారితో కలసి—ముఖ్యముగా ఆర్తులతోను, విదేశీయులతోను—పనిచేయుటకు ఒక్కొక్క జట్టుకు ప్రత్యేకముగా సెలవలు యిచ్చి ప్రోత్సహించుట ఈ విధానముక్రిందనే వచ్చును.

పాఠశాల జరుగుచున్న రోజులలో "మార్గదర్శకుల విధానము" పాఠశాలకు పనిచేయుటయందే ప్రదర్శింపబడును. పాఠశాలకు పెద్ద ఆవరణ వున్నది. ఆ ఆవరణలో ప్రతివిద్యార్థి వారమునకు ఒకరోజు ఏదో ఒకపని చేసి తీరవలెను. తానేపనిచేయునో నిర్ణయించుకొనుటకు అతనికి అవకాశమున్నది. విద్యార్థులు ఏడుగురు కలసి ఒక జట్టుగా ఏర్పడి, తమలో ఒకరిని నాయకునిగా ఎన్నుకొని, కలసి పనిచేసెదరు. ఈ పనివలన విద్యార్థులలో పరస్పర సహకారము, నిర్మాణాత్మక కార్యనిర్వహణ చాతుర్యము పెంపొందును. తమ అవయవములను చాతుర్యముతోడ ఉపయోగించుటయందు వారికి శిక్షణ యిచ్చి కాయకష్ట జీవితమన్నదేమో వాస్తవముగా అనుభవముద్వారా వారు తెలిసికొనుటకు ఈ విధానము చక్కగా ఉపకరించును.

యుగసంధి

(6 వ పేజీ తరువాయి)

తీసుకువెళ్ళి విశ్వవిద్యాలయంలో చేర్చాడు. వరసగా మూడు సంవత్సరాలు శీతకాలంలో పీటర్స్‌బర్గు వెళ్లి కొడుకుదగ్గర ఉండి వస్తుండేవాడు. ఆరోజుల్లో అతడు సామాన్యంగా ఇల్లు కదిలేవాడు కాడు. ఆర్కాడీ స్నేహితులతో పరిచయం కలగజేసుకోడానికి ప్రయత్నించేవాడు. క్రితం శీతకాలంలో మాత్రం అతడు వెళ్ళలేకపోయాడు. ఈ 1859 మే లో మనం అతన్ని చూసేనాటికి అప్పుడే అతనితల పూర్తిగా నెరిసిపోయింది. శరీరం కొంచెం లావెక్కింది. నడుము కొంచెం వంగింది. కొడుకు పట్టభద్రుడయి ఆ రోజున ఇంటికి వస్తున్నాడు. అతని కోసం ఎదురుచూస్తూ అక్కడ కూర్చున్నాడు. తనూ ఇల్లాగే ఒకప్పుడు పట్టభద్రుడయాడు.

సేవకుడు, మర్యాదగా—కొంత యజమాని కళ్ళముందు ఉండడం ఇష్టంలేక, ఘాటి గుమ్మం దగ్గరకుపోయి పొగతాగుతూ కూర్చున్నాడు. నికోలై పెట్రోవిచ్ తల వాల్చి సున్నం రాలిపోతున్న మెట్లపైపు పరధ్యానంగా చూస్తున్నాడు. ఒక పెద్ద చుక్కచుక్కల పిట్ట గంభీరంగా అతని వేపు నడుస్తూ వచ్చింది; పెద్ద పసుపురంగు కాళ్ళు దృఢంగా నేలమీద అనుతున్నాయి. ఒడలంతా మట్టి అయిన ఒక పిల్లి అతని వేపు అనాదరంగా చూసి, ఇనప కమ్ములను గారంకుగా, రాసుకుంటూ వెళ్లిపోయింది. ఎండ మాడుస్తోంది. ఆ విశ్రాంతి గృహంలో సగం చీకటిగా ఉన్న నడవలోంచి వేడివేడి రొట్టెవాసన వస్తోంది. నికోలై పెట్రోవిచ్ స్వప్నావస్థలో పడ్డాడు. "నా అబ్బాయి...పట్టభద్రుడు...ఆర్కాషా," మొదలయిన ఊహాలు తిరిగి తిరిగి అతని మెదడులోకి వస్తున్నాయి. ఇంకేమయినా ఆలోచించాలనుకున్నాడు. కాని ఆ ఊహాలే మళ్లీ తయారయాయి. చచ్చిపోయిన అతని భార్య జ్ఞాపకం వచ్చింది. "ఇది చూసేదాకా అయినా ఆమె బ్రతకలేదు" అని విషాదంగా అనుకున్నాడు. బలిసిన ముదురు నీలిరంగుగల పావురం ఒకటి రోడ్డుమీదికి ఎగిరింది. దగ్గరగా ఉన్న ఒకగుంట దగ్గర నీటికోసం వాలింది. నికోలై పెట్రోవిచ్ దానివేపు చూస్తున్నాడు. ఇంతలోకే రోడ్డు ఎటువని బండిచక్రాల చప్పుడు అతని చెవిని పడింది.

"వారు వొస్తున్నట్టు వుందండయ్యా," అన్నాడు సేవకుడు, గుమ్మంమీదినుంచి కిందకు దిగుతూ.

నికోలై పెట్రోవిచ్ ఎగిరిలేచాడు. కళ్ళు రోడ్డువేపు వంచాడు. ముందు మూడు గుర్రాలు కట్టిన బగ్గీ ఒకటి వస్తోంది. బగ్గీలో దృశ్యాదృశ్యంగా విద్యార్థుల టోపీలకు ఉండే గీతరంగు ముడత అతనికి కనబడింది, ఆప్తమయిన ఒక ముఖంయొక్క అంచులుకూడా కనబడ్డాయి.

"ఆర్కాషా! ఆర్కాషా!" అని ఆదరంగా అంటూ, తన చేతులను ముందుకుసాచి కిర్సానావ్ పరుగెత్తుతూ వెళ్ళాడు......కొద్ది క్షణాలు గడచిన తరవాత అతని పెదవులు దుమ్ముపడిన, గడ్డంమొలవని, ఒక పట్టభద్రుడయిన యువకుని చెక్కులు ముద్దు పెట్టుకున్నాయి.

౨

"నన్ను ముందు ఒళ్లు దులుపుకోనియ్యి, నాన్నా!" అన్నాడు ఆర్కాడీ. అతని గొంతుక ప్రయాణంవల్ల అలిసిపోయిఉన్నా, కుర్రతనపు స్వచ్ఛతతో తీగలాగ మ్రోగింది. తన తండ్రి కౌగిలింపులకు ఆహ్లాదంగా వొంగుతూ అన్నాడు: "నిన్ను దుమ్ముతో ముంచెత్తుతున్నాను."

"ఫరవాలేదు, ఫరవాలేదు" అన్నాడు నికోలై పెట్రోవిచ్. ప్రేమగా చిరునవ్వు నవ్వాడు. కొడుకుకోటూ, తనకోటూకూడా మెడలదగ్గర రెండుసార్లు చేతితో దులిపాడు. "ఏది, చూడనియ్యి. నన్ను చూడనియ్యి" రెండు అడుగులు వెనక్కి వేస్తూ అన్నాడు. వెంటనే బళ్ల ఘాటే ఆవరణ వేపు తొందరగా నడుస్తూ కేక వేశాడు: "ఇల్లాగ, ఇల్లాగ రండి. తొందరగా గుర్రాలు కట్టండి."

నికోలై పెట్రోవిచ్ తన కొడుకుకంటే ఎక్కువ ఆందోళన పడుతున్నట్టు కనిపించాడు. కొంచెం కంగారు పడుతున్నట్టు, కొంచెం బెదురుతున్నట్టు కూడా ఉన్నాడు. ఆర్కాడీ అతన్ని వెనక్కి పిలిచాడు.

"నాన్నా"—అన్నాడు, "ఇతను నాకు చాలా ముఖ్యస్నేహితుడు, బజరోవ్. నీతో చాలాసార్లు చెపుతూవచ్చానే అతనే ఇతను. మన ఇంటిదగ్గర కొంతకాలం ఉంటానని అతని దగ్గర మాట పుచ్చుకున్నాను".

నికోలై పెట్రోవిచ్ గబగబా వెనక్కి వచ్చాడు. అప్పుడే బండిలోనించి దిగిన పొడుగుపాటి యువకునికిదగ్గరకు వెళ్లాడు.

అరడు పొడుగైన వదులు కోటు తొడుక్కున్నాడు. కోటుకి నడుము దగ్గర పటకాలున్నాయి. అతడు వెంటనే పెట్రోవిచ్‌కి తన చేతిని ఇవ్వలేదు. నికోలై పెట్రోవిచ్ అతని ఎర్రటి చేతిని ఆప్యాయంగా తనచేతిలోకి తీసుకుని నొక్కాడు.

"నాకు చాలాసంతోషంగా ఉంది" అంటూ మొదలుపెట్టాడు: "మాతో కొంతకాలం ఉండడానికి ఒప్పుకున్నందుకు చాలా కృతజ్ఞుణ్ణి. మీ పేరూ, మీతండ్రిగారి పేరూ ఏమిటి?"

"యువ్‌గనీ వాసిలీవ్" అన్నాడు మెల్లగా మందంగా. అయినా అతని గొంతుకలో మగతనపు ధీమా ఉంది. తనకోటు మెడపట్టీని వెనక్కి మడిచాడు. అతనిముఖం అప్పుడు పూర్తిగా నికోలై పెట్రోవిచ్‌కి కనబడింది. ముఖం పొడుగ్గా సన్నగా ఉంది. వెడల్పైన నుదురు. ముక్కు పైన బల్ల పరుపుగానూ కొసను సూటిగానూ ఉంది. పెద్ద ఆకుపచ్చ కళ్ళు. చెక్కులమీద పగంవరకు పెరగనిచ్చిన వెంట్రుకలు ఇసుకరంగుగా ఉన్నాయి. ప్రశాంతమయిన చిరునవ్వుతో ముఖం మెరుస్తోంది. తీక్ష్ణమయిన తెలివి, ఆత్మవిశ్వాసం ముఖంలో సూచితమవుతున్నాయి.

"యువ్‌గనీ వాసిలీచ్! మాఇంట్లో మీకు విసుగెత్తకుండా ఉండాలని నా కోరిక" అన్నాడు నికోలై పెట్రోవిచ్.

బజరోవ్ సన్నని పెదవులు కొద్దిగా కదిలాయి. కాని అతను సమాధానం చెప్పలేదు. తన టోపీని మాత్రం తీసివేశాడు. అతని జుట్టు ఒత్తుగా ఉన్నా అతని నెత్తిమీద ఎత్తుగా ఉన్న బొణిపిలు కనబడుతూనే ఉన్నాయి.

"అయితే ఆర్కాడీ"—నికోలై పెట్రోవిచ్ తన కొడుకుని ఉద్దేశించి అన్నాడు: "వెంటనే గుర్రాలను పూన్చమంటావా, లేకపోతే కొంచెం సేపు విశ్రమిస్తారా?"

"ఇంటికి చేరుకున్నాక విశ్రమిస్తాం నాన్నా' గుర్రాలను కట్టమను".

"వెంటనే కట్టిస్తా; వెంటనే" అన్నాడు తండ్రి. "ఏయ్, పీటర్, వినబడిందా? తొందరగా సిద్ధంచెయ్యి. తొందరగా".

పీటర్ కొత్తతరానికి చెందిన సేవకుడుగనక తన చిన్న యజమాని చేతిని ముద్దుపెట్టుకోలేదు. దూరంగా నిలిచి తలవంచాడు. ఘాటీ గుమ్మంలోనించి లోపలికి వెళ్లాడు.

"మన పెట్టిబండి తోలించుకుని వచ్చాను. మీ బగ్గీకికూడా మూడు గుర్రాలున్నాయే!" అన్నాడు నికోలై పెట్రోవిచ్ ఆడంబరంగా. ఆర్కాడీ, ఘాటీశాలాకు ఆడమనిషి తెచ్చిపెట్టిన మంచినీళ్లు తాగాడు. బజరోవ్ పొగ గొట్టం పీలుస్తూ గుర్రాలను పూనుస్తున్న బండివాడి దగ్గరకు వెళ్లాడు. "మన పెట్టిబండిలో ఇద్దరికే చోటు ఉంది. నీస్నేహితుడిసంగతి..."

"అతను బగ్గీలో వస్తాడులే" అన్నాడు ఆర్కాడీ మెల్లగా తండ్రికి వినబడేటట్టు. "అతని దగ్గర ఈమర్యాదలూ అవీ నువ్వు ఆట్టే చూపించకూడదు. చాలా అద్భుతమయిన మనిషి. ఎంత నిరాడంబరమయినవాడనుకున్నావు. చూస్తావుగా."

నికోలై పెట్రోవిచ్ బండివాడు గుర్రాలను తోలుకువచ్చాడు. "రా. తొందరగా కానీ వోయి, బిరుసుగడ్డం!" అన్నాడు బజరోవ్ బండితోలేవాడితో.

"మిట్యూహా, వినపడిందా" అన్నాడు ఇంకో బండివాడు, గొర్రెతోలుకోటు మడతలోకి తనచేతులు వెనక్కి ముడుచుకుని పక్కగా నిలబడ్డాడు. "బాబుగారు ఏమన్నారో విన్నావా? నువ్వు సరిగ్గా బిరుసుగడ్డమే."

మిట్యూహా సమాధానం చెప్పకుండా టోపీని నొక్కుకున్నాడు. నురుగలు కక్కుతున్న గుర్రం నోట్లోనించి కళ్లెం తీశాడు.

"తొందరగా కానీ, తొందరగా. అబ్బాయిలూ, ఒక చెయ్యి వెయ్యండి" అన్నాడు నికోలై పెట్రోవిచ్. "తాగుడుకి కొంచెం ముడుకుంది లెండి."

కొద్దిసేపటికి కొత్త గుర్రాలను బళ్లకి పూన్చడం అయింది. పెట్టి బండిలో తండ్రి, కొడుకు కూర్చున్నారు. పీటర్ ముందు ఎక్కాడు. బజరోవ్ బగ్గీలోకి ఎక్కాడు. తోలుకుట్టిన మెత్తమీద సుఖంగా జేర్లబడ్డాడు. రెండుబళ్లూ కదిలాయి.

మోటుపల్లి ఓడరేవు

(19 వ పేజీ తరువాయి)

పోలయ వేమారెడ్డి మోటుపల్లిని సకలవిధముల అభివృద్ధి చేయుటకుగాను వ్యాపారస్థులకును, వ్యాపారమునకును సమస్తసౌకర్యముల నొనగూర్చుటకు ఏర్పాటు గావించెను.

తన శాసనమునందు పరదేశములనుండి వచ్చెడి వ్యాపారులకు మోటుపల్లెలో కాపురముండుటకును, సరకులు నిలువ యుంచుటకును, వ్యాపారము చేసికొనుటకును, కావలసిన ఇండ్లు నిర్మించుకొనుటకును భూముల నిచ్చెదనని తెలియజేసెను. ఆ భూములందు దొరకు నిక్షేపములను గూడ వారే పొందవచ్చును. వ్యాపారార్థము యే దేశమునుండి యే సరకులు తెచ్చి విక్రయించినను ఆక్షేపించువాడను కాను. కారణాంతరముల చేత వ్యాపారులు పరదేశముల కేగవలసివచ్చిన యెడల స్వేచ్ఛగా వెళ్ళుటకు ఏలాంటి ఆటంకమును కలిగింపను. ముఖ్యమైన దిగుమతి సరకులకు ఎట్టి సుంకమును గైకొనను. అని తెలిపి సర్వరక్షణ లిచ్చి పట్టణమున వ్యాపారమును మిక్కిలి బాహుళ్యముగా పెంచెను.

అనపోతారెడ్డి యనంతరము అతని కుమారుడు కుమారగిరిరెడ్డి 1362 సం. మొదలు 1380 సంవత్సరమువరకు కొండవీటిని పాలించియుండెను. ఈ కుమారగిరిరెడ్డి తన మోటుపల్లి రేవునుండి వసంతోత్సవములకు తెప్పించు వస్తుసముదాయమునుగూర్చి కవిసార్వభౌమ శ్రీనాథుడు హరవిలాసమునందు చీనా, సింహళం, హూణ్మరజ్ తవాయి, బర్మా, పండువా, గోవా, మున్నగు రేవులనుగూర్చి ప్రస్తావించియుండెను.

రెడ్డిరాజులతో మోటుపల్లి సుమారు 25సం.ల కన్న ఎక్కువకాలము వుండలేకపోయినది. కుమారగిరి రెడ్డి పాలించుకాలమున విజయనగర సార్వభౌముడు రెండవ హరిహరరాయలు మోటుపల్లిని జయించెను. తన కుమారుడగు 'దేవరాయ ఒడయులు'ను తన ప్రతినిధిగా మోటుపల్లియందు నివాసముండుటకు ఏర్పాటుజేసెను. యువరాజు మోటుపల్లియందు నివాస మేర్పరచుకొనుటచేత ఈరేవుపట్టణమునకు గల సకలయిక్కట్టులు తీరిపోవుటయేగాక నవ్యశోభగూడ చేకూరినది. దేవరాజ ఒడయరు 1390 సం.న మోటుపల్లియందు ఒక ధర్మశాసనమును వేయించెను.

మోటుపల్లి కర్ణాటసార్వభౌముల వశమగు నాటికి పరిశ్రమలయందును, వాణిజ్యమునందును చాల అభివృద్ధిజెందియుండెను. ఇక్కడ గల పరిశ్రమలలో వస్త్రపరిశ్రమ అత్యున్నత స్థానమును పొందియుండెను. చీనా, జపాను, అరేబియా, పర్షియా, జాంజిబారు, సింహళము, బర్మా, మున్నగు దేశీయులు మోటుపల్లియందు వాణిజ్యార్థమై నివాసముల నేర్పాటుజేసుకొని ఈప్రాంతమున తయారగు వస్త్రరాజములను పోటీపడి ఎప్పటికప్పుడు కొని విరివిగా విరామములేక ఎగుమతిని చేయుచుండెడివారు.

ఈరేవుప్రాంతమునందుగల వస్త్రవ్యాపారులు దేశాంతరములకు ఎగుమతిచేయుటకుగాను తయారుచేయించు రత్నకంబళులు, కలంకారీ అద్దకముల వస్త్రములు, బంగారుసరిగ చేర్చబడిన తెల్లనూలు వస్త్రములు మున్నగు వస్త్రముల పేర్లు దేవరాయఒడయరు చెక్కించిన శాసనమునందు గలవు. పై వస్త్రములపట్టికను బట్టిన్ని, వస్త్రవాణిజ్య ప్రాబల్యమునుబట్టిన్ని చూడగా ఈ ప్రాంతమునందు వేలకొలది వస్త్రనిర్మాతల కుటుంబములు ఆనాటికే యుండియున్నవనియును, మిక్కిలి పనితనముతోకూడిన వస్త్రరాజములను తయారుచేయగల వస్త్రశిల్పులకు మోటుపల్లిప్రాంతము ప్రాచీనకాలమునుండి ప్రసిద్ధి కలిగి యున్నదనియును వేరుగ తెలుప నక్కరలేదు.

మోటుపల్లికి ఎనిమిదిమైళ్ళ దూరమునందు గల చీర్యాలకు సమీపమునందు పాతచీరాల పేరగల శిథిలనగరము కలదు. చీర=వస్త్రము, ఆల=నిలయము, చీరాల=వస్త్రనిలయము. ఈ పేరునుబట్టి మోటుపల్లి రేవుయొక్క ప్రసిద్ధ వస్త్రవ్యాపారకాలమునకు సమకాలికమైన పాడుబడిన పాత 'చీరాల' నగరముయొక్క నామమువలననే సుప్రసిద్ధ వస్త్రరాజములను ఉత్పత్తితో పూజ్యత గొన్న నగరమని చక్కగా తేటపడుచున్నది.

మోటుపల్లినుండి నమ్మకమైన రంగులతోను, ముద్దులు మూటగట్టు పనితనముతో కూడియున్న కలంకారీవస్త్రములుగూడ చాల ప్రసిద్ధి గణించినవి. కలంకారీ లద్దుటకు కావలసిన మూలికలు ఈనాటికిని ఈ ప్రాంతమున గలవు. ప్రాచీన సంప్రదాయపు కలంకారీ లద్దు కుటుంబములు గూడ ఈ ప్రాంతమునందు అధికముగా గలవు.

మోటుపల్లి ఓడరేవుగా ప్రసిద్ధిచెందుటకు గల అవకాశములలో ప్రధానమైనది రొంపేరు. ఈ రొంపేరు వర్ష జలములతో కూడి బాపట్ల తాలూకాయందు ప్రవేశించి మోటుపల్లివద్ద సముద్రములో కలియుచున్నది. సముద్రము నుండి ఓడలు సరాసరిరొంపేరుముఖద్వారముగుండా ఒకటిరెండు మైళ్ళు ఏటిలోనికి చొచ్చుకొని వచ్చి సరకులు దింపుటయును, ఎగుమతి చేయుటయును జరుగుచుండెడిది. అట్టి గుర్తులు కల మట్టి దిబ్బలు నేటికిని కానవచ్చుచున్నవి.


మోటుపల్లికి సమీపమున గల పెదగంజాము యొక్క నామమునుబట్టి గంజ్=అనగా ధాన్యము విక్రయించుచోటు, అని ప్రాచీనకాలమునుండి వాడుక గలదు. ఈనాడుగూడ సంత,మార్కెట్ గంజ్ అనుపేర్లు వస్తువిక్రయప్రదేశములను పిలుచుటను గూర్చి అందరకు తెలిసిన విషయమై యున్నది.

మోటుపల్లియందు శిథిలమైన భవనముల దిబ్బలలో బౌద్ధస్తూపశిథిలదిబ్బ గలదు. అన్నిప్రాంతములవలెనే ఈదిబ్బ కూడ లంజదిబ్బ యని పిలువబడుచున్నది. ఈ దిబ్బమీద ఈభవనము పైకప్పున కుపయోగించిన మట్టిపెంకులు రెండున్నరఅంగుళముల వెడల్పు మూడు అంగుళముల పొడవు గలవి గలవు. ఈ పెంకులలో ప్రతిదీ వికిగియే యున్నది. ఇంత చిన్న పెంకులతో పైకప్పు గల ఈ భవననిర్మాణ మెంత అలంకారము గలిగియున్నదో గాని,యూహించుటకుగూడ సాధ్యము గాకున్నది.


మోటుపల్లియందు గల వాణిజ్యము పెక్కువగా వీరశైవులగు లింగాయతుల స్వాధీనమునందుండెడిది. మోటుపల్లికి సమీపమునగల కవల పట్టణము, లేక కనుపర్తి అను నగరము మోటుపల్లికి సమకాలికమై లింగాయతులకు నిలయమై సకలసంపదలతో అలరారిన మహానగరము.

మోటుపల్లికి చుట్టుప్రక్కల కొన్నిమైళ్ల దూరమువరకును శిథిలభవనముల దిబ్బలను విరివిగా చూడగలము. ప్రతిదిబ్బమీదను ఆ భవన నిర్మాణమున కుపయోగించిన ఇటుక, పెంకుల యొక్క ముక్కలు చెక్కలు గలవు. ఈ పరిశీలనవలన ఈ నగరము కొన్నిమైళ్ల విస్తీర్ణము కలిగి నూటఒక్క దేవాలయములతోడను బ్రహ్మాండమైన పరిశ్రమలు, పారిశ్రామికుల నిలయములతోడను, ప్రశస్తవాణిజ్యకర్తలతోడను సుమారు 2000 సం. పైగా 16వ శతాబ్దమువరకు విరాజిల్లియున్నది.


ఇండియా పాకిస్థాన్ సరిహద్దు



పాకిస్థాన్‌కు పోతున్న కారను ఇండియా ప్రభుత్వ ఉద్యోగులు సోదా చేస్తున్నారు.




ఇండియా పాకిస్థాన్ సరిహద్దులో పాకిస్తాన్ రక్షకభటుడు;



సరిహద్దుకు వెళ్ళదలచినవారు తమ పేర్లను, ఏ పనిమీద వెళ్ళుతున్నదీ వివరాలన్నీ ముందుగా పోలీసుభటులకు తెలియజేయాలి. పోలీసు ఉద్యోగి కొంతమంది పేర్లను వ్రాసుకుంటున్నాడు.



పశ్చిమ దిక్కున సరిహద్దు గుర్తుగా భారత అధినివేశ పతాకాన్ని ప్రతిష్ఠించివుంచారు డోగ్రా రెజిమెంట్ సైనికులు కాపలా కాస్తున్నారు: ఇద్దరు భారతపౌరులు తమ ముస్లింమిత్రులు చూడడానికి సరిహద్దు దాటి పాకిస్థాన్‌కు వెళ్ళుతున్న దృశ్యం.



గత విషాదసంఘటనలకు సిగ్గు, విచారాన్ని కనపరుస్తూ సిక్కు, ముస్లిం మిత్రులు ఇద్దరు గాఢాలింగనం చేసుకుంటున్నారు.



రంగూన్‌లో గాంధీజీ అస్థికలను బర్మాప్రభుత్వము ఊరేగింపుతో తీసుకెళ్తున్న దృశ్యం.



ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ సహాయకార్యదర్శి సర్దార్ గౌతు లచ్చన్నగారి వివాహసందర్భపు దృశ్యం.

Regd. No. M 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T Madras.

Q. H. M. S. No. 857—10,000 Copies